సమావేశము – VI
వాల్యూము – III
నెం. 5

వెల : రూ. 14-00
5 జనవరి, 2017
గురువారం,
(శక సం. 1938,
పుష్య – 15)

# తెలంగాణ శాసన పరిషత్తు కార్యకలాపాలు

## అధికార నివేదిక

విషయ సూచిక

I. ప్రశ్నోత్తరాలు ... 1

II. సభా సమక్షంలో ఉంచబడిన పత్రాలు ... 11

III. సభా కార్యక్రమం : ... 11

1. ప్రత్యేక ప్రస్తావనలు
2. వాయిదా తీర్మాన తిరస్కరణ

IV. లఘు చర్చ : ... 13

ప్రగతి పథంలో సింగరేణి కార్మికుల సంక్షేమం గురించి

V. లఘు చర్చ (కొనసాగింపు) ... 27

# తెలంగాణ శాసన పరిషత్తు

## ప్రధాన అధికారులు

| | | |
|---|---|---|
| ఛైర్మన్ | : | శ్రీ కె. స్వామిగౌడ్ |
| డెప్యూటీ ఛైర్మన్ | : | శ్రీ నేతి విద్యాసాగర్ |
| కార్యదర్శి | : | డా. ఎస్. రాజ సదారామ్ |
| సంయుక్త కార్యదర్శి | : | డా. వి. నరసింహాచార్యులు |
| సహాయ కార్యదర్శులు | : | శ్రీ టి.బి. జయచందర్<br>శ్రీ ఎస్. దుర్గాప్రసాద్<br>శ్రీ సి.హెచ్. ఉపేందర్ రెడ్డి<br>శ్రీమతి వి.ఎన్. ప్రసన్నకుమారి |
| చీఫ్ రిపోర్టర్ | : | శ్రీమతి యస్. నాగమణి |

# తెలంగాణ శాసన పరిషత్తు కార్యకలాపాలు

## అధికార నివేదిక

## (ఆరవ సమావేశము – పదిహేనవ రోజు)

## గురువారం, జనవరి 5, 2017

(సభ ఉ. గం. 10.00 లకు ప్రారంభమైనది)

(గౌరవ ఛైర్మన్ అధ్యక్ష స్థానంలో ఉన్నారు)

మిస్టర్ ఛైర్మన్: అందరికీ నమస్కారం. ఇప్పుడు క్వశ్చన్ అవర్.

### I. ప్రశ్నోత్తరాలు

### ఎలక్ట్రానిక్ పరికరాల కాలుష్యం

ప్రశ్న నెం. 1759 (122)

శ్రీ ఉల్లోళ్ళ గంగాధర్ గౌడ్, ఎం.ఎల్. సి.:– గౌరవనీయులైన అటవి & పర్యావరణ శాఖ మంత్రి గారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా;

(అ) ఎలక్ట్రానిక్, ఎలక్ట్రికల్ వ్యర్థాలు పర్యావర్యణ కాలుష్యానికి, ఆరోగ్య సమస్యలకు దారితీస్తున్న విషయం వాస్తవమేనా ?

(ఆ) అయితే, ఎలక్ట్రానిక్, ఎలక్ట్రికల్ పరికరాల వ్యర్థాల పరిష్కారం కోసం రూపొందించిన మార్గదర్శకాలు ఏమిటి ?

(ఇ) దానిపై తీసుకున్న చర్యల వివరాలేమిటి ?

గౌరవనీయులైన అటవి & పర్యావరణ శాఖ మంత్రి ( శ్రీ జోగు రామన్న):– (అ) అవునండీ.

(ఆ) 2016, ఇ–వ్యర్థాల నియమావళి ప్రకారం ఎలక్ట్రానిక్, ఎలక్ట్రికల్ పరికరాల వ్యర్థాలను పరిష్కరించడం జరుగుతుంది.

(ఇ) 2016, ఇ–వ్యర్థాల (నిర్వహణ) నియమావళి ప్రకారం ఎలక్ట్రానిక్, ఎలక్ట్రికల్ పరికరాల వ్యర్థాలను సరియైన విధంగా సేకరించి, పరిష్కరించడానికి తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి 5 డిస్మ్యాంట్లింగ్/ రీసైక్లింగ్ యూనిట్లను, 21 సేకరణ కేంద్రాలకు ముగ్గురు (3) ఉత్పత్తిదారులకు అధికారమిచ్చింది .

శ్రీ ఉల్లోళ్ల గంగాధర్ గౌడ్: (శాసనసభ నియోజకవర్గం) అధ్యక్షా, ఈ ఎలక్ట్రానిక్ పరికరాలు చెక్కుచెదరకుండా ఉంటే ఎటువంటి సమస్య ఉండదు. అదే విధంగా ఈ 2008 ప్రమాదకర వ్యర్థ పదార్థాల నియమావళి ప్రకారం ఉందో అక్కడ ఇ–వ్యర్థ పదార్థాల తొలగింపును ఏ విధంగా తొలగిస్తున్నారు? అదే విధంగా కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి మార్గదర్శక నియమావళిలో ఇ–వేస్ట్ ఉత్పత్తిదారులకు గాని, సేకరణదారులకు గాని, రవాణాదారులకుగాని, రీసైకిల్ చేసేవారికి గాని ఈ కేంద్ర కాలుష్య మార్గదర్శక నియమావళి వర్తిస్తుందా? అదే విధంగా ఇ–వేస్టును పర్యావరణ పరంగా, సురక్షితమైనదిగా భావించడం జరుగుతున్నదా? ఇందులో ముఖ్య అంశాలు చెప్పవలసిందిగా మీ ద్వారా గౌరవ మంత్రిగారిని కోరుతున్నాను.

శ్రీ జోగు రామన్న: అధ్యక్షా, ఇ–వేస్టు నిబంధనలను 1.10.2016 నుండి అమలులోకి తీసుకువచ్చాము. ఈ నిబంధనలను 2011 స్థానంలో జారీచేయడం జరిగింది. ఇ–వేస్టు నిబంధలను ప్రాసెసింగ్ చేసే, లేదా ఎలక్ట్రిక్ మరియు ఎలక్ట్రానిక్ పరికరాలను వినియోగంలోకి తీసుకువచ్చే అనుబంధ పరికరాలు, ముడి వస్తువులు, విడి భాగాలు, అదనపు భాగాల యొక్క తయారీ, అమ్మకాలకు వర్తించే విధంగా తీసుకురావడం జరిగింది. దానికి సంబంధించి ఉత్పత్తి కేంద్రాలు ఏవైతే ఉన్నాయో వాటితో పాటు తయారీ కేంద్రాలు, సేకరణ కేంద్రాలు, డీలర్లు, మరమ్మతుల సంస్థలు, భారీ వినియోగ నిర్మూలన సంస్థ మరియు పునర్వినియోగానికి అమలు చేయడం జరిగింది. అయితే గౌరవ సభ్యులు అడిగినట్లు ఇ– వ్యర్థాలను సేకరించి, నిర్మూలన లేదా పునర్వినియోగ కేంద్రానికి పంపడం, సేకరించినటువంటి ఇ–వ్యర్థాలను నిర్మూలన లేదా పునర్వినియోగ కేంద్రానికి పంపే వరకు సురక్షితంగా నిల్వ చేయడం, నిర్మూలన లేదా పునర్వినియోగకేంద్రానికి పంపేటప్పుడు పర్యావరణానికి ఎటువంటి హాని జరగకుండా చూడడం, కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి మార్గదర్శకాల ప్రకారం సేకరించిన ఇ–వ్యర్థాల వివరణను



J.363-1 [G]

Form-2లో నమోదు చేయడం, మరియు సదరు వివరాలను కేంద్ర కాలుష్య నియంత్రణ మండలికి, రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి తనిఖీ అధికారులకు ఆ సమయంలో అందుబాటులో ఉంచడం, షెడ్యూల్-1లో పేర్కొనబడిన ఎలక్ట్రిక్ మరియు ఎలక్ట్రానిక్ పరికరాల భారీ వినియోగదారులు రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి వద్ద Form-3లో సంబంధిత ఆర్థిక సంవత్సరానికి వార్షిక నివేదికను జూన్ 30వ తేదీ లోపల సమర్పించవలసి ఉంటుంది.

## గనుల తవ్వకానికి లైసెన్సులు

ప్రశ్న నెం. 1617 (123)

శ్రీ కర్నె ప్రభాకర్, ఎం. ఎల్.సి.:- గౌరవనీయులైన సమాచార సాంకేతిక విజ్ఞాన & పరిశ్రమల శాఖ మంత్రి గారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా;

(అ) తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత గనుల త్రవ్వకం కోసం మంజూరు చేసిన లైసెన్సుల సంఖ్య ఎంత ?

(ఆ) నియమావళికి అనుగుణంగా గనుల త్రవ్వకం పని జరుగుతుందా ?

(ఇ) లేనట్లయితే, అందుకోసం తీసుకున్న చర్య ఏమిటి ?

గౌ. సమాచార సాంకేతిక విజ్ఞాన & పరిశ్రమల శాఖ మంత్రి (శ్రీ కె. తారక రామారావు):- (అ) తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత మొత్తం 489 లీజులను మంజూరు చేయడమయింది.

(ఆ) అవునండీ.

(ఇ) ఈ ప్రశ్న ఉత్పన్నం కాదు.

శ్రీ కర్నె ప్రభాకర్‌: (నామినేటెడ్) అధ్యక్షా, నేను అడిగిన ప్రశ్న రాష్ట్రం ఏర్పడిన తరువాత మంజూరైన లీజులు ఎన్ని అని అడిగాను. కాని ఎందుకో రాంగ్ పోస్టింగ్ అయినట్లుంది. ఒకవేళ మంత్రిగారి దగ్గర సమాధానం ఉంటే, ఉమ్మడి రాష్ట్రంతో పాటు, ఇప్పటివరకు మంజూరైనటువంటి లీజుల గురించి సమాధానం చెబుతారని ఆశిస్తున్నాను. అయితే ఈ లీజులలో జరుగుతున్నదేమిటంటే గనులలో కావచ్చు, క్రషర్ క్వారీల్లో కావచ్చు, ఎలాంటి అనుభవం లేకుండా, కేవలం వ్యాపారం కోసం, ఒక్కొక్కరు ఐదో, పదో గనులు తీసుకుని, వాటిని సబ్‌లీజులకు ఇచ్చుకుంటూ, వ్యాపారం చేస్తున్నట్లుగా మా దృష్టికి వచ్చింది. ఈ విషయం ప్రభుత్వ దృష్టికి వచ్చిందా? రెండవది వీటిని సరిచేసి, క్రమబద్ధీకరించే విధానం ఏదైనా ఉందా? మూడవది ఇటువంటి వ్యవహారం పైన Empanelment చేసినట్లయితే, తప్పకుండా ఎవరివద్దనైనా అక్రమంగా లీజులు ఉన్నట్లయితే దానిని సరిచేసే అవకాశం ఉంటుంది కాబట్టి ప్రభుత్వం ఆ దిశగా ఏమైనా ఆలోచిస్తున్నదా?

శ్రీ కె. తారకరామారావు: అధ్యక్షా, గౌరవ సభ్యులు అడిగిన రోడ్ మెటల్‌గాని, బిల్డింగ్ స్టోన్స్‌గాని అంతా మైనర్ మినరల్స్ క్రిందకు వస్తుంది. వారు తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తరువాత ఎన్ని లీజులు ఇచ్చారని అడిగారు. దానికి సంబంధించిన సమగ్ర సమాచారం నా దగ్గర ఉంది. గతంలో ఉమ్మడి రాష్ట్రంలో ఎన్ని లీజులు ఇచ్చారని అడిగారు. ప్రస్తుతం నా దగ్గర ఆ సమాచారం లేదు. సభ్యులు ఆ ప్రశ్న అడగలేదు కాబట్టి నేను ఆ సమాచారాన్ని తీసుకోలేదు. వారికి కావాలంటే మరొక రూపంలో వచ్చినట్లయితే ఆ సమాచారం కూడా వారికి ఇవ్వడం జరుగుతుంది. ఈ మైనర్ మినరల్ విషయానికి వస్తే వారు రెండు విషయాలు చెప్పారు. ఒకటి సబ్ లీజ్. అంటే కేవలం ఒకరే ఐదు గనులు తీసుకుని, వాటిని సబ్ లీజ్‌కి ఇస్తున్నారని చెప్పారు. అలాంటి దృష్టాంతాలు ఉన్నట్లయితే మాకు తెలియపరిస్తే, తప్పకుండా చర్య తీసుకుంటాము. కాని మా దృష్టికైతే అలాంటివి రాలేదు. తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తరువాత మైనర్ మినరల్స్ గురించి ప్రత్యేకమైన శ్రద్ధ పెట్టి, మన రెవెన్యూని చాలా పెద్ద మొత్తంలో పెంచుకోవడం జరిగింది. గతంలో ఉన్న లీకేజీలను, పిల్‌ఫరేజెస్‌ను బాగా తగ్గించాము. ఉదాహరణకి 2013-14లో మైనర్ మినరల్స్ ద్వారా రూ.482 కోట్ల ఆదాయం ప్రభుత్వానికి వచ్చేది. తెలంగాణ వచ్చిన తరువాత 2015-16లో ఆ ఆదాయం రూ.915.76 కోట్లకు పెరిగింది. అంటే దాదాపు 76 శాతం పెరిగిందన్నమాట. అంటే ఏ రకంగా తెలంగాణ ప్రభుత్వం ఈ విషయంలో ప్రత్యేకమైన శ్రద్ధ వహించిందనేది ఇక్కడ మనకు తెలుస్తుంది. ఈ లీజెస్ విషయంలోగాని, సబ్ లీజెస్ విషయంలో గాని కొత్తగా ఒక మైనింగ్ పాలసీని కూడా తీసుకురాబోతున్నాము. ఈ విషయంలో మైనింగ్ పాలసీ గురించి ఉభయ సభల్లో చర్చ జరిపి, సభ్యుల అభిప్రాయం కూడా తీసుకునే ఆలోచన కూడా ఉందని ఈ సందర్భంగా గౌరవ సభ్యులందరికీ తమరి ద్వారా తెలియజేస్తున్నాను.

## ఆదిలాబాద్, నిర్మల్ మొదలైన జిల్లాల్లో పర్యాటకాభివృద్ధి

ప్రశ్న నెం.1745(124)

శ్రీ పురాణం సతీష్‌కుమార్, ఎం.ఎల్.సి.:- గౌరవనీయులైన షెడ్యూల్డు తెగల అభివృద్ధి, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా;

(అ) అదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల, కొమురంభీం జిల్లాలలో పర్యాటక అభివృద్ధి కోసం చర్యలు తీసుకోవడమయిందా?

(ఆ) ఇందుకు సబంధించి కేంద్ర ప్రభుత్వం నుండి రూ.120 కోట్ల మొత్తాన్ని విడుదల చేసిన విషయం వాస్తవమేనా?

(ఇ) గాంధారి వనం, పోచెర్ల కుంతల, పిట్టగూడ, జోధేఘాట్, కుమరంభీం అనే పర్యాటక ముఖ్యమైన ప్రదేశాలుగా అభివృద్ధి చేయడానికి ప్రతిపాదన ఏదైనా ఉందా?

గౌ. షెడ్యూల్డు తెగల అభివృద్ధి, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి (శ్రీ ఎ.చందూలాల్):- (అ) అవునండీ.

ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల, కొమురంభీం ఆసిఫాబాద్ వద్ద పర్యాటక సౌకర్యాలను అభివృద్ధి పరచడం కోసం పర్యాటక శాఖ ఒక సవివరమైన అధ్యయనం నిర్వహించి, సమగ్ర జిల్లా పర్యాటక అభివృద్ధి ప్రణాళికలను రూపొందించడమయింది. షెల్ఫ్ ప్రాజెక్టుల క్రింద వీటిని ప్రతిపాదించడమయింది.

పై వాటిలో భాగంగా ఈ క్రింది ప్రాజెక్టులను చేపట్టడమయింది.

(1) ఆదిలాబాద్ జిల్లాలో పోచెర్ల జలపాతాలు మరియు కుంతల జలపాతాలు.

(2) నిర్మల్ జిల్లాలో గ్రామీణ పర్యాటక ప్రాజెక్టు, శాంఘర్ ఫోర్ట్, బత్తీస్ఘర్ ఫోర్ట్, కడెం, బాసర వద్ద సౌండ్ & లైట్ షో.

(3) మంచిర్యాల జిల్లాలోని జన్నారం.

(4) కొమురం భీం జిల్లా జోధేఘట్ వద్ద కుమరంభీం మెమోరియల్ ప్రాజెక్టు.

(ఆ) లేదండీ

(ఇ) అవునండీ.

ఆదిలాబాద్ జిల్లాలో కుంతల జలపాతాన్ని, కొమురంభీం జిల్లాలోని జోధేఘాట్ వద్ద మాత్రమే అభివృద్ధి కోసం ఒక ప్రతిపాదన వుంది.

శ్రీ పురాణం సతీష్‌కుమార్: (స్థానిక సంస్థలు – ఆదిలాబాద్) అధ్యక్షా, పర్యాటక రంగంలో పాత ఆదిలాబాద్ జిల్లా, కొత్తగా ఏర్పడినటువంటి నిర్మల్, మంచిర్యాల, కొమురం భీం జిల్లాలు పర్యాటక పరంగా టూరిజం అభివృద్ధికి చాలా అనువైన ప్రదేశాలు. మన గౌరవ ముఖ్యమంత్రి శ్రీ కెసిఆర్‌గారు ఉద్యమ సమయంలో కూడా చెబుతుండేవారు. తెలంగాణకు ఆదిలాబాద్ కాశ్మీర్ లాంటిదని చెప్పేవారు. ఆదిలాబాద్ జిల్లాలో కుంతాల, పోచెర్లతో పాటు, మంచిర్యాల జిల్లాలో జన్నారం కూడా అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. అదే విధంగా గాంధారి వనం కూడా టూరిజం పరంగా అటవీ శాఖ వారు మూడున్నర కోట్ల రూపాయలు వెచ్చించి కొంత డెవలప్ చేయడం కూడా జరిగింది. పర్యాటకుల సంఖ్య కూడా పెరిగింది. అయినప్పటికీ ఇంకా ఆ ప్రాంతాన్ని ఇంకా అభివృద్ధి చేసినట్లయితే ఎక్కువ సంఖ్యలో టూరిస్టులు రావడానికి అవకాశముంది. కొమురం భీమ్ జిల్లాలో జోడేఘాట్ అనే ప్రాంతం ఉంది. గౌరవ ముఖ్యమంత్రిగారు రూ.25 కోట్లు కేటాయించి, పనులన్నీ కూడా పూర్తి చేయించి మొన్ననే కొమురం భీం వర్ధంతి రోజున ఇనాగ్యురేషన్ కూడా జరిపించారు. అక్కడికి టూరిజం చైర్మన్ శ్రీ పేర్వారం రాములుగారు, కమీషనర్‌గారు వచ్చినప్పుడు హార్స్ రైడింగ్‌కి ఇది అనువైన ప్రదేశం, అదే విధంగా ట్రెక్కింగ్‌కి కూడా అనువుగా ఉంటుందని చెప్పడం జరిగింది. హార్స్ రైడింగ్ పరంగా ఇది జమ్మూ–కాశ్మీర్‌లోని లడక్ కంటే కూడా గొప్పగా ఉంటుంది మన జోడేఘాట్. మంత్రిగారు చెప్పినట్లు కొన్ని ఐడెంటిఫై అయిన ప్రాంతాలను మాత్రమే అభివృద్ధి చేయడం జరిగింది. ఇంకా ఐడెంటిఫై కానివి ఉన్నాయి. పిట్టగుడా దగ్గర సిర్పూర్ మండలంలో మంచి జలపాతం ఉంది. ఆసిఫాబాద్ మండలంలోపల మంచి జలపాతం ఉంది. ఇలాంటి ప్రాంతాలను కూడా ఐడెంటిఫై చేసి, వాటిని డెవలప్ చేస్తే, పర్యాటక రంగానికి మంచి ఆదాయం లభిస్తుంది. ఈ సందర్భంగా మంత్రిగారికి నేను కృతజ్ఞతలు చెప్పుకోవలసి ఉంది. కేంద్ర ప్రభుత్వం నుండి రూ.120 కోట్ల నిధులు రావడానికి వారు ఎంతో కృషి చేశారు. ఆ నిధులు కూడా కేవలం ఆదిలాబాద్ జిల్లా కొరకే కనుక , నేను మంత్రిగారిని కోరేది ఏమిటంటే టూరిజం డిపార్టుమెంటు నుండి ఒక కమిటీని పంపించి, స్థానిక ప్రజా ప్రతినిధుల సహకారం తీసుకుని, ఎక్కడెక్కడైతే టూరిజం అభివృద్ధి కొరకు ప్రాంతాలు అనుకూలంగా ఉన్నాయో వాటినన్నిటిని గుర్తించి, ఆ రూ.120 కోట్లతో ఆదిలాబాద్ జిల్లాను మన ముఖ్యమంత్రిగారు కలలు గన్న మరో కాశ్మీర్‌లాగా అభివృద్ధి చేయడానికి అవకాశం ఉంటుంది కనుక కమిటీ ద్వారా సమగ్రంగా అధ్యయనం చేయించవలసిందిగా కోరుతున్నాను.

శ్రీ ఎ. చందులాల్: అధ్యక్షా, దట్టమైన అడవులు, గలగల పారే సెలయేళ్లు , అమాయకత్వం నిండిన ముఖాలతో కనిపించే అడవి తల్లి బిడ్డలు ఇలా చెప్పుకుంటూ పోతే మనకు వెంటనే గుర్తుకు వచ్చేది ఆదిలాబాద్ జిల్లా. సహ్యాద్రి పర్వతాలకు ఆనుకొని, పరవళ్లు తొక్కే కుంతాల జలపాతం మరొకవైపు కెరిమెరి పర్వతాల అందాలు మరొక వైపు ఉన్న ఆదిలాబాద్ జిల్లాను అందాల కాశ్మీర్‌లాగా తీర్చిదిద్దాలని మన గౌరవ ముఖ్యమంత్రిగారు ప్రకటించడం జరిగింది. దేశవిదేశాల పర్యాటకులను ఆకర్షించే విధంగా ప్రణాళికలను రూపొందించడం జరిగింది. గౌరవ ముఖ్యమంత్రి శ్రీ కె. చంద్రశేఖరరావు గారి ఆదేశాలకు

అనుగుణంగా ఆదిలాబాద్ జిల్లాతో పాటు, వివిధ గిరిజన తెగలు నివసించే ప్రాంతాలకు వెళ్లే విధంగా ఎకో టూరిజం అభివృద్ధిని కూడా చేపట్టాలని నిర్ణయించడం జరిగింది. ఇందుకోసం నేను ప్రత్యేక శ్రద్ధ వహించి, గిరిజన అభివృద్ధి శాఖ ద్వారా రూ.25 లక్షలు వెచ్చించి, సమగ్రమైన ప్రణాళికను రూపొందించడం జరిగింది.

ట్రైబల్ ఎకో టూరిజం ప్రాజెక్టు అమలుచేసేందుకు రూ.131.39 కోట్లు ఖర్చవుతాయనే అంచనాతో స్వదేశీ దర్శన్ పథకంలో భాగంగా రూ.121 కోట్ల నిధులను మంజూరు చేయడం కోసం కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపడం జరిగింది. ఈ ప్రాజెక్టు క్రింద నిధులను మంజూరు చేయడం కోసం ఆసక్తిని కనబరచిన కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర పర్యాటక శాఖ మరియు గిరిజన శాఖ కార్యదర్శులతో జరిపిన చర్చలు ఫలప్రదంగా ముగిశాయి. కేంద్ర ప్రభుత్వం నుండి నిధుల మంజూరు యొక్క ఆదేశాలు అందిన వెంటనే డిచ్‌పల్లి వద్ద ట్రైబల్ సర్క్యూట్‌ను ఏర్పాటు చేయడం జరుగుతుంది. కుంతాల మరియు గాయత్రి జలపాతాల అభివృద్ధికి ఉట్నూర్ ఫోర్ట్ అభివృద్ధికి, పిట్టగూడ వద్ద మరియు కొమురం భీమ్ స్మారక చిహ్నం వద్ద ట్రైబల్ రిసార్ట్‌లను ఏర్పాటు చేయడం జరుగుతుంది. అదే విధంగా జోడేఘాట్ వద్ద మరియు కల్వాయి గుహల వద్ద అభివృద్ధి పనులను చేపట్టడం జరిగింది. ఇప్పటికే ఆదిలాబాద్ జిల్లాలో పలు పనులను పర్యాటక అభివృద్ధి శాఖ చేపట్టి, పూర్తి చేయడం జరిగింది. మరి కొన్ని పనులు నిర్మాణ దశలో ఉన్నాయి.

ప్రకృతి అందాలకు పర్యాయపదంగా నిలిచే ఆదిలాబాద్ జిల్లాలో కుంతాల, పోచారం జలపాతాలను పర్యాటక మరియు అటవీ శాఖలు సమన్వయం చేసుకుంటూ అభివృద్ధి చేయడం జరుగుతుందని మనవి చేస్తున్నాను. కొయ్యబొమ్మలు మరియు పెయింటింగ్‌లకు పెట్టింది పేరైన నిర్మల్ పట్టణంలో శ్యామ్ ఘర్ ఫోర్ట్‌ను , బత్తీస్‌ఘడ్ ఫోర్టును, కడెం రిజర్వాయర్‌ను, దక్షిణ భారతదేశంలోని బాసర సరస్వతీ దేవాలయాన్ని అభివృద్ధి చేసే పనులలో కొన్ని ఇప్పటికే పూర్తి కాగా, మరికొన్ని నిర్మాణంలో ఉన్నాయి. జన్నారం సఫారీని అభివృద్ధి చేసే పనులు కొనసాగుతున్నాయి. కొమురం భీమ్ ప్రాజెక్టు పనులు చేపట్టి, పూర్తి చేయడం జరిగిందని ఈ సందర్భంగా గౌరవ సభ్యులకు తమరి ద్వారా మనవి చేసుకుంటున్నాను. గౌరవ సభ్యులు అడిగిన గాంధారి వనం అభివృద్ధి పనులను పరిశీలించడం జరుగుతుందని కూడా ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను.

10.20 ఉ. శ్రీ పురాణం సతీష్‌కుమార్: అధ్యక్షా, మంత్రిగారు చెప్పిన వన్నీ కూడా ఇంతకు ముందే ఐడెంటిఫై చేసిన ప్రాజెక్టులు. ఇంకా ఐడెంటిఫై కానివి మా దృష్టిలో చాలా ఉన్నాయి. పిట్టగూడ, సంతులగుండం, యల్.మడుగు ...ఇవి చాలా మంచి జలపాతాలు. ఖచ్చితంగా ఎటువంటి అనుమానం లేదు, ఆదిలాబాదు టూరిజం డెవలప్‌మెంటు కోసం రూ.120కోట్లు వస్తాయి, గౌరవ ముఖ్య మంత్రి గారు, గౌరవ మంత్రివర్యులు ఆదిశలో కృషి చేస్తున్నారు. ఇంకా ప్రాజెక్టులను ఐడెంటిఫై చేయడానికి టూరిజం డిపార్టుమెంటు నుంచి ఒక కమిటీని పంపిస్తే బాగుంటుంది. స్థానికంగా ఉండే ప్రజాప్రతినిధుల సహకారం, గైడెన్స్ తీసుకొని ఎక్కడెక్కడైతే ఐడెంటిఫై గాకుండా మంచి మంచి ప్రదేశాలున్నాయో వాటిని గుర్తించడానికి టూరిజం డిపార్టుమెంటు నుంచి ఒక కమిటీని పంపించాలని మంత్రివర్యులను కోరుతున్నాను.

## COLLECTION OF EXCESSIVE FEES IN PRIVATE SCHOOLS

LCQ No.1600 (125)

Given Notice of by Sri Katepally Janardhan Reddy Sri Poola Ravinder, M.L.Cs.:- Will the Deputy Chief Minister (Education) be pleased to state:

(a) Whether it is a fact that Private Schools are collecting exorbitant fees; and

b) if so, the details of measures being taken by the Government to control the same ?

DEPUTY CHIEF MINISTER (Education) (SRI KADIYAM SRIHARI)

(a) Complaints are received from the Parents Associations that the private schools are increasing the fee exorbitantly every year.

(b) Many provisions of the G.O.Ms.No.91, Education (SE. PS-I) Department,

06.08.2009 issued to regulate the Fee of private schools were quashed by the Hon'ble High Court. In the SLP filed by the Government, the Hon'ble Supreme Court Orders. After detailed consultations with the Parents Associations and Private School Associations, new draft rules are received by the Government on 02.01.2017 from the Director of School Education which are under active consideration of the Government

శ్రీ పూల రవీందర్: (ఉపాధ్యాయ నియోజకవర్గం – వరంగల్, ఖమ్మం, నల్గొండ) అధ్యక్షా, కార్పోరేటు విద్యా సంస్థలు ప్రారంభమైన

తర్వాత కార్పోరేటు జూనియర్ కాలేజీలు కానీ, కార్పోరేటు పాఠశాలల్లో గానీ మధ్య తరగతి కుటుంబాల వాళ్లు ఫీజులు కట్టలేక చాలా ఇబ్బందులు పడుతున్నారు. రైతుల ఆత్మహత్యలకు కూడా వీటితో సంబంధం ఉంది. సమాజంలో ఒకరిని చూసి మరొకరు పోటీపడుతూ విద్యా సంస్థల వైపు వెళుతున్నపుడు, ఈ కార్పోరేటు విద్యా రంగంలో ఈ–టెక్నో అని, ఆ టెక్నో అని పేర్లు పెట్టి లక్షల రూపాయలను పేద ప్రజల నుండి వసూలు చేస్తున్నారు, వారి రక్తమాంసాలను పిండి వసూలు చేస్తున్నారు. 2009లో విద్యా శాఖ జారీ చేసిన జీ.ఓ.91ని హైకోర్టు కొట్టేసినప్పటికీ, దానికి ప్రత్యామ్నాయంగా మన ప్రభుత్వం నుంచి గౌరవ ముఖ్యమంత్రి గారు, గౌరవ మంత్రివర్యులు దీని మీద కొంచెం శ్రద్ధ పెట్టి, ఈ కార్పోరేటు విద్యా రంగం నుంచి మధ్య తరగతి కుటుంబాలను కాపాడాలని కోరుతున్నాను. ఉదాహరణకి నారాయణ, చైతన్య కాలేజీలు... వారికి నోటికి వచ్చింది, చేతికి వచ్చింది రాసి ఫీజులు వసూలు చేస్తున్నారు. జైళ్లలో చదివించినట్లుగా పిల్లలను అపార్టుమెంట్లలో పెట్టి చాలా ఒత్తిడికి గురి చేస్తున్నారు, ఆ ఒత్తిడిని తట్టుకోలేక ఎంతో మంది పిల్లలు ఆత్మహత్యలు చేసుకున్న సంఘటనలను మనం చూశాం. కాబట్టి విద్యారంగంలో ఈ కార్పోరేటు వ్యవస్థని అరికట్టాలని గౌరవ మంత్రిగారిని కోరుతున్నాను.

శ్రీ కడియం శ్రీహరి : సార్, రాష్ట్రంలో ఏర్పాటైన ప్రైవేటు స్కూల్స్‌ని నియంత్రించడానికి 1994లో ఒక సమగ్రమైన జీ.ఓ.యం.యస్.నెం.1 ని విడుదల చేయడం జరిగింది. అదే విధంగా 2009లో జీ.ఓ.యం.యస్.నెం.91 ని, 2010లో జీ.ఓ.యం.యస్. నెం.42ని ప్రభుత్వం జారీ చేయడం జరిగింది to regulate the private institutions in united A.P. & Telangana also. ప్రభుత్వం జారీ చేసిన జీ.ఓ. నెం.91 ని వ్యతిరేకిస్తూ కొన్ని ప్రైవేటు స్కూల్స్ హైకోర్టుకు వెళ్లడం, హైకోర్టులో ఆ జీ.ఓ.ను కొట్టేయడం, దాని మీద ప్రభుత్వం సుప్రీంకోర్టుకు వెళితే, హైకోర్టు ఇచ్చిన ఆర్డర్స్‌నే uphold చేస్తూ సుప్రీంకోర్టులో తీర్పు ఇచ్చారు. ప్రైవేటు ఇన్‌స్టిట్యూషన్స్‌ని రెగ్యులేట్ చేయడానికి జారీ చేసిన జీ.ఓ. పై కూడా కోర్టులో స్టే ఉంది. వీటన్నింటి నేపథ్యంలో మళ్లీ జీ.ఓ. నెం. 1ని ఉపయోగించుకొని ప్రైవేటు స్కూల్స్ వసూలు చేసే ఫీజులను రెగ్యులేట్ చేయాలనే ఉద్దేశంతో ఒక కొత్త జీ.ఓ. తీసుకు రావడానికి తెలంగాణ ప్రభుత్వం ప్రయత్నం చేస్తోంది. ఆ జీ.ఓ. విడుదల చేయడానికి ముందు మేము ప్రైవేటు స్కూల్స్ మేనేజ్‌మెంట్లతో మాట్లాడుతున్నాం. పేరెంట్స్ అసోసియేషన్స్‌తో కూడా మాట్లాడుతున్నాం. వాళ్ల ప్రతిపాదనలను పరిగణనలోకి తీసుకొని కొత్త జీ.ఓ. విడుదల చేసే ప్రయత్నం చేస్తున్నాం. ప్రైవేటు మేనేజుమెంట్ల ద్వారా నడుస్తున్న కాలేజీలకు రెగ్యులేటరీ కమిటీలున్నాయి కానీ ప్రైవేటు స్కూల్స్‌కి సంబంధించి రెగ్యులేటరీ కమిటీలు లేవు. రెగ్యులేటరీ కమిటీలను ఏర్పాటు చేసుకొనే విధంగా మనకున్న అధికారాలకు లోబడి ఉత్తర్వులు ఇచ్చే ప్రయత్నం చేస్తున్నాం. తప్పకుండా ప్రైవేటు స్కూల్స్‌ని నియంత్రిస్తామని, వాళ్లు వసూలు చేసే ఫీజుని రెగ్యులేట్ చేస్తామని తమరి ద్వారా గౌరవ సభ్యులకు తెలియజేస్తున్నాను.

శ్రీ పూల రవీందర్: గ్రామాలలో ప్రైవేటు స్కూల్స్ ఏర్పాటు చేయడానికి ఏమాత్రం అవకాశం ఇవ్వకండి. ప్రైవేటు పాఠశాలలను పట్టణాలకు మాత్రమే పరిమితం చేయండి. గ్రామాలలో కూడా ప్రైవేటు పాఠశాలలను అనుమతిస్తే ప్రభుత్వ పాఠశాలలకు చాలా ఇబ్బందికర పరిస్థితి ఏర్పడుతుంది.

శ్రీ కడియం శ్రీహరి: కొత్తగా పాఠశాలలకు మంజూరీ ఇచ్చే సమయంలో మన దగ్గర ఉన్న నియమ నిబంధనలకు లోబడి, ఫీజిబిలిటీని అసెస్ చేసిన తర్వాత అనుమతులు ఇవ్వడం జరుగుతుందని తమరి ద్వారా గౌరవ సభ్యులకు తెలియజేస్తున్నాను.

మిస్టర్ ఛైర్మన్: ప్రశ్న నెం. 1744 ని సభ్యుల కోరిక మేరకు వాయిదా వేయడమైంది.

## ESTABLISHMENT OF GOVERNMENT JUNIOR COLLEGE AT RAHAMATNAGAR, HYDERABAD

LCQ No.1742 (127)

Given Notice of by Sri Sabavat Ramulu Naik, MLC:- Will the Deputy Chief Minister (Education) be pleased to state:

(a) Whether there is any proposal to establish Government Junior College at Rahmath Nagar, Yusufguda, Hyderabad to cater to the needs of the poor people;

(b) if so, the details thereof; and

(c) the time by which necessary measures will be taken ?

DEPUTY CHIEF MINISTER (Education) (SRI. KADIYAM SRIHARI):- (a), (b) and (c) such proposals are being examined by the Government as per the existing norms.

శ్రీ సబావత్ రాములునాయక్: (నామినేటెడ్) అధ్యక్షా, ఈ రహమత్‌నగర్ చుట్టూ బస్తీలున్నాయి. ఇక్కడ నివసించే వారంతా దారిద్ర్యరేఖకి దిగువన ఉన్న వారే. జూబ్లీహిల్స్ నియోజకవర్గం అన్నది

పేరుకే గానీ అక్కడ మొత్తం మురికివాడలు, బస్తీలే ఉన్నాయి. రహమత్‌నగర్, యూసుఫ్‌గూడ, శ్రీరామ్‌నగర్, బోరబండ, ఎర్రగడ్డ ప్రాంతాలలో ఒక ప్రభుత్వ డిగ్రీ కాలేజీ కూడా లేదు. యూసుఫ్‌గూడ పోలీసు లైన్‌లో ఒక వంద ఎకరాల భూమి ఉంది. ఆ ప్రాంతంలో నివసించే కార్మికుల పిల్లల కోసం ఆ స్థలంలో ప్రభుత్వ జూనియర్ కాలేజీ నిర్మాణానికి తక్షణమే మంజూరీ ఇవ్వవలసిందిగా మంత్రిగారిని కోరుతున్నాను.

శ్రీ కడియం శ్రీహరి: ప్రశ్న ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటుకు సంబంధించి వేశారు. ప్రస్తుతం కూకట్‌పల్లిలో ఒక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఉంది. బోరబండలో ఒక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఉంది. ఇవి రెండు కూడా రహమత్‌నగర్‌కి అతి సమీపంలో ఉన్నాయి. కూకట్‌పల్లి జూనియర్ కళాశాలలో దాదాపు 1250 మంది విద్యార్థులున్నారు. బోరబండ జూనియర్ కళాశాలలో చాలా వేకెన్సీలున్నాయి. మనకి కావలసిన ఫీడింగు స్కూల్స్ నుంచి రావడం లేదు. అయినా గౌరవ సభ్యులు ప్రతిపాదించిన విషయాన్ని పరిశీలిస్తాం. తప్పకుండా ఒకసారి మా శాఖ ద్వారా అక్కడ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయడానికి వీలవుతుందా లేదా, అక్కడ హైస్కూల్స్ నుంచి ఫీడింగు ఉంటుందా లేదా అనే విషయాన్ని తెలుసుకొని, వారి ప్రతిపాదనలను పరిశీలించడం జరుగుతుందని తెలియజేస్తున్నాను.

## గ్రామీణ రోడ్ల నిర్మాణం మరియు వాటి నిర్వహణకు నిధుల విడుదల

ప్రశ్న నెం. 1387 (128)

శ్రీ వి. భూపాల్ రెడ్డి, ఎం.ఎల్.సి.:- గౌరవనీయులైన పంచాయతీరాజ్ శాఖ మంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా:

(అ) రాష్ట్రంలోని గ్రామీణ రోడ్ల నిర్మాణం, వాటి నిర్వహణ కోసం పంచాయతీరాజ్ శాఖ తగినన్ని నిధులు విడుదల చేయలేదన్న విషయం వాస్తవమేనా?

(ఆ) అయితే, ఆ వివరాలేమిటి?

(ఇ) నిధులను ఎప్పటిలోగా విడుదల చేయడమవుతుంది?

గౌరవనీయులైన పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి (శ్రీ జూపల్లి కృష్ణారావు):-(అ) లేదండీ.

(ఆ) ఈ ప్రశ్న ఉత్పన్నం కాదు.

(ఇ) ఈ ప్రశ్న ఉత్పన్నం కాదు.

శ్రీ కె. యాదవరెడ్డి: (శాసనసభ నియోజకవర్గం) అధ్యక్షా, మన రాష్ట్రంలో గత సంవత్సరం చేపట్టిన రోడ్ల కార్యక్రమం చాలా గొప్పగా జరిగింది. దాన్ని ప్రజలందరూ ప్రశంసిస్తున్నారు. కానీ ఈ సంవత్సరం శాంక్షన్ చేసిన రోడ్లలో చాలా వాటికి నిధులు లేవంటున్నారు అధికారులు.

మంత్రిగారిని సూటిగా అడిగే ప్రశ్న ఏమంటే – మెదక్ జిల్లాలో 28 రోడ్లకి, రంగారెడ్డి జిల్లాలో 17 రోడ్లకి నిధులు లేవని, కొన్ని ఆర్ అండ్ బి కి ట్రాన్స్‌ఫర్ చేశామంటున్నారు. ఆ విధంగా ఆర్ అండ్ బి కి ట్రాన్స్‌ఫర్ చేసిన రోడ్ల సంఖ్య ఎంత? వాటికి కావలసిన నిధులను ఎప్పుడు చేకూరుస్తారు? నా రిక్వెస్ట్ ఏమంటే సంబంధిత అధికారులతో ఒక రెవ్యూ మీటింగు పెడితే బాగుంటుంది. ఆవిధంగా చేస్తే మంత్రిగారు అధికారులకు డైరెక్షన్స్ ఇవ్వడానికి, అదే విధంగా ప్రజాప్రతినిధులకు కూడా సౌకర్యంగా ఉంటుందని తెలియజేస్తున్నాను.

శ్రీ పొంగులేటి సుధాకర్ రెడ్డి: (శాసనసభ నియోజకవర్గం) అధ్యక్షా, గ్రామీణ రోడ్ల నిర్మాణం, నిర్వహణకు అవసరమైన నిధుల విషయం ఇది. ఈ పంచాయతీరాజ్ వ్యవస్థని పటిష్టపరచడం కోసం రాజ్యాంగ సవరణ చేసిన నేపథ్యం ఉంది. 14వ ఆర్థిక సంఘం ద్వారా కేంద్రం నిధులు నేడు నేరుగా పంచాయతీలకు వస్తున్నాయి. కంట్రోలింగ్ మాత్రం పంచాయతీరాజ్ వ్యవస్థకి ఉంటుంది. ఇంతకు ముందు కొన్ని రిజర్వ్ ఫండ్స్ ఉండేవి. ఈ రోడ్ల నిర్వహణ చాలా ఇబ్బందిగా ఉంది. ఆర్ అండ్ బి, పి. ఆర్ మధ్య ఇబ్బంది వస్తోంది. తమ రోడ్ల పొడిగింపు/విస్తరణను ఆర్ అండ్ బి వాళ్లు చాలా పెద్ద ఎత్తున చేపట్టారు. పంచాయతీరాజ్‌కి చెందిన ఇంటర్‌లింకు రోడ్లు చాలా అధ్వాన్నంగా ఉన్నాయి. వేరియస్ ఆప్షన్స్, వేస్ అండ్ మీన్స్ ద్వారా టేకప్ చేయండి. ఇప్పుడు ఎగ్జిస్టింగ్ 14 వ ఆర్థిక సంఘం రికమెండేషన్స్‌తో బాటు అటు కేంద్ర నిధుల పరిస్థితి ఏమిటి, within the limitsలో ఉన్నాయా, మీరు ఏమి చేయబోతున్నారు, ఈరోడ్ల మరమ్మత్తులకు ఎమర్జెన్సీ క్రింద ఫండ్ పెట్టుకునే అవకాశం ఏమైనా ఉందా?

శ్రీ జూపల్లి కృష్ణారావు: అధ్యక్షా, రోడ్లకి సంబంధించి ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి 5805.15 కిలోమీటర్లకి సిఆర్ఆర్ ద్వారా రూ.2737.92కోట్లు మంజూరు చేయడం జరిగింది. అందులో రూ.529.40కోట్లు రిలీజ్ చేశాం, పేమెంటు చేయడం జరిగింది. పెండింగులో ఉన్నది రూ.168కోట్లు మాత్రమే. అలాగే యంఆర్ఆర్‌కి సంబంధించి రూ.2111.72కోట్లు మంజూరు చేయడం జరిగింది. ఇందులో ఇప్పటి వరకు ఖర్చు పెట్టింది రూ.382.15కోట్లు, పెండింగులో ఉన్నది రూ.75.27కోట్లు మాత్రమే. ఫస్ట్ అండ్ సెకండు క్వార్టర్లు కూడా రిలీజ్‌చేయడం జరిగింది. అక్టో

బర్, నవంబరు, డిసెంబరు కి సంబంధించి థర్డ్ క్వార్టర్ రిలీజ్ చేయ వలసి ఉంది. దీని విషయంలో డీమానిటైజేషన్ కారణంగా కొంత ఆలస్యం జరిగింది. ఓవరాల్‌గా చూస్తే, ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత, రెండున్నర సంవత్సరాల కాలంలో పిఆర్ రోడ్లకి మొత్తం రూ.4193కోట్లు ఖర్చు చేయడం జరిగింది. కొత్త రోడ్లు కావచ్చు, బిటి రోడ్లు కావచ్చు, నిర్వహణ కావచ్చు, వీటన్నింటికీ రూ.4193కోట్లను ప్రభుత్వం ఖర్చు పెట్టడం జరిగింది. 2004 నుంచి 2014 వరకు గడచిన పది సంవత్సరాల కాలంలో గత ప్రభుత్వాలు ఖర్చు పెట్టిన మొత్తం రూ. 3520కోట్లు మాత్రమే. కానీ మేము ఈ రెండున్నర సంవత్సరాల కాలంలో ఖర్చు పెట్టింది రూ.4193కోట్లు. అంటే పంచాయతీ రాజ్ వ్యవస్థలో కొత్త రోడ్ల మంజూరీ కానీ, వాటి నిర్వహణ గానీ పెద్ద ఎత్తున గౌరవ ముఖ్య మంత్రిగారు మంజూరు చేస్తూ కంటిన్యూ చేస్తున్నారు. నిధులు విడుదల చేయకపోవడమనే ప్రశ్నే లేదు. మంజూరు చేసిన రోడ్లకి ప్రపోర్షనేటుగా పని చేయించడానికి గతంలో స్టాఫ్‌ని నియమించలేదు. మంజూరైన పోస్టులు 1065 ఉంటే అందులో 404 పోస్టులు ఖాళీగా ఉండేవి. కానీ ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆ పోస్టులను భర్తీ చేసిన ఘనత గౌరవ ముఖ్యమంత్రిగారికే దక్కింది. 2016లో వాళ్లను అపాయింట్ చేశాం, వాళ్లంతా డ్యూటీ చేస్తున్నారు. ఇకనుంచి పనుల వేగం ఇంకా పెరుగుతుంది. ఎక్కడా కూడా పనులు ఆగలేదు. యాదవరెడ్డిగారు కోరినట్లుగా సమీక్షా సమావేశాలు నిర్వహిస్తాం. మెదక్ జిల్లా అని మాత్రమే గాకుండా మొత్తం 69920కిలోమీటర్లలో పిఆర్ నుంచి ఆర్ అండ్ బి ట్రాన్స్‌ఫర్ అయిన రోడ్లు 2015 కిలోమీటర్లు.

గౌరవ సభ్యులు పొంగులేటి సుధాకర్ రెడ్డి గారు – పంచాయతీరాజ్ వ్యవస్థ, 14 వ ఆర్థిక సంఘం గురించి ప్రస్తావించారు. నేను ఇంతకు ముందే 14వ ఆర్థిక సంఘంతో కలిపి మొత్తం చెప్పడం జరిగింది. గతంలో ఏవిధంగానైతే 13వ ఆర్థిక సంఘం, 14వ ఆర్థిక సంఘం నుంచి నిధులు వచ్చేవో, ఇప్పుడు కూడా అదే పద్ధతిలో వస్తున్నాయి. కేంద్రం నుంచి వచ్చిన నిధులు కంటె, గతంలో ఖర్చు పెట్టిన దాని కంటె number of times ఇప్పుడు మంజూరీలు ఇస్తున్నాం, పనులు చేస్తున్నాం, డబ్బులు పేమెంటు చేస్తున్నాం. కేవలం మూడో క్వార్టర్ మాత్రమే ఇప్పుడు రిలీజ్ కావలసి వుంది. అది కూడా డీమానిటైజేషన్ కారణం వల్ల ఒక మాసం ఆలస్యం అయిందే తప్ప నిధులకు ఇబ్బంది లేదు. ఇంకా వీటిని స్పీడప్ చేసే కార్యక్రమం చేపడతాం.

శ్రీ పాతూరి సుధాకర్ రెడ్డి: (ఉపాధ్యాయ నియోజకవర్గం – మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ మరియు కరీంనగర్) తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత గ్రామం నుంచి మండల హెడ్ క్వార్టర్‌కి రోడ్డు వేయాలనే ప్రతిపాదన మీద సిద్ధిపేట జిల్లా, ఆరేపల్లి నుంచి కోహెడ మండల హెడ్‌క్వార్టర్‌కి రోడ్డు మంజూరైంది, నిధులు కూడా మంజూరు అయ్యాయి. కానీ రోడ్డు మాత్రం పూర్తి కావడం లేదు. కాబట్టి మీద్వారా మంత్రిగారిని అడుగుతున్నాను, అది ఎప్పటిలోగా పూర్తి అవుతుంది? దాని మీద ఏమైనా చర్యలు తీసుకుంటారా?

శ్రీ జూపల్లి కృష్ణారావు: తప్పకుండా ఆ రోడ్డు వివరాలు ఈరోజే తెప్పించుకొని అంత త్వరగా వీలైతే అంత త్వరగా దాన్ని పూర్తి చేస్తాం. ఈ సభ ద్వారా, మీద్వారా యావత్ రాష్ట్రానికి సమాచారం అందించ వలసిన అవసరం ఉంది. గతంలో మేము కూడా శాసనసభ్యులుగా, మంత్రిగా ఉన్నాం. ఒక మంత్రి అయినా, ఒక శాసనసభ్యుడైనా ఒక కోటి, రెండు కోట్ల విలువైన గ్రామ రోడ్లు మంజూరు కావాలంటే నెలలు కాదు కదా సంవత్సరాల తరబడి నిరీక్షించడమే గాకుండా, వందల సార్లు తిరిగినా శాంక్షన్ అయ్యేది కాదు. అయితే తెలంగాణాలో జిల్లాల పునర్ విభజన జరగక ముందున్న పది జిల్లాలలో ఎవరు అడగకుండానే, పార్టీలకు, ప్రజాప్రతినిధులకు అతీతంగా రాష్ట్రంలో ఉన్న మొత్తం రోడ్లన్నీ కూడా ఒకేసారి మంజూరీ చేయించి, గౌరవ ముఖ్యమంత్రి గారు ఈ రోడ్ల బాధలను తప్పించడం జరిగింది. ఈ విషయాన్ని గమనించవలసిందిగా గౌరవ సభ్యులను కోరుతున్నాను.

## జంటనగరాల్లోని శివార్లలో త్రాగునీటి కొరత

ప్రశ్న నెం.1410 (129)

సర్వశ్రీ కూచుకుళ్ళ దామోదర్ రెడ్డి, మహమ్మద్ అలీ షబ్బీర్, ఎం. రంగారెడ్డి, ఎం.ఎల్.సి.లు:– గౌరవనీయులైన సమాచార సాంకేతిక విజ్ఞాన మరియు మునిసిపలు పరిపాలన & పట్టణాభివృద్ధి శాఖ మంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా?

(అ) హైదరాబాదు నగర శివార్లలో ప్రత్యేకించి ఒ.ఆర్.ఆర్ పరిసర ప్రాంతాల్లో చెరువులు నిండుగా ఉన్నప్పటికీ తీవ్రత్రాగునీటి కొరత ఉన్న విషయం వాస్తవమేనా?

(ఆ) అయితే, అందుకు గల కారణాలేమిటి?

(ఇ) సదరు ప్రాంతాలలో నీటి సరఫరాను పెంచేందుకు తీసుకున్న చర్యలేమిటి?

గౌ. మున్సిపల్ పరిపాలన & పట్టణాభివృద్ధి శాఖ మంత్రి (శ్రీ కె. తారకరామారావు):– (అ) లేదండీ.

(ఆ) ఈ ప్రశ్న ఉత్పన్నం కాదు.

(C) "హైదరాబాదులోని, గ్రేటర్ హైదరాబాదు మునిసిపలు కార్పోరేషను వెలుపల ఒఆర్ఆర్ పరిధిలో ఉన్న 190 గ్రామాలు /

జనావాసాలకు నీటిని సరఫరా చేయడం" కోసం ప్రభుత్వం 04-11-2016 తేదీ గల, ఎం.ఎ & యుడి శాఖ, జి.ఓ.ఎం ఎస్. నెం. 262 ద్వారా రూ.1136 కోట్ల పరిపాలక మంజూరును ఇచ్చింది. హెచ్ఎండబ్ల్యూ ఎస్ఎస్‌బి టెండర్లను పిలిచింది.

శ్రీ కె. దామోదర్ రెడ్డి: (స్థానిక సంస్థలు – మహబూబ్‌నగర్) అధ్యక్షా, ఈ అవుటర్ రింగు రోడ్డు పరిసర ప్రాంతాల ప్రజలకు హైద రాబాదు మెట్రో వాటర్ వర్క్స్ నుంచి ఇది వరకే తాగునీటి సరఫరా అయ్యేది. అయితే గత సంవత్సరం వేసవిలో నాలుగు మాసాల పాటు పూర్తిగా నీటి సరఫరా నిలిచిపోయింది. ఆ టైములో ఆ ప్రాంతాల ప్రజలు చాలా ఇబ్బందులు పడ్డారు. రెండు నెలలు పోతే మళ్లీ వేసవి వస్తోంది. వేసవిలో ఎటువంటి సమస్య లేకుండా చర్యలు ఏమైనా తీసుకుంటున్నారా? దయచేసి చెప్పాలని మంత్రిగారిని కోరుతున్నాను.

శ్రీ పొంగులేటి సుధాకర్ రెడ్డి: అధ్యక్షా, జంట నగరాల శివార్లలో తీవ్రమైన తాగునీటి సమస్య ఉంది. మీరు కూడా శివారు ప్రాంతంలో ఉంటారు. మేము కూడా ఈమధ్యన శివారు ప్రాంతానికి షిఫ్ట్ అయ్యాం. భూమిలోపలికి ఎంత వరకు వెళ్లాలో అంత వరకు వెళ్లి నీటిని తోడుతూ శివార్లలో పెద్ద వాటర్ బిజినెస్ చేస్తున్నారు కొంత మంది. ఓఆర్ఆర్ పరిధిలో ఉన్న గ్రామాలకు మంచినీటిని సరఫరా చేసే పనులకు సంబంధించిన టెండర్ ప్రాసెస్ ఏ దశలో ఉంది? సాధ్య మైనంత త్వరగా దాన్ని పూర్తి చేయండి. వర్షాలు బాగా పడ్డాయి, భూగర్భ జలాలు కూడా పెరిగాయి. At the same time, in anticipation of things, disaster వచ్చినప్పటికీ ఇబ్బంది లేకుండా మీరు అడ్వాన్స్ ప్లానింగులో తీసుకున్న చర్యలు చాలా అభి నందనీయం. అయితే ఈ పనులను ఇంకా వేగవంతం చేయవల సిన అవసరం ఉంది. హెచ్‌యండబ్ల్యుయస్‌యస్‌బిలో అనేక అవక తవకలు గతంలో జరిగాయి. సంబంధిత అధికారులు మీద మీరు తీసుకున్న చర్యలేమిటి? చెప్పాలని మంత్రిగారిని కోరుతున్నాను.

**10.40 ఉ.** శ్రీ కె. తారక రామారావు : అధ్యక్షా, ఈ శివారు మున్సిపాల్టీలు ఏవైతే హైదరాబాద్‌లో విలీనమైనాయో, వాటన్నింటికీ సంబంధించి రూ.1900కోట్లతో ఇప్పటికే డ్రింకింగ్‌వాటర్ సప్లై కార్యక్రమం జరుగుతోంది. వాటికి హడ్కో నుండి రూ.1700కోట్లు రుణంగా సేకరించడం జరిగింది. రూ.200కోట్లు రాష్ట్ర ప్రభుత్వం నుండి వెచ్చించడం జరుగుతోంది. మొత్తంగా ఈ కార్యక్రమంలో భాగంగా శివారు మున్సిపాల్టీల్లో పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ శివారు మున్సిపాల్టీల వెలుపల, అవుటర్ రింగు రోడ్డు లోపల ఇందాక నేను చెప్పినట్లు దాదాపు 190 జనావాసాలున్నాయి. ఈ జనావాసాలు గతంలో గ్రామీణ నీటి సరఫరా(ఆర్‌డబ్ల్యూఎస్) పరిధిలో ఉండేవి. అవుటర్ రింగ్‌రోడ్డు లోపల ఉండే ప్రతి గ్రామీణ ప్రాంతాలన్నింటిని కూడా హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ ద్వారా నీటిని సరఫరా చేసేవిధంగా కార్యక్రమాన్ని రూపొందించడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని దాదాపు రూ.1136కోట్లతో చేయడం జరుగుతోంది. ఇదంతా కూడా సాధ్యమైనంత తొందరలో దాదాపు 2018 చివరి లోపలనే నీళ్లందించాలనే ఉద్దేశంతో ముందుకుపోతున్నాము.

గౌరవ సభ్యులు హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్‌లో జరిగిన అవకతవకల గురించి అడిగారు. స్పష్టంగా ఏదైనా ఫలానా ఉదంతం గురించి వారు అడిగితే నేను చెప్పేవాన్ని, తప్పకుండా ఏదైనా వారి దృష్టిలో ఉంటే ఆ వివరాలు మాకు పంపిస్తే తప్పకుండా చర్యలు తీసుకుంటాము.

శ్రీ పొంగులేటి సుధాకర్ రెడ్డి : అధ్యక్షా, అవకతవకలు జరిగినటువంటి వివరాలు పూర్తిగా నాదగ్గర ఉన్నాయి. వాటన్నింటిని తదుపరి గౌరవ మంత్రివర్యులు అందజేస్తాను.

శ్రీ కె. తారక రామారావు : అధ్యక్షా, ఎక్కడైనా అవకతవకలు జరిగిన ఉదంతాలు ఉంటే, తప్పకుండా చర్యలు తీసుకుంటాము. ఇప్పటికే చాలాచోట్ల చర్యలు తీసుకోవడం జరిగింది.

## రోడ్ల నిర్మాణం కొరకు అటవీ భూముల స్వాధీనం

ప్రశ్న నెం.1755(130)

సర్వశ్రీ పట్నం నరేందర్ రెడ్డి, సంకూరి రాజు, ఎం.ఎల్.సి.లు:- గౌరవనీయులైన అటవీ మరియు పర్యావరణ శాఖ మంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా:

(అ) అటవీ భూముల వల్ల రాష్ట్రంలో రోడ్లను వేసేటప్పుడు అనేక అడ్డంకులు ఏర్పడుతున్న విషయం వాస్తవమేనా ?

(ఆ) వికారాబాదు జిల్లా కొడంగల్, దౌలతాబాద్ మండలాల మధ్య రోడ్డు పనులు అటవీ అధికారులు సహాయ నిరాకరణ వల్ల ఆగిపోయిన విషయం కూడా వాస్తవమేనా?

(ఇ) అయితే, ఈ సమస్యను అధిగమించడానికి అటవీ భూములను స్వాధీనం చేసుకోవాలనే ప్రతిపాదన ఏదైనా పరిశీలనలో ఉందా?

గౌరవనీయులైన అటవీ మరియు పర్యావరణ శాఖ మంత్రి (శ్రీ జోగు రామన్న):- (అ) లేదండీ.

(ఆ) లేదండీ.

(ఇ) ఈ ప్రశ్న ఉత్పన్నం కాదు.

శ్రీ పట్నం నరేందర్ రెడ్డి : (స్థానిక సంస్థలు – రంగారెడ్డి) అధ్యక్షా, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత ఏ రాష్ట్రంలో లేనటువంటి అభివృద్ధి కార్యక్రమాలు మన గౌరవ ముఖ్యమంత్రి గారు చేపట్టడం జరిగింది. అందులో భాగంగానే రోడ్ల అభివృద్ధిలో మండల కేంద్రాలకు డబుల్ లేన్ రోడ్లు గానీ, జిల్లా కేంద్రాలకు నాలుగు లైన్ల రోడ్లకు అనేక నిధులు కేటాయించడం జరిగింది. అటవీ ప్రాంతాల్లోంచి ఏవైతే రోడ్లు వేయడం జరుగుతుందో, ఆ ప్రాంతాల్లో అటవీ అధికారులు రోడ్లను వేయకుండా అడ్డుకోవడం జరుగుతోంది.

ఉదాహరణకు, కొడంగల్ నియోజకవర్గ కేంద్రం నుండి దౌలతాబాద్, మద్దూర్ రెండు మండల కేంద్రాలకు డబుల్ లేన్ రోడ్లు మంజూరయ్యాయి. మధ్యలో ఒక కిలోమీటరు పొడవునా అటవీ ప్రాంతం ఉండడంతో అక్కడ అటవీ అధికారులు ఆ కిలోమీటరు పొడవునా డబుల్ లేన్ రోడ్డు వేయనీయలేదు. దానివల్ల విపరీతంగా ప్రమాదాలు జరిగి చాలామంది ప్రాణాలు కోల్పోతున్నారు. ఈవిధంగా ఒక వికారాబాద్ జిల్లాలోనే ఎనిమిది రోడ్లు అటవీ శాఖ అనుమతులు లేక ఆగిపోయిన సంఘటనలు ఉన్నాయి.

అదేవిధంగా పరిగి నియోజకవర్గం కుంటచెర్లలోని PMGSY రోడ్డులో మల్కాపూర్ వరకు 7.8కిలోమీటర్ల పిడబ్ల్యూ రోడ్డు మంజూరు కాగా, అందులో 2.5కిలోమీటర్లు అటవీ ప్రాంతమే ఉంది. అటవీ ప్రాంతం ఉన్నటువంటి ఈ 2.5కిలోమీటర్ల అనుమతి కొరకు బెంగుళూరులో ఉన్నటువంటి అటవీ శాఖకి 2010లో లేఖ వ్రాసినప్పటికీ కూడా, ఇప్పటివరకు అనుమతి రాలేదు. సదరు కాంట్రాక్టరు మిగతా 5 కిలోమీటర్ల పనులకి పనులు చేసి బిల్లు తీసుకొని వెళ్లిపోయాడు. కానీ, మిగిలినటువంటి 2.5కిలోమీటర్ల రోడ్డు అలానే ఆగిపోయింది. కాబట్టి, మన అటవీ శాఖ నిర్ణయం తీసుకుంటుందా లేక మన ప్రభుత్వమే కేంద్ర ప్రభుత్వానికి అనుమతి గురించి లేఖ వ్రాస్తుందో తెలియదు. కానీ, ప్రభుత్వ పరంగా చేపట్టే రోడ్లను గానీ, భవనాలను ఎక్కడా కూడా అటవీ శాఖ ఆపకుండా చర్యలు చేపట్టాలని మీద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

శ్రీ కర్నె ప్రభాకర్ : అధ్యక్షా, రోడ్ల నిర్మాణానికి ఈ రాష్ట్ర ప్రభుత్వం అనేక నిధులు కూడా కేటాయిస్తుంది. నాగోల్ నుండి గౌరెల్లి వరకు మొత్తం రేడియల్ రోడ్డు నిర్మాణం అయింది. కానీ, మధ్యలో కేవలం 200మీటర్ల మేరకు నాగోల్‌లోని బండ్లగూడా డిపో నుండి శ్రేయ కళాశాల వరకు అటవీ శాఖ భూమి ఉందని కరెక్ట్‌గా 200మీటర్లమేరకు రోడ్డు ఆగిపోయింది.

కుంట్లూరు క్రాస్ రోడ్డు సమీపంలోని రాజీవ్ స్వగృహ దగ్గర దాదాపు 1.5కిలోమీటరు అంటే, HMDA పరిధిలో ఉన్నటువంటి అటవీశాఖ భూములు ఇవి. గతంలో HMDA అధికారుల దగ్గరకు వెళ్లి నేను ప్రత్యక్షంగా అడిగితే ఆ అనుమతులు కేంద్ర ప్రభుత్వ అటవీ శాఖ నుండి రావాలని చెప్పడం జరిగింది. ఆ రెండు రోడ్ల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వ రోడ్లు, భవనాల శాఖ తయారుగా ఉంది. కాబట్టి, మన అటవీ శాఖ కేంద్ర ప్రభుత్వ అటవీ శాఖతో చర్చలు జరిపి ఈ రెండు రోడ్ల నిర్మాణాలు చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని మీద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

శ్రీ బలసాని లక్ష్మీ నారాయణ : (స్థానిక సంస్థలు – ఖమ్మం) అధ్యక్షా, ఇప్పటికే రోడ్డు ఉండి బి.టి. రోడ్డు వేశాక కూడా రోడ్డు వెడల్పు చేయడానికి అనుమతులు ఇవ్వడం లేదు. బండ్లగూడ వద్ద దాదాపు 200మీటర్ల పొడవు రోడ్డు ఉంటుంది. దానికి కనీసం మెటల్ రోడ్డు కూడా వేయనీయడం లేదు. గతంలో కూడా ఈ విషయాన్ని ఇదే సభలో రెండు, మూడు సందర్భాలు ప్రస్తావించడం జరిగింది. కొత్త రోడ్డుకి అనుమతివ్వాలంటే ఇబ్బందేమో గానీ, ఉన్న రోడ్డుని వెడల్పు చేయాలంటే అనుమతికి ఇబ్బందేమి వస్తుందో తెలియడం లేదు. కాబట్టి, ఇప్పటికే ఉన్నటువంటి రోడ్డుని వెడల్పు చేయడానికి ప్రభుత్వం ఉదారంగా అనుమతించేందుకు చర్యలు చేపట్టాలని మీద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

శ్రీ జోగు రామన్న : అధ్యక్షా, గౌరవ సభ్యులు శ్రీ పట్నం నరేందర్ రెడ్డి గారు అడిగినటువంటి రోడ్డుకి డిసెంబర్ మాసంలోనే మేము ఫేజ్–1 అనుమతివ్వడం జరిగింది. దానికి సంబంధించి రూ.7లక్షలు చెల్లించాలని తెలంగాణ రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖకి లేఖ కూడా వ్రాయడం జరిగింది. కానీ డిపార్టుమెంట్ నుండి ఇంతవరకు రిప్లై రాలేదు. ఆ డబ్బులు చెల్లించిన వెంటనే మిగతా పూర్తి అనుమతి ఇవ్వడం జరుగుతుందని మీద్వారా గౌరవ సభ్యులకి తెలియజేస్తున్నాను.

గౌరవ సభ్యులు శ్రీ బలసాని లక్ష్మీనారాయణ అడిగిన రోడ్డు విషయంలో మాట్లాడాలంటే, ఇప్పటికే ఉన్నటువంటి రోడ్లలో గ్రావెల్ రోడ్డుకి మెటల్ రోడ్డు వేసుకోవాలంటే అలాగే మెటల్ రోడ్డు ఉండి బి.టి. రోడ్డు వేసుకోవాలంటే అనుమతి ఇవ్వచ్చు. కానీ, ఉన్నటువంటి ఎగ్జిస్టింగ్ రోడ్డుని వెడల్పు చేసుకోవడానికి అనుమతి కావాలంటే మాత్రం ఖచ్చితంగా అనుమతి తీసుకోవాలి. అయితే ఐదు హెక్టార్ల వరకు అయితే రాష్ట్రస్థాయిలోనే అనుమతి ఇవ్వడానికి అవకాశం ఉంది. కాబట్టి, ఆ అనుమతులు ఇవ్వడానికి మేము సిద్ధంగా ఉన్నాము. కానీ, రోడ్డు మంజూరు అయినప్పుడు ఏదైతే Executive

Agency ఉంటుదో దానిద్వారా మా అటవీ శాఖకి ఒక లేఖ ద్వారా సమాచారం ఇచ్చి ఇది ఫలానా గ్రాంటుద్వారా మంజూరు చేయించుకున్నాము అని సమాచారం ఇస్తే అటువంటి వాటికి నెల, రెండు నెలల్లో అనుమతి ఇవ్వడానికి అవకాశం ఉంటుంది. రోడ్డు వేసే ప్రారంభంలోనే అటవీ శాఖ వారు అనుమతించలేదని నెపం పెట్టడం మంచిది కాదు.

రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో ఉన్నటువంటి విషయాలైతే సత్వరమే అనుమతించడానికి సిద్ధంగా ఉన్నాము. అటువంటివి ఏవైనా ఉంటే ముందుగానే అటవీ శాఖ అనుమతి కొరకు పంపిస్తే బాగుంటుంది. గత రెండున్నర సంవత్సరాల కాలంలో అటవీ శాఖ పరిధిలోని అనేక రోడ్లకు లిబరల్‌గా అనుమతులివ్వడం జరిగింది. కాకపోతే కొన్ని Executive Agencyలు అది ఇప్పటికే ఎగ్జిస్టింగ్ రోడ్డు ఉంది, దానికి అటవీ శాఖ అనుమతి అవసరం లేదని మొండిగా వాదిస్తున్నారు.

కాబట్టి రాష్ట్ర పరిధిలో ఉన్నటువంటి విషయాలకి సత్వరమే అనుమతులు ఇవ్వడం జరుగుతుందని తమరిద్వారా గౌరవ సభ్యులకి తెలియజేస్తున్నాను.

శ్రీ పొంగులేటి సుధాకర్ రెడ్డి: అధ్యక్షా, అటవీ శాఖ వద్ద రాష్ట్ర వ్యాప్తంగా ఎన్ని రోడ్లకి ఆ రకంగా అడ్డంకులున్నాయి. ఎక్కడెక్కడా సమస్యలున్నాయి. కేంద్ర ప్రభుత్వ పరిధిలోకి ఏ, ఏ రోడ్లు వస్తున్నాయనేది రాష్ట్రపరిధిలో ఒక టాస్క్‌ఫోర్స్ వేసి దానిద్వారా రోడ్లన్నీ సర్వే చేయాలని మీద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను. అలాగే గ్రీన్ రెవల్యూషన్ అంటూ హరితహారం కార్యక్రమం చేయడం జరిగింది. కానీ, ఉన్న చెట్లను కొట్టివేసి రోడ్లు వెడల్పు చేయడం జరుగుతోంది. ఈ విషయంలో రోడ్లు భవనాల శాఖ, అటవీ శాఖ మరియు ఎన్విరాన్‌మెంటల్ శాఖల నుండి ఎక్స్‌పర్ట్స్‌ని పెట్టి ప్రత్యేకంగా ఒక టాస్క్‌ఫోర్స్‌ని ఏర్పాటు చేసి ఈ విషయంలో చర్చలు తీసుకోవాలని తమ ద్వారా ప్రభుత్వానికి సూచిస్తున్నాను.

శ్రీ కర్నె ప్రభాకర్: అధ్యక్షా, గౌరవ మంత్రివర్యులు మాట్లాడుతూ మా పరిధిలో ఐదు హెక్టార్ల వరకు అనుమతించవచ్చని మాట్లాడారు. ఇక్కడే రోడ్లు, భవనాల శాఖ మరియు అటవీ శాఖ మంత్రి వర్యులు ఉన్నారు. ఒకవేళ ఆ రోడ్డు హెచ్ఎండిఏ పరిధిలోకి వస్తే హెచ్ఎండిఏకు సంబంధించిన మంత్రివర్యులను కలుపుకొని ముగ్గురు మంత్రులు ఇక్కడే ఉన్నారు. నేను అడిగిన రోడ్డు కేవలం 200మీటర్లు మాత్రమే ఉంది. కాబట్టి, ఆ రోడ్డు వివరాలు ఇక్కడున్నటువంటి అధికారులు నోట్ చేసుకొని వెంటనే సదరు అధికారులు సమన్వయం చేసుకొని దయచేసి ఆ రోడ్డు వేయించాల్సిందిగా మీద్వారా మంత్రిగారికి విజ్ఞప్తి చేస్తున్నాను.

శ్రీ సబావత్ రాములు నాయక్: అధ్యక్షా, గౌరవ మంత్రివర్యులు సమాధానం ఇస్తున్నారు. కానీ, ట్రైబల్ ప్రాంతంలో ఉండేటువంటి అధికారులు ఎంత ఇబ్బంది పెడుతారంటే, కనీసం నడవడానికి కూడా రోడ్డు ఇవ్వరు. మా అటవీ భూముల నుండి మీరు ఎట్లా నడుస్తారని అంటారు. అలాగే గిరిజన ప్రాంతాల్లోని రోడ్లు ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయనే సమాచారం ఇవ్వాలని మీద్వారా మంత్రివర్యులను కోరుతున్నాను.

శ్రీ జోగు రామన్న: అధ్యక్షా, గౌరవ సభ్యులు సుధాకర్ రెడ్డి గారు అడిగినట్లు, నేను లిబరల్‌గా అనుమతిస్తున్నామని ఎందుకు చెప్పానంటే, ఎగ్జిస్టింగ్‌గా ఉన్నటువంటి రోడ్ల విషయంలో గ్రావెల్ రోడ్డు ఉండి మెటల్ రోడ్డు వేయడానికి గానీ, మెటల్ రోడ్డు ఉండి బి.టి. రోడ్లు వేయడానికి కూడా గతంలో కేంద్ర ప్రభుత్వ అనుమతి అవసరం ఉండేది. ఈ ప్రభుత్వం ఏర్పడిన తరువాత అన్ని గ్రామాలకు రోడ్ల విస్తరణ సౌకర్యం కల్పించాలని గౌరవ ముఖ్యమంత్రి కోరుతున్నారు. అందుకొరకే అడిగిన వెంటనే ఎగ్జిస్టింగ్ రోడ్లకి అనుమతులివ్వాలనే ఆలోచనతో 2015లోనే రాష్ట్ర ప్రభుత్వం జీ.ఓ. తీసుకురావడం జరిగింది.

అదేవిధంగా రాష్ట్రప్రభుత్వ అటవీ శాఖ మరియు కేంద్ర ప్రభుత్వ అటవీ శాఖ అనుమతుల కొరకు మన రాష్ట్రంలో ఎన్ని దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయనే విషయాన్ని నేను గౌరవ సభ్యులకి వ్రాత పూర్వకంగా తెలియజేస్తాను. మాకు ఐదు హెక్టార్ల వరకు అనుమతిచ్చే అవకాశం ఉన్నప్పటికీ ఇప్పుడు గౌరవ సభ్యులు శ్రీ కర్నె ప్రభాకర్ తెలియజేసిన రోడ్డు విషయం చూసుకుంటే ఒకవేళ తాను చెప్పిన రోడ్డు గానీ, ఇతరత్రా ఏ రోడ్లయినా కూడా wild life areaలో ఉంటే, ఖచ్చితంగా National Board for Wild Lifeకి అనుమతి కొరకు పంపవలసిన అవసరం ఉంటుంది. అటువంటి అనుమతి కొరకు పంపించిన రోడ్లు మన దగ్గర 17 ఉన్నవి. అటువంటి wild life areaకి సంబంధించిన రోడ్లు కాకపోతే మాత్రం తప్పకుండా రాష్ట్ర ప్రభుత్వం ఐదు హెక్టార్ల వరకు అనుమతి ఇస్తుంది. అలాగే రెన్యువల్ చేసే రోడ్ల విషయంలో కూడా గౌరవ సభ్యులతో ఒకసారి రెవ్యూ మీటింగ్ కూడా ఏర్పాటు చేస్తానని మీద్వారా గౌరవ సభ్యులకి తెలియజేస్తున్నాను.

మిస్టర్ ఛైర్మన్: ప్రశ్న నెం.1409 సభ్యుడి కోరికమేరకు వాయిదా వేయడం అయినది.

MR. CHAIRMAN: Item No.II – All the papers are deemed to have been laid on the Table:

## II. PAPER LAID ON THE TABLE

A copy of the notification ssued in G.O. Ms. No. 2, S.E. (Prog.II) Dept., dated 3.2.2016 regarding the Amendment to the Elementary Teacher Training Institutions/ District Institutes of Education and Training (Regulation of Admissions into Diploma in Elementary Education Course through common Entrance Test) Rules, 2013, as required under Section 15 (2) of the Telangana Educational Institutions (Regulation of Admissions and Prohibition of Capitation fee) Act, 1983 (Act 5 of 1983)

## III . సభా కార్యక్రమం

### 1. ప్రత్యేక ప్రస్తావనలు

(A) డా. పల్లా రాజేశ్వర్ రెడ్డి : (పట్టభద్రుల నియోజకవర్గం – వరంగల్, ఖమ్మం, నల్గొండ) అధ్యక్షా, ఈమధ్య కాలంలో భారత దేశంలోనే ఒక అద్భుతమైన చర్యగా 10 జిల్లాలను 31 జిల్లాలుగా గౌరవ ముఖ్యమంత్రి శ్రీ కె.చంద్రశేఖర్ రావు గారు చాలా ఆర్గనైజ్డ్‌గా ప్లాన్ చేశారు. ఆ సందర్భంలో అనేక జిల్లా హెడ్ క్వార్టర్స్ కూడా కొన్ని చిన్న, చిన్న పట్టణాలుగా మాత్రమే ఉన్నాయి. ఇంకా కొద్దిగా చెప్పాలంటే రూరల్‌గా కొద్దిగా మాత్రమే ఎదిగిన దశలో ఉన్నాయి.

ఈ అంశం Urban Development and Panchayat Raj & Rural Development శాఖలకు సంబంధించినది. Urban Development Authorities మనకు ఉన్నవి మూడు. అందులో HUDA, KUDA, YUDA. అలాగే ఇంకా 24 ప్రాంతాలను అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీస్‌గా చేస్తారని పేపర్‌లో కూడా చూడడం జరిగింది.

ఈ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలను మిగతా జిల్లా సెంటర్‌లలో అన్నింటిలో ఏర్పాటు చేసినట్లయితే, వాటిద్వారా ఒక Organisedగా, Plannedగా, Smartగా ఈయొక్క పట్టణాలు అభివృద్ధి చెందుతాయి. కాబట్టి, దానిని సత్వరమే చేపట్టాలని కోరుతున్నాను. ఈ పట్టణాల అభివృద్ధి కొరకు కేంద్ర ప్రభుత్వ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ నుండి కూడా కొన్ని నిధులు వచ్చే అవకాశం ఉంది.

అలాగే కేంద్ర ప్రభుత్వం రూ.5,000కోట్లకు పైగా శ్యామ్ ప్రసాద్ రూర్బన్ మిషన్‌కి కేటాయించింది. అందులో భాగంగా కేంద్రం 300 రూర్బన్ సెంటర్స్‌ని అభివృద్ధి చేసుకోవడానికి అవకాశం కల్పించింది. మైదాన ప్రాంతాల్లో 25వేల నుండి 50వేల గ్రామ జనాభా ఉన్నట్లయితే అలాగే హిల్ ఏరియా గానీ లేదంటే గిరిజన ప్రాంతాల్లో 5వేల నుండి 15వేల జనాభా ఉన్నట్లయితే వాటిని రూర్బన్ సెంటర్స్‌గా గుర్తించి వాటిమీద ఒక ప్రాజెక్టు తయారు చేసి కేంద్రానికి పంపించినట్లయితే వాటిని అభివృద్ధి చేయడానికి మనం తయారు చేసి పంపించిన ప్రాజెక్ట్‌కి కేంద్రం 30 per cent critical gap funding ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నది. ఇప్పటికే మనం పైప్‌లైన్ నుండి వాటర్ సప్లై చేస్తున్నాము. Gas availability ఉన్నది. అలాగే డిజిటల్ లిటరసీకి వెళ్తున్నాము. అలాగే 14 రూర్బన్ మిషన్స్‌గా అభివృద్ధి చేయాలనే ఆలోచన కేంద్రానికి ఉన్నది. కాబట్టి 24 Urban Development Authorities తోపాటు 25వేల నుండి 50వేలు జనాభా ఉండేటువంటి కొన్నింటిని Tourism importance ఉన్నా, Pilgrimage importance ఉన్నా, Agricultural Sector importance ఉన్నా అలాగే Special entrepreneurship ఉన్నటువంటి సెంటర్స్‌ని Rurban Centersగా ఐడెంటిఫై చేసి ప్రణాళిక చేసినట్లయితే మనకు ఉపయోగకరంగా ఉంటుంది.

దయచేసి రెండు శాఖలు ఈ అంశంలో ఒక ప్రణాళిక తయారు చేసినట్లయితే బాగుంటుంది. వాటిని ఎలా ప్రణాళిక చేసుకోవాలనే విషయంలో కూడా కొంతవరకు కేంద్ర ప్రభుత్వం సహాయం అందిస్తుంది, 30 per cent critical gap funding వస్తుంది. అందుకని అర్బన్‌కి దగ్గరగా ఈ సెంటర్స్ అభివృద్ధి చెందినట్లయితే వాటిని భవిష్యత్తులో పట్టణ ప్రాంతాలలో కలపడానికి అవకాశం ఉంటుందని మీద్వారా మంత్రివర్యులకు విజ్ఞప్తి చేస్తున్నాను.

శ్రీ కె. తారక రామారావు : గౌరవ సభ్యులు చెప్పిన అంశాన్ని నోట్ చేసుకోవడం జరిగింది. తప్పకుండా సమాధానం చెబుతాము.

11.00 ఉ. (B) శ్రీ టి. సంతోష్‌కుమార్ : (శాసనసభ నియోజకవర్గం) తెలంగాణ రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య ఈరోజు నుండి కాదు ఎప్పటి నుండో ఉన్నది. తెలంగాణ ఉద్యమంలో 'మన ఉద్యోగాలు మనకు వస్తాయని, మన తెలంగాణ మనకు వస్తుందనే' ఒక నినాదం ఉండేది. ఆ నినాదంలో గ్రామాలలోని ప్రజలు, ఇంట్లో చదువురాని తల్లి కూడా నా కొడుకుకి ఉద్యోగం వస్తుందనే ఆశతో ఈ తెలంగాణ ఉద్యమంలో పని చేశారు. కాబట్టి పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా త్వరితగతిన ఏవైతే ఖాళీలు ఉన్నాయో, వాటిని తొందరగా భర్తీ చేయాలని రాష్ట్రప్రభుత్వాన్ని కోరుతున్నాను.

ఇంకో విషయం ఏమిటంటే, పబ్లిక్ సర్వీస్ కమిషన్ వాళ్లు కూడా నోటిఫికేషన్ ఇచ్చిన తరువాత కనీసం ఆరు నెలల నుండి సంవత్సరం వరకు పెండింగ్ పెడుతున్నారు. అలా కాకుండా మూడు నెలల లోపల ఈ సమస్య తీరే విధంగా రాష్ట్రప్రభుత్వం వారు పబ్లిక్ సర్వీస్ కమిషన్‌కి

సూచించవలసిందిగా తమరి ద్వారా గౌరవ మంత్రి గారికి మనవి చేస్తున్నాను.

(C) శ్రీ పాతూరి సుధాకర్ రెడ్డి : తెలంగాణ ప్రాంతంలో గోదావరి, కృష్ణా పరివాహక ప్రాంతాలున్నాయి. ఈ పరివాహక ప్రాంతాలలో ఎక్కువగా కవులు, రచయితలు ఉన్నారు. అనాది నుండి కూడా సాహితీవేత్తలకు నిలయమైనటువంటి ప్రాంతం తెలంగాణ గడ్డ. అయితే వీరు రచించిన కావ్యాలు ఏవైతే ఉన్నాయో, అవన్నీ కూడా ఈరోజు కనుమరుగయ్యేటటువంటి పరిస్థితి వస్తోంది. కాబట్టి తెలంగాణ రాష్ట్రం వచ్చిన తరువాత నా రాష్ట్రంలో నా పుస్తకాలు గ్రంథాలయాలలో ఉంటే బాగుంటుందనే అభిప్రాయాన్ని ఆ కవులందరూ వెలిబుచ్చుతున్నారు. అందువల్ల మన గ్రంథాలయాలలో ఆ పుస్తకాలను ఏర్పాటు చేసేటటువంటి సదుపాయాన్ని కల్పించమని, తమరి ద్వారా గౌరవ మంత్రిగారిని కోరుతున్నాను.

శ్రీ కడియం శ్రీహరి : అధ్యక్షా, గౌరవ సభ్యులు చెప్పిన విషయం నోట్ చేసుకోవడం జరిగింది.

(D) శ్రీ పూల రవీందర్ : గత 20, 25 సంవత్సరాలుగా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో స్వీపర్లు రూ.1,623/- వేతనంతో పనిచేస్తున్నారు. వీరికి గతంలో నెలకు రూ.150/- ఇచ్చేవారు. అప్పటి నుండి వారు పని చేసుకుంటూ వస్తున్నారు. ఈరోజు వారు లేకపోతే ఆ పాఠశాలలను శుభ్రం చేసే వాళ్లే ఉండరు. ఈ స్వీపర్లు చాలా దయనీయమైన స్థితిలో ఉన్నారు. వారు ఈ పనిని వదిలిపెట్టి ఇంకో పనికి పోలేరు. వీరు పాఠశాలల్లో ఫుల్‌టైమ్ పనిచేస్తే రోజుకు రూ.50/- నుండి రూ.55/- వరకు ఇస్తున్నారు. కాబట్టి వీరిని రెగ్యులరైజ్ చేయమని తమరి ద్వారా గౌరవ మంత్రి గారి దృష్టికి తీసుకొస్తున్నాను.

శ్రీ జూపల్లి కృష్ణారావు : అధ్యక్షా, గౌరవ సభ్యులు చెప్పిన విషయం నోట్ చేసుకోవడం జరిగింది. పరిశీలన చేస్తాము.

(E) శ్రీ యం.యస్. ప్రభాకర్ రావు : (స్థానిక సంస్థలు - హైదరాబాద్) అధ్యక్షా నేను చెప్పేది దేవాదాయ శాఖకు సంబంధించింది. జంట నగరాలలో 6(బి) కేటగిరి క్రింద సికింద్రాబాద్‌లో ఉజ్జయిని మహంకాళి దేవస్థానం, చిక్కడపల్లిలో శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం, బల్కంపేట్‌లో శ్రీ ఎల్లమ్మ పోచమ్మ దేవస్థానాలు ఉన్నాయి. వీరి ఆదాయం రూ.5 కోట్ల కంటే ఎక్కువగా పెరిగిపోయింది. కాబట్టి వారు అసిస్టెంట్ కమిషనర్ నుంచి డెప్యూటి కమిషనర్ లెవల్‌కి చేయాలని కోరుతున్నారు. అదేవిధంగా ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్స్‌కి కారు అలవెన్స్ అక్కడ ఉన్న ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కంటే చాలా తక్కువ ఇస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దయచేసి వారితో పాటు గానీ వారికంటే ఎక్కువగా గానీ ఇవ్వాలని కోరుతున్నారు. ఎందుకంటే ఆ గుడిని స్థాపించింది వారే. వాళ్లు కష్టపడి ఆ గుడిని కాపాడుకుంటూ వస్తున్నారు. ఈరోజు వారి పరిస్థితి చాలా దయనీయంగా ఉన్నది. దయచేసి వారిని ఆదుకోవలసిందిగా తమరి ద్వారా గౌరవ మంత్రిగారిని కోరుతున్నాను.

శ్రీ కె. తారక రామారావు : అధ్యక్షా, గౌరవ సభ్యులు చెప్పిన విషయం నోట్ చేసుకోవడం జరిగింది. తప్పకుండా పరిశీలిస్తాం.

(F) శ్రీ పొంగులేటి సుధాకర్ రెడ్డి : నకిలీ విత్తనాల సమస్య వలన అనేక అనర్థాలకు దారి తీస్తుంది. మా ఖమ్మం జిల్లాలో కూడా అనేక సంఘటనలు వెలుగులోకి వచ్చాయి. ఇప్పటికే Director General of Vigilance & Enforcement కి ఒక రైతు ఫిర్యాదు చేయడం జరిగింది. One of the Seed supplying agencies under the name of 'NACOF' 2015-16, 2016-17 సంవత్సరానికి సబ్సిడీ మీద సోయాబీన్ సప్లై చేసే ఒక నోడల్ ఏజెన్సీగా పని చేస్తోంది. For this purpose there should be sufficient infrastructure for production of the seed and the seed producing farmer should be a registered one, ఇలాంటి వాటిలో అనేక అనుమానాలున్నాయి.

Director General of Vigilance & Enforcement enquiry is under process. ముందు ఎంక్వైరీ చేసినప్పుడు ఒక నకిలీ ఏజెన్సీ క్రింద నకిలీ సర్టిఫికేషన్‌తో సీడ్ వ్యవహారం చేస్తున్నారని తెలిసింది. ఈ నేపథ్యంలో రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని సమగ్ర దర్యాప్తు జరుపవలసి ఉంది. ఇప్పటికే మన తెలంగాణ రాష్ట్రంలో such as Telangana State Seeds Development Corporation, TS MARKFED, TS OILFED, Hyderabad Agricultural Cooperative Association (HACA) ఉన్నాయి. మన తెలంగాణ రాష్ట్రంలో ఇలాంటి సొంత ఏజెన్సీస్ ఉండగా 'NACOF' కి ఒక రిటైర్డ్ ఉద్యోగి హెడ్‌గా పని చేస్తున్నాడు. దీనిమీద సమగ్ర దర్యాప్తు జరిపి న్యాయం చేయవలసిందిగా తమరి ద్వారా ప్రభుత్వానికి, గౌరవ మంత్రి గారికి మనవి చేస్తున్నాను.

శ్రీ తుమ్మల నాగేశ్వర రావు : అధ్యక్షా, గౌరవ సభ్యులు ఇచ్చిన సమాచారాన్ని ప్రభుత్వానికి పంపి, తప్పకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

## 2. వాయిదా ప్రతిపాదన

మిస్టర్ ఛైర్మన్ : రాష్ట్రంలోని లక్షలాది విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్ అందక తీవ్ర ఆందోళనలో ఉన్నందున, ప్రభుత్వం

వెంటనే ఆ బకాయిలను చెల్లించి, వారి విద్యకు విఘాతం కలుగకుండా చూడాలనే విషయమై చర్చించాలని గౌరవ సభ్యులు శ్రీ మహ్మద్ అలీ షబ్బీర్ గారు మరియు ఇతరులు ఇచ్చిన వాయిదా ప్రతిపాదనను తిరస్కరించడమైనది.

సభ్యులందరికీ మరొక్కసారి సూచన – తెలంగాణ ప్రభుత్వం చేనేత కార్మికులను ఆదుకోవాలని ప్రభుత్వ ఉద్యోగులు మరియు నాయకులందరూ చేనేత దుస్తులు ధరించి కార్మికులను ఆదుకోవాలని తీసుకున్నటువంటి నిర్ణయం మేరకు మన సభా ప్రాంగణంలో చేనేత స్టాల్‌ని ఏర్పాటు చేయడం జరిగింది. నిన్నటి రోజున గౌరవ సభ్యులందరూ సందర్శించారు. ఈరోజు కూడా గౌరవ సభ్యులు, గౌరవ మంత్రి వర్యులు, విజిటర్స్, జర్నలిస్ట్‌లందరూ కూడా కొనుగోళ్లలో పాల్గొని చేనేత కార్మికులకు సహాయంగా నిలబడి, ప్రజలకు మార్గదర్శకంగా ఉండాలని, అందరికి విజ్ఞప్తి చేస్తున్నాను.

టీ విరామం కొరకు సభను వాయిదా వేయడమైనది.

(టీ విరామం కొరకు సభను ఉదయం 11.10 గంటలకు వాయిదా వేయడం జరిగింది.)

**11.40 ఉ.** (తేనీటి విరామానంతరం సభ ఉదయం 11.40 గంటలకు ప్రారంభమైనది. గౌరవ ఛైర్మన్ అధ్యక్ష స్థానం వహించారు)

## IV. లఘు చర్చ :

శ్రీ జి. జగదీష్ రెడ్డి: అధ్యక్షా, లఘు చర్చపై మాట్లాడేందుకు అవకాశం ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. ప్రత్యేకించి కార్మికుల, ఉద్యోగస్తుల జీవితాలలో గొప్ప వెలుగులు నింపే అవకాశాన్ని గౌరవ ముఖ్యమంత్రిగారు కల్పించడం జరిగింది. చర్చ జరపడానికి ఇది మంచి సమయమని భావించి ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని తీసుకోవడం జరిగింది.

### ప్రగతిపథంలో సింగరేణి కార్మికుల సంక్షేమం

తెలంగాణకు తలమానికం సింగరేణి. సింగరేణి అభివృద్ధికి మూలం వేలాదిమంది కార్మికుల శ్రమ. సింగరేణి కార్మికుల చిరకాల కోరికలను మా ప్రభుత్వం నెరవేర్చింది. వారి కుటుంబాల్లో ఎన్నడూ లేనంత సంతోషం నింపింది. నల్లబంగారంగా భావించే అపారమైన బొగ్గు నిల్వలు రాష్ట్రంలోని కొమురంభీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో గోదావరి నది పరివాహక ప్రాంతంలో అపారంగా విస్తరించి ఉన్నాయి. సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ తెలంగాణ రాష్ట్ర ఆర్థిక పరిపుష్టికి, విద్యుత్ ఉత్పాదనకు, పారిశ్రామిక ప్రగతికి మూలాధారమైన బొగ్గును ఉత్పత్తి చేస్తూ, వేలాది మందికి ఉద్యోగ ఉపాధి అవకాశాలను కల్పిస్తున్నది.తెలంగాణ నేలగర్భంలో10,528 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలున్నాయి. సింగరేణి ఆధ్వర్యంలో ఇప్పటికే 1249 మిలియన్ టన్నుల బొగ్గును వెలికితీశారు. మరో శతాబ్దకాలం వరకు ఉత్పత్తిని కొనసాగించేందుకు వీలైనన్ని బొగ్గు నిక్షేపాలు ఇంకా ఉన్నాయి. కార్మికులు తమ కఠోర శ్రమతో భూగర్భంలోంచి బొగ్గును తవ్వితీస్తున్నారు. జాతి సంపదను పెంచడానికి స్వేదం చిందిస్తూ ప్రమాదపుటంచుల్లో పనిచేస్తున్న సింగరేణి కార్మికుల శ్రమ.... దేశ రక్షణ కోసం సరిహద్దుల్లో కాపలా కాస్తున్న సైనికుల కృషికి ఏ మాత్రం తీసిపోదనే సత్యాన్ని ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రసాధన కోసం జరిగిన మహోద్యమంలో కూడా సింగరేణి కార్మికులు చూపించిన చైతన్యం సాటిలేనిది. అందుకే మా ప్రభుత్వం సింగరేణి కార్మికులకు పెద్దఎత్తున ప్రయోజనం చేకూర్చే నిర్ణయాలను తీసుకున్నది. ఇంతింతై వటుడింతై అన్నట్లుగా సింగరేణి సంస్థ ఎదగడం వెనుక కార్మికుల అలుపెరగని శ్రమ ఉంది.

1871వ సంవత్సరంలో జియాలాజికల్ సర్వే ఆఫ్ ఇండియాకు చెందిన డాక్టర్ విలియమ్ కింగ్ ఇల్లందు ప్రాంతంలో మొట్టమొదటి సారిగా బొగ్గు నిల్వలను గుర్తించాడు. ఈ బొగ్గు నిల్వల మీద 1886లో ఇంగ్లండ్‌కు చెందిన డక్కన్ కంపెనీ లిమిటెడ్ హక్కులు పొందింది. 1889లో ఖమ్మం జిల్లాలోని సింగరేణి అనే చోట బొగ్గు తవ్వకాలు ప్రారంభమయ్యాయి. ఇప్పుడు బొగ్గు దొరికే ప్రాంతాన్నంతా సింగరేణిగానే వ్యవహరిస్తున్నాము. 1920 డిసెంబర్ 23న సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ అనే సంస్థ ఏర్పడింది. 1945లో నిజాం ప్రభుత్వం సంస్థలోని ఎక్కువ భాగాన్ని కొనుగోలు చేసి, మేనేజింగ్ ఏజంట్‌గా కంపెనీ కార్యకలాపాలను నిర్వహించింది. 1960 నుంచి భారత ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం 49:51 నిష్పత్తిలో భాగస్వాములుగా సింగరేణిని నిర్వహిస్తున్నాయి.

దక్షిణ భారతదేశంలోనే బొగ్గు ఉత్పత్తి చేస్తున్న ఏకైక కంపెనీ సింగరేణి కావడం మన రాష్ట్రానికి గర్వకారణం. సంస్థ ఉత్పత్తి చేస్తున్న బొగ్గుతో మన రాష్ట్రంతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల థర్మల్ విద్యుత్ అవసరాలు తీరుతున్నాయి. ప్రతీ సంవత్సరం 600 లక్షల టన్నుల బొగ్గును సింగరేణి ఉత్పత్తి చేస్తున్నది. ఇందులో 78.71 శాతం బొగ్గు ద్వారా థర్మల్ విద్యుత్ అవుతుంది. రాష్ట్రానికి, దేశానికి విద్యుత్ వెలుగులు అందిస్తున్నది. ఇంకా, స్పాంజ్ ఐరన్, సిమెంట్, ఎరువులు, ఫార్మా తదితర పరిశ్రమలకు అవసరమైన బొగ్గును కూడా సింగరేణే సరఫరా చేస్తున్నది.

ప్రస్తుతం సింగరేణిలో 46 గనులుండగా, అందులో 30 భూగర్భగనులు, 16 ఓపెన్ కాస్టు గనులున్నాయి. ఓపెన్ కాస్టు గనుల్లో షవర్ డంపర్, డ్రాగ్ లైన్, హైవాల్ పద్ధతుల్లో బొగ్గును వెలికితీస్తున్నారు. భూగర్భ గనుల్లో లాంగ్ వాల్, కంటిన్యూయస్ మైనర్, బ్లాస్టింగ్ గాలరీ, ఎస్డీఎల్, ఎల్.హెచ్.డి. పద్ధతులు అవలంబిస్తున్నారు. భూగర్భ గనుల్లో బొగ్గు అత్యధికంగా ఉత్పత్తి చేయడానికి అనువైన భారీ ఆడ్రియాలా లాంగ్ వాల్ ప్రాజెక్టు సింగరేణి కలిగి ఉంది.

సింగరేణిలో మొత్తం 56,866 మంది కార్మికులు పనిచేస్తున్నారు. భూగర్భ గనుల్లో 34,764 మంది కార్మికులు పనిచేస్తుండగా, ఓపెన్ కాస్టు గనుల్లో 10,427 మంది కార్మికులు పనిచేస్తున్నారు. 2015-16 లో మొత్తం ఉత్పత్తి 600 లక్షల టన్నులు కాగా దీనిలో ఓపెన్ కాస్టు గనుల నుంచి 497 లక్షల టన్నులు, భూగర్భ గనుల నుంచి 106 లక్షల టన్నుల ఉత్పత్తి జరిగింది. అంటే 61 శాతం మంది పనిచేస్తున్న భూగర్భ గనుల్లో 17 శాతం బొగ్గు ఉత్పత్తి జరుగుతుంటే, 18 శాతం కార్మికులు పనిచేస్తున్న ఓపెన్ కాస్టుల ద్వారా 82 శాతం బొగ్గు ఉత్పత్తి అవుతున్నది.

భూగర్భ గనుల్లో టన్ను బొగ్గుకోసం అయ్యే ఉత్పత్తి వ్యయం రూ. 4,118/-. కాగా అమ్మకం ధర రూ. 2360/-. అంటే ఒక్కో టన్నుకు రూ.1758/- నష్టాన్ని సంస్థ భరించాల్సి వస్తున్నది. ఓపెన్ కాస్టు గనుల్లో టన్ను బొగ్గు ఉత్పత్తి వ్యయం రూ. 1204/-. అమ్మకం ధర రూ.2,008/-. ప్రతీ టన్ను పైన రూ. 804/- లాభం వస్తున్నది. 2015-16 వ సంవత్సరంలో భూగర్భ గనుల వల్ల రూ.1869 కోట్లు నష్టం రాగా, ఓపెన్ కాస్టు గనుల ద్వారా రూ. 3998 కోట్లు లాభం వచ్చింది. ఇదే విధంగా గత ఆరు సంవత్సరాలలో భూగర్భ గనుల ద్వారా వచ్చిన నష్టం రూ.8118 కోట్లు కాగా, ఓపెన్ కాస్టు గనుల ద్వారా వచ్చిన లాభం రూ.12,469 కోట్లు. భూగర్భ గనుల ద్వారా వస్తున్న నష్టాన్ని ఓపెన్ కాస్టుల ద్వారా వస్తున్న లాభాలతో పూడుస్తూ సంస్థ ముందుకుపోతున్నది. లాభాలు తెచ్చిపెడుతున్న ఓపెన్ కాస్టు గనులు లేకుండా సింగరేణి కంపెనీ మనుగడ సాధ్యం కాదనే విషయాన్ని అందరం గుర్తించాలి. ఈ వాస్తవం గుర్తించి కోల్ ఇండియాతో సహా జాతీయ, అంతర్జాతీయ సంస్థలన్నీ ఓపెన్ కాస్టు విధానాన్నే అవలంభిస్తున్నాయనేది వాస్తవం. ఓపెన్ కాస్టు ప్రాంతాలలో పర్యావరణ రక్షణ కోసం ఇప్పుడు అమలవుతున్న విధానంకన్నా మెరుగైన, సమగ్రమైన విధానాన్ని ప్రభుత్వం రూపొందిస్తున్నది.

భూగర్భగనుల ద్వారా ఆర్థికంగా నష్టం వస్తున్నప్పటికీ, వాటిపై ఆధారపడిన వేలాది మంది కార్మికుల ఉపాధిని దృష్టిలో పెట్టుకుని తెలంగాణ ప్రభుత్వం భూగర్భ గనుల ద్వారా ఉత్పత్తిని కొనసాగిస్తున్నది. భూగర్భ గనుల్లో నష్టాలను తగ్గించడం కోసం, లాభాల బాట పట్టించడం కోసం ప్రభుత్వం అన్ని ప్రయత్నాలు చేస్తున్నది. తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కార్మికులకు అన్ని విషయాలు వివరించేందుకు మల్టీ డిపార్ట్‌మెంట్ లెవల్ సమావేశాలు నిర్వహించాము. దీంతో కార్మికులు, అధికారులు సమన్వయంతో కొత్త ఉత్సాహంతో పనిచేస్తున్నారు. ఈ మార్పు వల్ల 2015-2016వ సంవత్సరంలో 600 లక్షల టన్నులు ఉత్పత్తి చేసి, 15శాతం వృద్ధి రేటును సాధించిన సింగరేణి నేడు దేశంలోనే నెంబర్‌వన్ కంపెనీగా నిలిచింది. కోల్ ఇండియా, ఇతర ప్రభుత్వరంగ సంస్థలకన్నా ముందున్నది.

2009-2014 మధ్య ఐదేళ్లకాలంలో సగటున 3శాతం మాత్రమే వృద్ధిని సాధించిన సింగరేణి తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 15శాతం వృద్ధి రేటును సాధించడం గమనార్హం. కార్మికులను విశ్వాసంలోకి తీసుకుంటూ ప్రభుత్వం అనుసరించిన విధానాలు సత్ఫలితాలనిస్తున్నాయి. సింగరేణి లాభాల బాట పట్టింది. 2009-2014 మధ్య ఐదేళ్ల కాలంలో సింగరేణి ఆర్జించిన లాభం ఏడాదికి సగటున రూ.400 కోట్లు. 2015-2016వ సంవత్సరంలో సింగరేణి ఆర్జించిన లాభం రూ.1066 కోట్లు. కష్టపడి సింగరేణికి లాభాలు తెచ్చిపెట్టిన కార్మికులకు సముచిత వాటా ఇవ్వాలని ప్రభుత్వం భావించింది. అందుకే ఇటు సింగరేణి చరిత్రలో గానీ, అటు దేశ చరిత్రలో గానీ ఎన్నడూలేని విధంగా లాభాల్లో 23 శాతం వాటాను, అంటే రూ. 245 కోట్లు కార్మికులకు చెల్లించాము. దీపావళి బోనస్ కింద ప్రతీ కార్మికుడికి సగటున రూ.54,000/- చొప్పున మొత్తం రూ.303 కోట్లు చెల్లించాం. ఈ విధంగా ఒక్క నెలరోజులలోపే దసరా, దీపావళి పండుగల సమయంలో ఒక్కో కార్మికుడు సగటున రూ.1.00 లక్షనుంచి రూ.1.25 లక్షల వరకు పొందారు. ఈ నిర్ణయం కార్మికుల ఇండ్లలో పండుగ ఆనందం కన్నా మించిన ఆనందం పంచింది.

సింగరేణి కార్మికులకు ఎంతో కాలంగా ఉన్న డిపెండెంట్ ఉద్యోగాల హక్కును 1998లో అప్పటి ప్రభుత్వం రద్దుచేసింది. హక్కును పునరుద్ధరించమని కార్మికులు గత 18 ఏండ్లుగా మొరపెట్టుకుంటూనే ఉన్నారు. కానీ వారి వేదన అరణ్యరోదనగానే మిగిలిపోయింది. ఏళ్లతరబడి కార్మికులు చేసిన సేవలకు గుర్తింపుగా వారు కోరిన వారికి ఉద్యోగాలు ఇవ్వడం న్యాయమని మేము భావించాము. మేము అధికారంలోకి వస్తే డిపెండెంట్ ఉద్యోగాల హక్కును పునరుద్ధరిస్తామని ఎన్నికల సందర్భంలో హామీ ఇచ్చాం. ఇచ్చిన మాటకు కట్టుబడి డిపెండెంట్ ఉద్యోగాల హక్కును పునరుద్ధరించాం. దాదాపు రెండు దశాబ్దాల తర్వాత సింగరేణిలో

డిపెండెంట్ ఉద్యోగాల నియామక ప్రక్రియ మళ్లీ ప్రారంభమయింది జనవరి1 నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. దీనితో కార్మికుల కుటుంబాలలోంచి మరోతరం ఉత్పత్తిలో భాగం పంచుకోవడానికి సిద్ధమవుతున్నది. కార్మికుల కుటుంబాల్లో ఆనందం వెల్లివిరుస్తున్నది. అనారోగ్య కారణాల వల్ల అన్‌ఫిట్ అయిన కార్మికుల వారసులకు ఉద్యోగం ఇచ్చే విషయంలో గత ప్రభుత్వాలు పరిమితి విధించాయి. ఏడాదికి 200 నుంచి 250 వరకు అన్‌ఫిట్ డిపెండెంట్ ఉద్యోగాలు ఇస్తూ వచ్చారు. మా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అన్‌ఫిట్ అయిన వారి వారసులు 3,200 మందికి ఉద్యోగాలు ఇచ్చాం. వారసులకు ఉద్యోగం వద్దనుకున్నప్పుడు కార్మికుడికి ఇచ్చే పరిహారాన్ని రూ.5.00 లక్షల నుంచి రూ.12.50 లక్షలకు పెంచాము. గని ప్రమాదంలో కార్మికులు మరణిస్తే గత ప్రభుత్వాలు కేవలం రూ.7.00 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇచ్చేవి. మా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఎక్స్‌గ్రేషియాను భారీగా పెంచాం. సంస్థ కాంట్రిబ్యూషన్ కింద రూ.10.00 లక్షలు, కార్మికుల కాంట్రిబ్యూషన్ కింద రూ.10.00 లక్షలు, ఎక్స్‌గ్రేషియా రూ.5.00 లక్షలు... మొత్తం రూ.25.00 లక్షలు కార్మికుడి కుటుంబానికి ఎక్స్ గ్రేషియా అందచేస్తున్నాం. కార్మికుడు ఉద్యోగంలో ఉండగా సహజ మరణం చెందితే, ఇచ్చే పరిహారం గతంలో కేవలం రూ.1.50 లక్షలు. ఇప్పుడు రూ.15.00 లక్షలు అందచేస్తున్నాం. ఈ విధంగా మెరుగైన పరిహారం ఇచ్చే పద్ధతి దేశంలో మరే ఇతర బొగ్గు కంపెనీలో లేదు.

కార్మికులకు పని పరిస్థితులను (వర్కింగ్ కండిషన్స్) మెరుగుపర్చేందుకు ప్రభుత్వం పలు చర్యలు తీసుకున్నది. కార్మికులు గతంలో బరువైన క్యాప్ ల్యాంపులు ధరించి గనిలోకి దిగేవారు. కార్మికులకు ఈ కష్టం తప్పించేందుకు వీటి స్థానంలో లక్షలాది రూపాయలు వెచ్చించి కేవలం 400 గ్రాముల బరువుండే క్యాప్ ల్యాంపులు అందచేశాము. భూగర్భ గనిలోకి 2 నుంచి 5 కిలో మీటర్ల దూరం నడవాల్సిన అవసరం ఉండేది. ఇప్పుడా అవసరం లేకుండా ప్రతీ గనిలో మ్యాన్‌రైడింగ్ సిస్టమ్ ఏర్పాటు చేశాము. కోలిండియాలో కూడా ఇలాంటి మ్యాన్‌రైడింగ్ సిస్టమ్ ఇంకా ప్రతీ గనిలోనూ కార్మికులకు అందుబాటులోకి తేలేదు. కార్మికులు నివసించే కాలనీలలో సమస్యలను పరిష్కరించడం కోసం 'మీ కోసం - మీ చెంతకు' అనే వినూత్న కార్యక్రమాన్ని సింగరేణి అమలు చేస్తున్నది. కొత్త రోడ్లు, డ్రైనేజీలు, పార్కులు, స్విమ్మింగ్ పూల్, వ్యాయామశాలలు ఏర్పాటు చేసింది.

తెలంగాణ గర్వించే సింగరేణి సంస్థను మరింత విస్తృత పరిచేందుకు, పటిష్ఠ పరిచేందుకు ప్రభుత్వం ప్రణాళిక రూపొందిస్తున్నది. వచ్చే ఐదేళ్ల కాలంలో 20 ఓపెన్ కాస్టు గనులు, 11 భూగర్భ గనులు కొత్తగా ప్రారంభించబోతున్నదని తెలియజేస్తున్నాను. ప్రస్తుతం 600 లక్షల టన్నులున్న బొగ్గు ఉత్పత్తిని 2020-21 నాటికి 900 లక్షల టన్నులకు పెంచాలని సింగరేణి లక్ష్యంగా పెట్టుకున్నది. దీని ద్వారా తెలంగాణలో నిర్మించే థర్మల్ విద్యుత్ కేంద్రాలకు చాలినంత బొగ్గును అందించడంతో పాటు, వేలాది పరిశ్రమలకు బొగ్గు సరఫరా చేయడం సాధ్యమవుతుంది. కొత్తగా 11,621 మందికి ఉద్యోగాలు వస్తాయి.

ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర పరిధిలోనే బొగ్గును వెలికితీస్తున్న సింగరేణి ఇతర రాష్ట్రాలకు, దేశాలకు విస్తరించేందుకు కార్యాచరణకు దిగింది. ఇప్పటికే కేంద్రం కేటాయించిన ఒరిస్సాలోని నైనీ బొగ్గు బ్లాకులో పని ప్రారంభించింది. విదేశాల్లో కూడా కార్యకలాపాలు విస్తరించడం కోసం సింగరేణి ప్రయత్నాలు చేసింది. ఆస్ట్రేలియా, అమెరికా, దక్షిణాఫ్రికా, చైనా, ఇండోనేషియా, జర్మనీ, ఫ్రాన్స్, ఇంగ్లాండ్, కెనడా దేశాల్లో బొగ్గు వ్యాపారానికి ఉన్న అవకాశాలను సింగరేణి అధికారులు వెళ్లి పరిశీలించారు. సింగరేణితో కలిసి పనిచేసేందుకు ప్రపంచవ్యాప్తంగా 13 కంపెనీలు ఆసక్తి చూపాయి. అయితే ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్లో బొగ్గు ధరలు పడిపోయాయి. కనుక సానుకూల పరిస్థితి ఏర్పడే వరకు వేచి యుండాలని నిర్ణయించాము.

బొగ్గు ఉత్పత్తితో పాటు విద్యుత్ ఉత్పత్తి రంగంలోనూ సింగరేణి అడుగుపెట్టింది. జైపూర్ వద్ద 1200 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి ప్లాంటును నిర్మించింది. గత ఆగస్టు 7వ తేదీన గౌరవ ప్రధానమంత్రి నరేంద్రమోదీ గారు ఈ ప్లాంటును జాతికి అంకితం చేశారు. త్వరలోనే సింగరేణి సంస్థ మరో 800 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి ప్లాంటు నెలకొల్పేందుకు సన్నాహాలు చేస్తున్నది. బొగ్గును, విద్యుతును రెండూ సింగరేణి ఉత్పత్తి చేయడం వల్ల కరెంటు ఉత్పత్తి వ్యయం తగ్గుతున్నది. అందువల్ల తెలంగాణ డిస్కమ్‌లకు ఇతరుల కన్నా తక్కువ ధరకు సింగరేణి విద్యుత్‌ను అందిస్తున్నది. ఆ విధంగా సింగరేణితో తెలంగాణ డిస్కమ్ లకు కూడా ప్రయోజనం కలుగుతుంది.

యాజమాన్యం, కార్మికులు అనే విభజనకు అతీతంగా, సింగరేణి అంతా ఒకే కుటుంబంగా భావించి ఉత్పత్తిలో పాలుపంచుకోవాలని ప్రభుత్వం పిలుపునిచ్చింది. మా పిలుపును ఉన్నతాధికారులు, ఉద్యోగులు, కార్మికులు ప్రతిస్పందించారు. చేయి చేయి కలిపి సింగరేణిని ప్రగతిపథంలో నిలిపేందుకు పరిశ్రమిస్తున్నారు. అందరూ ఒకటే అనే భావన కలిగేందుకు వీలుగా కార్మికులు, అధికారులు ఒకే యూనిఫాం ధరిస్తున్నారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత తెలంగాణ

ప్రత్యేక ఇంక్రిమెంటు, సకల జనుల సమ్మె కాలానికి వేతనం, లాభాల్లో పెద్ద వాటా, బోనస్, ఎక్స్ గ్రేషియా పెంపు, డిపెండెంట్ ఉద్యోగాల హక్కు పునరుద్ధరణ లాంటి చర్యలు సింగరేణి కార్మికుల్లో ప్రభుత్వం పట్ల ఎనలేని విశ్వాసం పెంచాయి. ఈ సందర్భంగా రాష్ట్రాన్ని బంగారు తెలంగాణగా రూపుదిద్దేందుకు నల్లబంగారాన్ని వెలికితీస్తూ గొప్ప సంపదను సృష్టిస్తున్న కార్మికలోకానికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియచేస్తున్నాను.

శ్రీ పొంగులేటి సుధాకర్ రెడ్డి: అధ్యక్షా, ప్రగతిపథంలో సింగరేణి కార్మికుల సంక్షేమం అనే లఘు చర్చపై మాట్లాడేందుకు అవకాశం ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. నల్లబంగారం, కొంగుబంగారం అయిన బొగ్గును కాపాడుకోవడం కోసం ఆరోగ్యవంతమైన సింగరేణి, బలమైన సింగరేణి, ఆర్థిక పరిపుష్టమైన సింగరేణి కొరకు తమరి అనుమతితో నాకున్న అనుభవంతో సలహాలు, సూచనలు ఇవ్వదలచుకున్నాను.

తెలంగాణ ఉద్యమంలో ఖమ్మం జిల్లాలో ఉన్నటువంటి ఇల్లెందు, పాల్వంచ గణనీయమైన పాత్రను పోషించాయి. తెలంగాణ ఏర్పడిన తరువాత సింగరేణి ఉద్యోగులకు ప్రత్యేక ఇంక్రిమెంట్లు, బోనస్‌లు, లాభాలలో పెద్ద వాటా, ఎక్స్‌గ్రేషియా పెంపు, డిపెండెంట్ ఉద్యోగాల హక్కు, వారసత్వాల ఉద్యోగాల వరకు తీసుకున్నటువంటి నిర్ణయాలను మనస్పూర్తిగా అభినందిస్తున్నాను.

గత ప్రభుత్వంలో సింగరేణిలో అనేక కార్యక్రమాలు చేసి, వ్యవస్థలో భాగంగా సింగరేణి ఉత్పత్తిలో దినదినాభివృద్ధి చెందుతూ, అనేక రకాలుగా అనేక రాష్ట్రాలలో విస్తరిస్తూ ఒక కామధేనువులాగా మన ప్రక్క రాష్ట్రాలైన మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు మొదలగు ప్రాంతాలలో కూడా మంచి ట్రాక్ రికార్డ్ ఉన్న సంస్థ ఇది.

ఏదైతే 600 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తిని లక్ష్యంగా పెట్టుకున్నారో దానిని 900 లక్షల టన్నులకు పెంచాలనే లక్ష్యంతో ముందుకు వెళ్లాలని కోరుకుంటున్నాను. ఈ సంస్థ ఎటువంటి సమస్యలు లేకుండా ముందుకు వెళ్లాలంటే చట్టం ఎవరికీ చుట్టం కాకుండా చూడాలి. సంవత్సరం పైన సర్వీసు ఉన్న వారికే వారసత్వ ఉద్యోగం ఇవ్వడానికి ప్రభుత్వం నిర్ణయించింది. అలా కాకుండా సంవత్సరం కన్నా తక్కువ సర్వీసు ఉన్నవారికి కూడా వారసత్వ ఉద్యోగాలను కల్పిస్తే యువకులకు ఉద్యోగాలు దొరుకుతాయి.

**12.00 మ.** గతంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఆ నాటి గౌరవ శాసన సభ స్పీకర్‌గారు, లెజిస్లేచర్ కమిటీ శ్రీ రాజన్న దొరగారి నేతృత్వంలో సింగరేణి నిర్వాసితుల పరిస్థితులను తెలుసుకోవడం కోసం ఆ ప్రాంతంలో పర్యటించడం జరిగింది. ప్రత్యేకంగా జి.ఓ.34, Tribal Empowerment Policy కోసం తీసుకురావడం జరిగింది. 2010-2015 మధ్యకాలంలో ఈ సింగరేణి మైన్స్‌లో ఇళ్లు కోల్పోయిన వారిని, ఇళ్ల స్థలాలు కోల్పోయిన వారిని గుర్తించి, Singareni Project displaced families తో మాట్లాడి, 585 పోస్టులను ఆ నాటి కమిటీ రికమెండ్ చేయడం జరిగింది. సింగరేణి అధికారులు అసెంబ్లీకి వచ్చి, మాట్లాడిన తరువాత, ఆ విషయాలను ఎండి. శ్రీ సురేంద్ర భట్టాచార్యగారు మినిట్స్‌లో పెట్టి, బోర్డు అనుమతి కూడా పొందినప్పటికీ, ఇంతవరకు అమలులోకి రాలేదు. 585 మంది పేద గిరిజనులకు మేలు జరిగే అంశం అయినప్పటికీ, ఇంతవరకు పెండింగ్‌లో ఉండిపోయింది. సంస్థ ఇంత పెద్ద ఎత్తున అభివృద్ధి చెందుతున్న ఈ సమయంలో వారికి న్యాయం చేయవలసిన అవసరం ఉంది.

ఒకపక్క వారసత్వ ఉద్యోగాలు కూడా ఇస్తున్నటువంటి సమయంలో, భూములు కోల్పోయినటువంటి వారికి Tribal Empowerment Policy క్రింద, జి.ఓ. 34 ప్రకారం, ఆల్‌రెడీ బోర్డు ఆమోదం పొందిన మినిట్స్‌ను ఇంప్లిమెంట్ చెయ్యాలని నేను కోరుతున్నాను.

అదే విధంగా సింగరేణి బొగ్గు విషయంలో క్వాలిటీ విషయంలో కూడా చర్యలు తీసుకోవలసిన అవసరం ఉంది. గ్లోబల్ వాషరీ అని ఒక ప్రైవేట్ సంస్థ బొగ్గుని శుద్ధి చేసే పనులను గోదావరిఖని, సింగరేణి ప్రాంతాలలో ఎప్పటినుండో చేస్తున్నది. మధ్యలో ఒక నాలుగు సంవత్సరాలు వారికి అనుమతి రాలేదు. మళ్లీ ఇప్పుడు అదే కంపెనీకి ఆ పనులు అప్పగించారు. ఈ విధంగా ఒకే కంపెనీకి ఇచ్చే బదులు, వేరే వాటికి కూడా అవకాశం కల్పించవలసిన అవసరం ఉంది. ఎందుకంటే సింగరేణి ఇంత బ్రహ్మాండంగా నడుస్తున్నప్పటికీ, మరోపక్క మచ్చతెచ్చే పనులు కూడా జరుగుతున్నాయి. మా సత్తుపల్లి ప్రాంతంలో డి- గ్రేడ్ కోల్‌ని ఎఫ్- గ్రేడ్ కోల్‌గా చూపించి, సింగరేణి రూ.20 కోట్ల నష్టం వచ్చే విధంగా చేశారు. విజిలెన్సు ఎంక్వైరీ జరిగింది. అందుకు బాధ్యుడైన పి.ఓ.కి కేవలం ఇంక్రిమెంట్ల కోతతో సరిపెట్టి, ఆయన్ను ఉద్యోగంలో కొనసాగిస్తున్నారు. దీనిపైన సమగ్ర దర్యాప్తు జరిపించవలసిన అవసరం ఉంది. ఈ విధంగా గ్రేడ్లను మార్చి, బొగ్గుని పక్కదారి పట్టించారు.

అదే విధంగా మేడిపల్లి ఓపెన్ కాస్ట్ మైనింగ్ ఏరియాలో కూడా కాంట్రాక్టర్ తక్కువ పని చేసి, ఎక్కువ పని చేసినట్లు చూపించి, దొంగ బిల్లులు పెట్టి, రూ.21 కోట్ల స్కాం జరిగింది. విజిలెన్సు ఎంక్వైరీ కూడా జరిగింది. కాని చర్యలు మాత్రం తీసుకోలేదు. ఆ కంపెనీని బ్లాక్ లిస్టులో పెట్టవలసిందిపోయి, వారికి ఇంకా పనులు

అప్పగిస్తున్నారు. అలాగే పద్మావతి గని,పివికె మైనింగ్‌కి సంబంధించిన పనులను ఒకే ఒక్క కలకత్తా బేస్డ్ కంపెనీకి పనులు అప్పగించారు. జాయ్ మైనింగ్ కంపెనీపై అనేక ఆరోపణలు ఉన్నాయి. వాటి విచారణ గురించి మంత్రిగారు తమ సమాధానంలో చెబుతారని ఆశిస్తున్నాను. మోడరన్ టెక్నాలజీతో నడుస్తున్న సింగరేణి సంస్థ, ఆరోపణలు ఉన్న ఒకే ఒక్క సంస్థకు కాంట్రాక్టులు ఇవ్వడం కరెక్టు కాదని మనవి చేస్తున్నాను.

అదే విధంగా సింగరేణిలో క్లరికల్ పోస్టుల నియామకంలో అనేక అవకతవకలు జరిగినాయి. పరీక్ష పేపరు ముందే లీక్ చేసి, ఒకే ఇంట్లో అనేక మందికి ఉద్యోగాలు వచ్చేలా చేశారు. ఆ విషయమై ఏసిబి విచారణ కూడా జరుగుతున్నది. ఆ రిపోర్ట్ పై తీసుకున్న చర్యల గురించి తెలుపవలసిందిగా ప్రభుత్వాన్ని కోరుతున్నాను. మణుగూరులో ఒక bund నిర్మాణం కోసం టెండర్ పిలిచారు. అక్కడ piling అనేది వాస్తవానికి అవసరం లేదు. గోదావరి నీళ్లకుఅడ్డంగా ఆనకట్ట కట్టే పనిని పైలింగ్ వర్క్ అంటారు. పోచంపాడు కన్‌స్ట్రక్షన్ కంపెనీకి ఆ పనిని అప్పగించారు. సింగరేణి పై అనవసర ఆర్థిక భారం మోపే పని ఇది. ఈ విషయం గురించి కూడా సమగ్ర దర్యాప్తు జరిపించవలసిన అవసరం ఉంది.

మరోముఖ్య విషయం ఏమిటంటే, ఈ రోజు సింగరేణికి ఇతర సంస్థల నుండి రావలసిన బకాయిలు దాదాపు రూ.5,000 కోట్ల వరకు ఉన్నాయి. నాకు తెలిసిన సమాచారం మేరకు ఏపి జెన్‌కో నుండి రూ.2,000 కోట్లు రావాలి. అదే విధంగా కర్నాటక, మహారాష్ట్ర నుండి కూడా సింగరేణికి డబ్బు రావాలి. ఎన్‌టిపిసి నుండి కూడా బకాయిలు రావలసి ఉంది. ఎమర్జెన్సీ కొరకు వాడవలసిన ఫిక్సెడ్ డిపాజిట్లను 60 శాతం ఉపయోగిస్తున్నారు. లాభాల బాటలో ఉన్న సింగరేణికి ఈ పరిస్థితి ఎందుకు వచ్చిందో గౌరవ మంత్రిగారు తెలియజేస్తారని ఆశిస్తున్నాను.బకాయిలు వసూలు చేయవలసిన అవసరం ఉంది. తెలంగాణ జెన్‌కో దాదాపు రూ.2575 కోట్లు సింగరేణికి చెల్లించవలసి ఉంది. ఏపి జెన్‌కో రూ.1775 కోట్లు, ఎన్‌టిపిసి రూ.77 కోట్లు, మహారాష్ట్ర జెన్‌కో రూ.52 కోట్లు, కర్నాటక పవర్ కార్పొరేషన్ రూ.831 కోట్లు, దరిదాపు రూ.5319 కోట్ల వరకు సింగరేణికి రావలసి ఉంది. కాబట్టి ఇంత పెద్ద ఎత్తున విస్తరిస్తూ, వారసత్వ ఉద్యోగాలు ఇస్తూ, అనేక రకాలుగా ముందుకు పోవలసిన సందర్భంలో, ఓపెన్ కాస్ట్ మైన్స్, భూగర్భ మైన్స్, అనేక రకాలుగా అభివృద్ధి చేస్తున్న సమయంలో ఆర్థిక వనరుల విషయంలో కూడా జాగ్రత్తలు తీసుకోవలసిన అవసరం ఉంది. అదే విధంగా సింగరేణి ఆడిట్ విషయంలో కూడా అనేక రకాలుగా అనుమానాలు ఉన్నాయి. Corporate Social Responsibility Committee లేదు. ఆడిట్ కమిటీ సమగ్రంతంగా లేదు. ఇండిపెండెంట్ డైరెక్టర్‌తో కమిటీ వేయలేదు. విజిలెన్సు మెకానిజం కూడా సక్రమంగా లేదని మనవి చేస్తున్నాను.

Adequate representation by independent Directors, according to the Act ఉండాలి. అటువంటి కమిటీ 'eyes and ears' of the publicగా మనం భావించాలి. కాబట్టి కంపెనీల చట్టం ప్రకారం తప్పనిసరిగా ఆడిట్ కమిటీకి చైర్మన్‌గా ఇండిపెండెంట్ డైరెక్టరే ఉండాలి. కాని ఇక్కడ అలాంటి ప్రయత్నమేమీ జరగలేదు. కాబట్టి తక్షణం దానిని సరిచేయవలసిన అవసరం ఉందని మనవి చేస్తున్నాను. As per Section 177 of the Companies Act, 2013, the Chairman of the Audit Committee must be an independent Director. కాబట్టి దీనిని పరిగణనలోకి తీసుకుని చర్యలు తీసుకోవాలి. ఎందుకంటే ఫైనాన్షియల్ మేనేజ్‌మెంటుగాని, అవకతవకలు గాని, నియామకాలు గాని, ఖర్చులు గాని, ఇతర చెల్లింపులు గాని ఆడిట్ జరిగితే, జవాబుదారితనం ఉంటుంది. Singareni Collieries Overseas Financial Management Reporting, appointments, re-appointments of Statutory Auditors, fixation of Audit fees దగ్గర నుండి అనేక అంశాలు ఉన్నాయి. Investigating Authority terms of reference పరిధిలో ఈ ఆడిట్ కమిటీ ఉంటుంది. కాబట్టి దీనిని ఒక బుల్లెట్ ప్రూఫ్‌గా ఏర్పాటు చేయాలి. అప్పుడే సరైన న్యాయం జరుగుతుంది. కేంద్ర ప్రభుత్వం నుండి ముగ్గురు డైరెక్టర్లు ఉన్నారు. రాష్ట్రప్రభుత్వం నుండి అరవింద కుమార్‌గారు, రామకృష్ణారావుగారు ఉన్నారు. కేంద్ర ప్రభుత్వం నుండి డి.ఎన్. ప్రసాద్, సయ్యద్ అష్రాఫ్ ఆర్.ఆర్. మిశ్రాగారున్నారు. కాబట్టి ఇండిపెండెంట్ డైరెక్టర్లను నియమించకపోవడానికి కారణాలు ఏమిటి, ఆడిట్ కమిటీ ఎందుకు లేదు అనేది మీ ద్వారా సభ దృష్టికి తీసుకువస్తున్నాను.

అదే విధంగా సింగరేణి సంస్థ ద్వారా విద్యుత్తు కూడా రావడం సంతోషకరం. 1200 మెగావాట్లు. కాని యూనిట్ ధర యాజమాన్యం రూ.4.10 నిర్ణయిస్తే, ఇఆర్‌సి రూ.3.26కి తాత్కాలికంగా నిర్ణయించింది. ఒకవైపు ఫిక్సడ్ డిపాజిట్లు ఖర్చుపెట్టుకునే పరిస్థితికి వచ్చి, బకాయిలు ఉండే పరిస్థితికి వచ్చి, సంస్థను పెద్ద ఎత్తున విస్తరిస్తున్నప్పుడు, రావలసిన బకాయిలు ఉన్నప్పుడు, ప్రస్తుత విద్యుత్తు ధర విషయంలో ఈ వేరియేషన్ దేనికో నాకు అర్థం కావడం లేదు. ఇది ఎలా వయబులో మంత్రిగారు వివరిస్తారని ఆశిస్తున్నాను.

ఓపెన్‌కాస్ట్ బ్లాస్టింగ్ వలన మణుగూరులోని భగత్‌సింగ్ నగర్, గాంధీనగర్ కాలనీ, కాళీమత్ ఏరియాలు నేను స్వయంగా తిరిగి చూశాను. అక్కడ ఇళ్లకు పగుళ్లు వచ్చాయి. Blasting in mining areas causing cracks in houses, leading to health hazards. ప్రభుత్వం ఇచ్చిన నోట్‌లో పర్యావరణ పరిరక్షణను పరిగణనలోకి తీసుకుంటున్నామని చెప్పారు. భూగర్భ గనులు తక్కువగా ఉన్నాయని మీరు సమర్థించుకున్నప్పటికీ, గౌరవ ముఖ్యమంత్రిగారు కూడా ఎన్నికల సమయంలో చెప్పారు. ఈ ప్రాంతం అంతా విచ్చలవిడిగా తవ్వకాలు జరిపి, బొందలగడ్డలా తయారు చేసారని చెప్పారు. నేను ఓపెన్ కాస్ట్‌ను పూర్తిగా వ్యతిరేకించడం లేదుగాని, మీరు తీసుకుంటున్న నష్ట నివారణ చర్యలను మరింత పెంచవలసిన అవసరం ఉందని చెబుతున్నాను. ప్రజల ప్రాణాలతో ఆడుకోవద్దు, వారిని ఇబ్బందులకు గురి చేయవద్దు, dust control mechanism గురించి ఆలోచించవలసిన అవసరం ఉందని మనవి చేస్తున్నాను.

తక్కువ ఖర్చుతో బొగ్గు ఉత్పత్తి లక్ష్యంగా, భారతదేశంలో ఎక్కడా లేని విధంగా మన దగ్గర జరుగుతున్నది. కోల్ ఇండియాతో పాటు, పది కంపెనీలు మన దగ్గరకు వచ్చి, పరిశీలించి వెళుతున్నారు. నార్మల్‌గా 300 మీటర్ల వరకు వెళ్లి, బొగ్గును తీస్తున్నారు. కాని ఈ ARP Mechanismతో 640 మీటర్ల వరకు వెళ్లి, బొగ్గును తీస్తున్నారు. Adriyala longwall project రూ. 1,219 కోట్ల ఖర్చుతో ఈ టెక్నాలజీ ద్వారా సింగరేణి గత రెండు సంవత్సరాలుగా బొగ్గు ఉత్పత్తి చేస్తున్నారు. ఇంత బాగా చేస్తూనే, ఇంత మెకానిజం ఉన్నప్పుడు, ఓపెన్‌కాస్ట్‌ను అలా కొనసాగించుకుంటూనే, సైన్స్ అండ్ టెక్నాలజీ డెవలప్ అయిన ఈ తరుణంలో కార్మికుల ఆరోగ్యరీత్యా భూగర్భ మైనింగ్ కొనసాగిస్తామని చెప్పినప్పటికీ, వాతావరణ కాలుష్యాన్ని దృష్టిలో పెట్టుకోవలసి ఉంది.

ఇకపోతే సింగరేణికి చెందిన ఆస్తులు వివిధ ప్రాంతాలలో ఉన్నాయి. విజయవాడ, విశాఖపట్నంలో ఉన్నాయి. వాటి పరిస్థితి ఏమిటో చెప్పవలసి ఉంది. సింగరేణి ఆస్తులను తిరిగి తీసుకురావలసిన అవసరం ఉంది. కాబట్టి ఒకవైపు లాభాల బాట అని చెబుతూనే, ఇబ్బందులు కూడా ఉన్నాయి. ఇల్లు బాగున్నప్పుడు, ఎలుకలు దూరకుండా చూసుకోవలసిన అవసరం ఉంది. అనేక రకాలుగా అవినీతి కార్యక్రమాలు జరగకుండా చూసుకోండి. మాచ్‌ఫిక్సింగ్, విజిలెన్సు వ్యవహారం చూసుకోవలసి ఉంది. ప్రతి టెండరును కూడా విజిలెన్సు అండ్ ఎన్‌ఫోర్స్‌మెంటుకి లింకు చేసి, ఆ టెండర్ నార్మ్స్ సరిగా ఉన్నాయా, కాంట్రాక్టర్ హిస్టరీ కూడా చూసి, నిర్ణయిస్తే, న్యాయం జరుగుతుందని చెబుతూ, సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ ఎన్. రామచంద్రరావు: (పట్టభద్రుల నియోజకవర్గం – మహబూబ్‌నగర్, రంగారెడ్డి మరియు హైదరాబాద్) అధ్యక్షా, సింగరేణి అనే అంశంపై మాట్లాడేందుకు అవకాశం కల్పించినందుకు మొదటగా మీకు నా ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను. సింగరేణి అంటే తెలంగాణ ప్రాంతానికి వెలలేని ఆభరణం లాంటిది. వేలాది మంది కార్మికులు, వారి కుటుంబాలు ఈ సంస్థపై ఆధారపడి ఉన్నాయి. గతంలో లక్షకు పైగా ఉండే సింగరేణి కార్మికులు నేడు దాదాపు అర్వైవేల వరకు ఉన్నారు. సింగరేణి సంస్థను మనం మూడు భాగాలుగా చూడవలసిన అవసరం ఉంది.

1. సింగరేణి సంస్థ సాధించిన ఆర్థిక లాభాలు.

2. అక్కడ పనిచేస్తున్న కార్మికుల యొక్క సంక్షేమం.

3. ఓపెన్ కాస్ట్ వలన జరుగుతున్న పర్యావరణ నష్టాలు.

వీటన్నింటి గురించి కూడా ఈ రోజు ప్రభుత్వం ఆలోచించవలసిన అవసరం ఎంతైనా ఉంది. తెలంగాణ ఉద్యమ సమయంలో ఈ నాటి మన ముఖ్యమంత్రి "దుబాయి, ముంబాయి బొగ్గుబాయి" అనే ఆలోచనతో సింగరేణి కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని, ఆ ప్రాంత ప్రజల కష్టాలను దృష్టిలో పెట్టుకుని మాట్లాడడం జరిగింది. ఈ రోజు తెలంగాణ ఏర్పడిన తరువాత, సింగరేణి సంస్థకు లాభాలు వచ్చిన మాట వాస్తవమే. ఇక్కడ మోడర్నైజ్‌డ్ టెక్నాలజీతో మైనింగ్ జరుగుతున్నది. భూగర్భంలోకి మనుషులు వెళ్లకుండానే, యంత్రాల ద్వారా మైనింగ్ జరిపే విధానం ప్రవేశపెట్టారు. ఈ విధానం మంచిదే. ప్రాణ నష్టం తగ్గించడానికి అవకాశాలు ఉంటాయి.

దాదాపు పద్దెనిమిది సంవత్సరాల క్రితం వారసత్వ నియామకాలను రద్దుచేయడం జరిగింది. ఈ ప్రభుత్వం ఎన్నికల మ్యానిఫెస్టోలో పెట్టి, ఆ విధంగా వారసత్వ నియామకాలను జరిపేందుకు వీలు కల్పించడం జరిగింది. అయితే ఈ విషయంలో శ్రీ పొంగులేటి సుధాకర్ రెడ్డిగారు ఇందాక చెప్పినట్లు, ఏడాది సర్వీసు కలిగి ఉన్నవారి దరఖాస్తులను కూడా పరిగణనలోకి తీసుకుంటే బాగుంటుంది. రెండవది డిపెండెంట్‌కి ఉద్యోగం ఇచ్చేటప్పుడు కొన్ని గైడ్‌లైన్స్ పెట్టారు. వాటిని కొంచెం సడలించినట్లయితే ఎక్కువ మందికి ప్రయోజనం కలిగే అవకాశం ఉంది. ఎందుకంటే కార్మికుల కృషి, శ్రమ వల్లనే సంస్థకు వేలాది కోట్ల రూపాయల లాభం చేకూరింది కాబట్టి, ఆ కార్మికుల సంక్షేమం కూడా చూడవలసిన బాధ్యత ప్రభుత్వం పైన ఉంటుందని మనవి చేస్తున్నాను. సంస్థలో పనిచేస్తున్న కార్మికులు అనేకమంది చనిపోతుంటారు. గనుల్లో పని చేయడం వలన వారి ఆరోగ్యాలు కూడా చెడిపోతుంటాయి. కాబట్టి వారియొక్క

డిపెండెంట్లకు కూడా ఉద్యోగాలు ఇవ్వవలసిన అవసరం ఉంది. దాదాపు 1,200 మంది ఈ కేటగిరిలో ఉంటారని అంచనా వేయడమైనది. They are still waiting to get employment. గనుల్లో పనిచేస్తూ చనిపోయినవారు కావచ్చు, ఆరోగ్యరీత్యా విధులు నిర్వర్తించలేనివారు కావచ్చు. కనీసం నెలకు వంద మందికి ఉద్యోగాలు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవలసి ఉంది.

సత్తుపల్లిలో సింగరేణి ఓపెన్ కాస్ట్ ఉంది. మా అత్తగారి ఊరు అదే కాబట్టి, నాకు ఆ ప్రాంతం గురించి తెలుసు. అంతకుముందు అక్కడ ఓపెన్ కాస్ట్ మైన్లు ఉండేవి కావు. ఈ మధ్య కాలంలో నేను వెళ్లినప్పుడు చూస్తే మంచి,మంచి పొలాలను తవ్వుతున్నారు. ఆ విధంగా తవ్వకాలు జరిపే ప్రదేశంలొ దుమ్ము, ధూళి పేరుకుని అక్కడ ఉండే పంటలకు కూడా నష్టం వాటిల్లే విధంగా వాతావరణం తయారైంది. భూగర్భ జలాలు మారిపోయాయి. దగ్గరలో ఉండే చెరువులు కూడా కలుషితమైనాయి. కొన్ని ఎండిపోవడం కూడా జరిగింది. లాభాలు వచ్చినప్పటికీ, ఓపెన్ కాస్ట్ వలన ఈ విధంగా పర్యావరణానికి దెబ్బ, పంటలకు కూడా నష్టమే. కాబట్టి ప్రభుత్వం ఈ విషయంలో కొంత ఆలోచన చెయ్యాలి. నేను ఓపెన్ కాస్ట్‌ను వ్యతిరేకించడం లేదు. కాని దానికి తగిన ప్రత్యామ్నాయం కూడా వెదకాలి. పర్యావరణాన్ని రక్షించవలసిన అవసరం ఉంది. తెలంగాణ రాష్ట్రసాధనలో సింగరేణి కార్మికుల యొక్క పాత్ర మనం మరిచిపోలేం. కాబట్టి అక్కడ పనిచేస్తున్న అరవై వేల మంది కార్మికుల యొక్క శ్రేయస్సు, భవిష్యత్తు గురించి కూడా మనం ఆలోచించవలసిన అవసరం ఉందని మనవి చేస్తున్నాను.

**12.20 ని.** రిటైర్ అయిన ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యుల ఆరోగ్య విషయాలు, కార్మికుల వసతి/ఇళ్లు, వాళ్లకు హెల్త్ కార్డుల విషయం, అనేక రోగాలకు గురైన కార్మికులకు సంబంధించి రాబోయే రోజుల్లో ఏమి చేయవలసి ఉంటుందో ప్రభుత్వం ఆలోచించవలసిన అవసరం ఉంది.

భారతదేశంలోనే సింగరేణి కాలరీస్ బొగ్గు ఉత్పత్తిలో ఎంతో ప్రతిష్టాత్మకమైన సంస్థ అని చెప్పొచ్చు. నేడు మనం హైడల్ కంటే థర్మల్ పవర్ మీద ఎక్కువగా ఆధారపడుతున్నాం. మన రాష్ట్రంలో, దేశంలో థర్మల్‌పవర్ మీద ఎక్కువ ఆధారపడుతున్నారు కాబట్టి బొగ్గు ఉత్పత్తిని పెంచి, థర్మల్ పవర్ స్టేషన్స్‌లో విద్యుత్ ఉత్పత్తి హెచ్చు స్థాయిలో చేస్తేనే మనకి తెలంగాణ భవిష్యత్తు కనబడుతుంది. సింగరేణి కార్మికుల సంక్షేమం ఒకవైపు, ఇంతకు ముందు చెప్పినట్లుగా మోడ్రన్ మెకానిజం అడాప్ట్ చేసుకోవడం, ఓపెన్ కాస్ట్ మైనింగు జరుగుతున్న చోట్ల పర్యావరణ పరిరక్షణను ప్రభుత్వం దృష్టిలో పెట్టుకొని ఈ సింగరేణి కాలరీస్‌ని ఇంకా అభివృద్ధి పథంలో తీసుకొని పోవాలి. గోదావరి ప్రవహిస్తున్న ఏడు జిల్లాలు కూడా ఫారెస్టుకి సంబంధించిన ప్రాంతాలు కాబట్టి ఈ ఫారెస్టు డిస్టర్బ్ గాకుండా ప్రభుత్వం దీని మీద ఆలోచించి, అన్ని విషయాలను దృష్టిలో పెట్టుకుంటారని ఆశిస్తూ నా తరఫున సూచనలిస్తూ, నాకు ఈ అవకాశ ఇచ్చిన మీకు ధన్యవాదాలు తెలియజేస్తున్నాను.

శ్రీ పురాణం సతీష్‌కుమార్ : అధ్యక్షా, ఆనాటి ఉపాధ్యాయ ఉద్యోగగెజిటెడ్ కార్మిక సంఘాల సకల జనుల సమ్మెలో తమరు కూడా పాల్గొని ఉద్యమానికి నాయకత్వం వహించిన సందర్భంలో, ఆరోజు సింగరేణి కార్మికులు చూపించిన పోరాట పటిమ అపూర్వం. రాష్ట్రం వచ్చిన తరువాత ఈ తెలంగాణ రాష్ట్రంలో గతంలో మోసపోయినటువంటి, దగాపడినటువంటి సింగరేణి కార్మికులను ఆదుకోవాలనేది తెలంగాణ రాష్ట్ర ఉద్దేశం. 1998సంవత్సరంలో ఆ రోజు గుర్తింపు సంఘంగా ఏఐటియుసి ఉండేది. అప్పట్లో చంద్రబాబు నాయుడు నాయకత్వంలో తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలో ఉంది. తెలుగుదేశం ప్రభుత్వం వారసత్వ ఉద్యోగాలను రద్దు చేసింది. ఆ రోజు ఏఐటియుసి వాళ్లు మేము కార్మికులకోసం, కార్మికుల సంక్షేమం కోసం, వాళ్ల హక్కుల కోసం పోరాటం చేసే వాళ్లమని చెప్పి, ఆరోజున అధికారంలో ఉన్న తెలుగుదేశం పార్టీకి తొత్తులుగా మారి కార్మికులకు నష్టం వాటిల్లే విధంగా, కార్మికుల రక్తాన్ని పీల్చే విధంగా, ఆ రక్త వర్ణపు ఏఐటియుసి వాళ్లు తెలుగుదేశం పార్టీతో మిలాఖత్ అయిపోయి వారసత్వ ఉద్యోగాలను రద్దు చేయడం జరిగింది.

అధ్యక్షా, చంద్రబాబు నాయుడు కూడా ఆరోజు ఈ సింగరేణి కార్మికుల పట్ల ఏమాత్రం చిత్తశుద్ధి లేకుండా ప్రవర్తించారు. దానికి ఒకే ఒక్క ఉదాహరణేంటంటే, ఆయన ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు తలపెట్టిన విజన్ 2020లో ఈ సింగరేణి సంస్థ లేదు. సింగరేణి సంస్థను విజన్ 2020లో మాయం చేసింది ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు. కార్మికుల అదృష్టమో లేక ఆ పార్టీ దురదృష్టమో కానీ సింగరేణి సంస్థ ఈ తెలంగాణ రాష్ట్రంలో యధాతథంగా ఉంది. అలా మాయ చేసినటువంటి తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు చంద్రబాబునాయుడే రాష్ట్రరాజకీయాల నుంచి మాయమయ్యాడని ఈ సందర్భంగా మనవి చేస్తున్నాను.

(డిప్యూటీ ఛైర్మన్ శ్రీ నేతి విద్యాసాగర్ అధ్యక్షస్థానంలో ఉన్నారు)

ఉద్యమ పార్టీ అయిన తెలంగాణ రాష్ట్రసమితి అధికారంలోకి వచ్చినట్లయితే, ఖచ్చితంగా గత పాలకులు పోగొట్టినటువంటి ఈ వారసత్వ ఉద్యోగాలను పునరుద్ధరింప చేస్తామని ఎన్నికల హామీలో భాగంగా ముఖ్యమంత్రి కె.సి.ఆర్ గారు పేర్కొన్నారు. అధ్యక్షా, ఇవాళ

కార్మికుల కుటుంబాలలో, కార్మికుల ఇళ్లల్లో కె.సి.ఆర్ గారిని ఒకదేవుడి లాగా పూజిస్తున్నారని కోల్ బెల్టు ఎమ్మెల్సీగా నేను చెబుతున్నాను. ఈ రద్దు చేసిన ఉద్యోగాలను పునరుద్ధరించడం వల్ల 54వేల మంది కార్మికులకు న్యాయం జరుగుతుంది. ఇంతేగాక, తెలంగాణ రాష్ట్ర సమితి అధికారంలోకి వచ్చిన కొత్తలో కార్మికుల యొక్క బాధలను పట్టించుకుని, అప్పటి వరకు పెండింగ్‌లో ఉన్నటువంటి అన్‌ఫిట్ కావచ్చు, డెత్ కేసెస్ కావచ్చు వారందరినీ ఉద్యోగంలోకి తీసుకున్నారు. గతంలో అధికారంలో ఉన్న ప్రభుత్వ హయాంలో నెలకు 25మందిని మాత్రమే ఉద్యోగంలోకి తీసుకున్న పరిస్థితులు ఉన్నాయి. నెలకు25 మంది అంటే, సంవత్సరానికి 300 మంది చొప్పున, ఈ 3,200 మందికి ఉద్యోగాలు రావాలంటే సుమారు పది సంవత్సరాలు పడుతుంది. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఒన్‌టైమ్ సెటిల్‌మెంట్ పేరుతో ఒకేసారి 3,200 మందికి ఉద్యోగాలు ఇచ్చిన ఘనత మన టి.ఆర్.ఎస్ ప్రభుత్వానిదేనని ఈ సందర్భంగా మనవి చేస్తున్నాను. అంతేగాకుండా, సింగరేణి కార్మికులు రక్తాన్ని చెమటగా మార్చి బొగ్గు ఉత్పత్తిలో లాభాన్ని తీసుకువస్తే, గత ప్రభుత్వాలు లాభాలలో బోనస్‌కోసం ధర్నాలు చేస్తే, నిరసనలు తెలిపితే, సమ్మెలు చేస్తే తప్ప ఇచ్చిన సందర్భాలు లేవు. గతంలో కిరణ్‌కుమార్ రెడ్డి గారు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు, తెలంగాణ బొగ్గు కార్మిక సంఘం గుర్తింపు సంఘంగా ఉన్న సమయంలో, ఇక్కడ కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు లాభాలలో 18 శాతం బోనస్ వాటా కావాలని చెన్నూరు ఎమ్మెల్యే గౌరవనీయులు నల్లాల ఓదేలుగారు ఆమరణ నిరాహార దీక్ష చేస్తే గానీ లాభాలలో బోనస్ వాటా ఇవ్వలేదు. మన ప్రభుత్వం వచ్చిన తరువాత ఎవరూ నిరసనలు చేయకుండానే, అడగకుండానే వాస్తవపరిస్థితులను గుమనించి ఆ కార్మికుల సంక్షేమం కోసం లాభాలలో 23 శాతం బోనస్ వాటా కింద ఇచ్చిన ఘనత కె.సి.ఆర్ గారిదని మనవి చేస్తున్నాను. ఒక్కొక్క కార్మికునికి పదివేల నుంచి లక్షరూపాయల వరకు బోనస్ వచ్చిన రోజులు ఉన్నాయి. ఈవిధంగా కార్మికుల సంక్షేమంకోసం దేశ చరిత్రలో ఎక్కడా లేనివిధంగా మొట్టమొదటిసారిగా కోల్‌ఫీల్డ్‌లో కార్మికులకు సమ్మెకాలం జీతం, బోనస్, ఇంక్రిమెంట్లు ఇచ్చిన ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రసమితి.

అధ్యక్షా, నా ప్రసంగాన్ని ముగించే ముందు కాంగ్రెస్ పార్టీ పేరును ఖచ్చితంగా తీసుకోవలసి వస్తోంది. తిర్యాణి మండలంలో మూడు సింగరేణి ఓపెన్ కాస్ట్ మైనింగ్ బ్లాకుల కోసం ప్రపోజ్ చేస్తూ ఆ వర్క్ మొదలుపెట్టినపుడు – ఆ మండలంలో భూములు పోతున్నపుడు, ఇళ్లు పోతున్నపుడు, అక్కడ ఉన్న భూములన్నీ డస్ట్ పట్టి పంటలకు పనికి రాని భూములుగా మిగిలిపోయాయి, మండలమంతా విధ్వంసానికి గురవుతోందని తిర్యాణి వాసులు అడిగితే, ఆనాడు ముఖ్యమంత్రిగా ఉన్న కిరణ్ కుమార్ రెడ్డిగారు ఆ మండలాన్ని దత్తత తీసుకుంటామని 19-11-2011న ప్రకటించారు. తిర్యాణి డెవలప్‌మెంటు ప్రోగ్రాము క్రింద అక్కడ రిలీఫ్ అండ్ రీహాబిలిటేషన్ కార్యక్రమాలు చేపడతామని చెప్పారు. సియస్ఆర్ ఫండ్స్‌తో సంబంధం లేకుండా ఈ మండలాన్ని దత్తత తీసుకొని అక్కడ డెవలప్‌మెంటు యాక్టివిటీస్ కోసం రూ.31.39కోట్లు వెచ్చిస్తామని చెప్పి, ఆ ప్రాజెక్టు పనులు మొదలు పెట్టేందుకు ఆ ప్రజలను మోసం చేసే విధంగా సంవత్సరానికి రూ.7కోట్లు విడుదల చేస్తామని చెప్పి ఒక ఇన్‌స్టాల్‌మెంటులో కేవలం రూ.7కోట్లు మాత్రమే రిలీజ్ చేశారు. 2011-12, 2012-13, 2013-14 ... ఈ మూడు సంవత్సరాలు కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నా అక్కడ నిధులు వెచ్చించలేదు. కేవలం రూ.7కోట్లు మాత్రమే వెచ్చించి ఆ తిర్యాణి మండల ప్రజలను మోసం చేసింది కాంగ్రెస్ ప్రభుత్వం. ఆవిధంగా మోసపోయిన తిర్యాణి ప్రజలను ఆదుకోవలసిన అవసరం ఈరోజు ఎంతైనా ఉంది. కాంగ్రెస్ పార్టీ చేతిలో మోసపోయిన తిర్యాణి మండల ప్రజలను దృష్టిలో పెట్టుకొని సియస్ఆర్‌తో సంబంధం లేకుండా, ఆ మండల డెవలప్‌మెంటు కోసం ఉద్దేశించిన బ్యాలెన్స్ ఫండ్స్‌ని రిలీజ్ చేసి అక్కడ డెవలప్‌మెంట్ యాక్టివిటీస్ టేకప్ చేయాలని ప్రభుత్వానికి మనవి చేస్తున్నాను. వాళ్లు వేసిన శిలాఫలకాల ఫోటోలున్నాయి. కలెక్టర్లు ఎన్ని సార్లు లెటర్లు రాసినా కూడా దానికి స్పందన కరువైంది. ఆ విధంగా మోసపోయిన తిర్యాణి మండల వాసులను, కాంగ్రెస్ పార్టీ చేతుల్లో దగా పడిన ఆ ప్రజానీకాన్ని కాపాడుకునే విధంగా మన ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. ఆ బ్యాలెన్స్ నిధులను విడుదల చేసి ఆ మండల ప్రజలను కాపాడాలని కోరుతున్నాను. కార్మికుల సంక్షేమం కోసం, కార్మికుల కుటుంబ సంక్షేమం కోసం, కార్మికుల ఉద్యోగ భద్రత కోసం ఎల్లవేళలా కృషి చేస్తున్న ఈ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రిగారికి, సంబంధిత మంత్రివర్యులకు, అందరికీ కూడా కోల్ బెల్ట్ ఎమ్మెల్సీగా నేను ధన్యవాదాలు తెలియజేసుకుంటూ సెలవు తీసుకుంటున్నాను. జై తెలంగాణ, జై సింగరేణి.

SRI SYED ALTAF HYDER RAZVI: (Assembly Constituency) Thank you, Deputy Chairman Sir. Today, we are discussing about the Singareni Collieries Company Ltd, (SCCL) which Company was established on 23.12.1920. This has been an asset for the State for a very long time, since discovery of coal in 1871. After that, as the events unfold, after the establishment of this Company, in the year 1945 the Nizam of Hyderabad has acquired the Shares and started managing the Company.

Since 1960, the Government of India and the State Government under the partnership running this Company. It is a very detailed note which has given to us, wherein, it has covered all the parts and aspects including establishment and running operations called Singareni Collieries Company Ltd.

The main thing, as we all know, there is huge natural resources lying in Telangana. At present, it is said that some 46 mines are operating of which, 30 are Underground Mines (UG Mines) while 16 are Opencast Mines (OC Mines). This is the main area of resources of the wealth, which our State is having. As it is mentioned here, Sir, there are about 56866 employees working in Singareni Collieries Company Ltd. However, the cause of concern is UG mining, which still remains the main cause. Like, the figures are very evident that out of 56866 employees working in SCCL, 18% of employees are mining in OC Mines, which is giving a huge output of 600 lakhs tonnes of coal, which has already been produced in the year 2015-16.

Sir, this is the area, I mean it amounts to 83% of the entire mining which is being done in Opencast and the rest 106 lakh tonnes which amounts to 17% is being done through underground mining. These two types of mining operations, wherein, underground mining got lot of its own drawbacks as far as manpower is concerned, the safety aspects are concerned and more than anything, the cost of production is concerned.

It is also mentioned that the kind of losses which are being incurred by SCCL when we talk about UG mining. I feel that there should be provisions to make sure that if these mines can also can be with technology and with the help of latest development i.e. 'manless mining' if it can be done, because technology has advanced. There is less amount of manpower which is required these days. Even we have gone to Mars manless. This is the area, where the possibility can be explored and if there is any way where even these mines can be made opencast. This can bring huge profit, where SCCL already gave good results and after the Telangana State came into existence, it promised that it is giving profit sharing to employees, it has revived Voluntary Retirement scheme and there are certain other aspects also where the Government has come forward to help the employees to better their lives.

So all these things put together, I find that there are more than 30 mines which are underground and if they are converted into opencast mines or if less manpower can be used for underground mining, I think, that can be taken into consideration.

Apart from this, what the Government has been doing now, the SCCL entering into power generation sector also. That is also very encouraging and it should have been done long time back. The amount of our power requirement in our State is so huge with major irrigation projects which are in pipelines and it requires power. So, there is huge requirement of power generation in our State.

Apart from this, we are looking here that SCCL is a being such asset to the State, where power generation can be done directly by SCCL, we request the Government through you Sir that in GHMC or HMDA areas, such a big area and our IT Minister is also here and we all know that several industries are coming into Hyderabad and in the surrounding limits of GHMC and HMDA, our party had earlier proposed a dedicated a power plant for this particular catering to the foreign Companies, the Multi National Companies, our own Corporate Sector, which are huge. So, all these things put together, I think, a dedicated power plant should be given to HMDA or GHMC limits wherein, lot of IT sector and other manufacturing units are being encouraged in the State and this would give a big boost to this entire things.

Apart from the reforms which are being done for the employees, we appreciate the steps taken by the Telangana Government and we hope that SCCL would flourish further and become a bigger asset for the State of Telangana.

Like I said that underground mining is still the area of concern and focused work should

be done on this area so as to make it a safety area. Sir, I thank you for giving me an opportunity to speak on the subject.

శ్రీ పూల రవీందర్ః అధ్యక్షా, సింగరేణి సంస్థ మీద షార్ట్ డిస్కషన్‌లొ మాట్లాడడానికి అవకాశం కల్పించినందుకు ధన్యవాదాలు . ఇది దేశంలోనే ఒక ప్రతిష్టాత్మకమైన సంస్థ. నల్ల బంగారంగా పిలవబడే ఈ సంస్థ మన తెలంగాణ రాష్ట్రంలో ఉండడం అదృష్టంగా భావిస్తున్నాం. ఇది సుమారు మరొక వంద సంవత్సరాలకు సరిపడ నిల్వలున్న ఒకగొప్ప సంస్థ. 10528 మిలియన్ టన్నుల ఉత్పత్తిని మనకు అందించే విధంగా గొప్ప నిల్వలున్న సంస్థ. ఇలాంటి నిల్వలు కలిగిన ఈ సంస్థలో సుమారు 55వేల మంది కార్మికులు పని చేస్తున్నారు. తెలంగాణ రాష్ట్ర ఉద్యమ కాలంలో అసలు దేశ వ్యాప్తంగా బొగ్గు ఉత్పత్తిని సమ్మె చేసి ఆపిన ఘనత కేవలం ఈ సింగరేణి సంస్థకి మాత్రమే దక్కింది.

12.40 ని. ఆరోజు భారతదేశంలోనే కాకుండా అంతర్జాతీయ స్థాయిలో అసలు ఎందుకు ఈవిధంగా సుమారు ఆరు మెట్రిక్ లక్షల టన్నుల ఉత్పత్తి అయ్యేటువంటి బొగ్గు నిల్వలు ఎందుకు ఆగిపోయాయి, దీనికి కారణం ఏమిటని దేశ ప్రజలు, అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులను, దేశ ప్రధానిని అందరినీ ఆశ్చర్యచకితులను చేసే విధంగా ఆనాడు నడుం బిగించి ఉద్యమం చేసిన కార్మికులు ఈ నల్ల బంగారం గనుల్లో పని చేసినటువంటి కార్మికులు. నిజంగా కూడా వారి జీవనోపాధిని కూడా పక్కకు పెట్టి తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం కొరకు ఆనాడు కష్టపడి ఉద్యమం చేసిన దాంట్లో తలమానికంగా సింగరేణి కార్మికులు ఉన్నారు.

ఇది సుమారు 1871లో Geological Survey of India ద్వారా ఇక్కడ బొగ్గు నిల్వలు ఉన్నాయనే విషయాన్ని గుర్తించడం జరిగింది. మొట్టమొదటిసారిగా ఖమ్మం జిల్లాలో 1889వ సంవత్సరం డిసెంబరులో సింగరేణి అనే ప్రాంతంలో బొగ్గు త్రవ్వకాలు ప్రారంభించడం జరిగింది. దీనితోనే సింగరేణి అని ఈ సంస్థకు పేరుపెట్టడం జరిగింది. 1920వ సంవత్సరంలో ఈ సంస్థను ఏర్పాటు చేసుకుని తద్వారా కార్మికుల నియామకం మరియు బొగ్గు ఉత్పత్తి కార్యక్రమం ప్రారంభించుకోవడం జరిగింది. ఆ తరువాత 1945వ సంవత్సరంలో ఈ సంస్థలో నిజాం నవాబు మేజర్ షేర్ తీసుకుని బొగ్గు ఉత్పత్తిలో ముందుకు వెళ్లడం జరిగింది. 1960వ సంవత్సరంలో కేంద్రరాష్ట్రప్రభుత్వాలు 49:51 నిష్పత్తిలో షేర్స్ ఏర్పాటు చేసుకుని బొగ్గు ఉత్పత్తిని చేస్తున్నారు.

దీనితో మనకు దక్షిణ భారతదేశంలోనే కరెంటు విషయంలో, పరిశ్రమలకు బొగ్గును ఉత్పత్తి చేసే విషయంలో గానీ మన సింగరేణి సంస్థలు ప్రథమ స్థానంలో నిలబడ్డాయి. దక్షిణ భారతదేశంలో ఇటువంటి గొప్ప సంస్థలు మన రాష్ట్రంలో ఉండడం తెలంగాణా ప్రభుత్వానికి, ప్రజలకు గర్వకారణమని చెప్పవచ్చు. సుమారు 46 గనులలో 30 భూగర్భ గనులు, 16 ఓపెన్‌కాస్ట్‌లో పనిచేస్తున్నాయి. భూగర్భ గనులలో పనిచేస్తున్న కార్మికులు చాలా దయనీయమైన పరిస్థితిలో ఉన్నారు. వారు ప్రతిక్షణం ప్రాణాలతో పోరాటం చేస్తూ పని చేస్తుంటారు. అలా కష్టపడి పనిచేస్తున్నవారి యొక్క జీవితాలలో గతంలో ఏ మాత్రం మార్పు లేకుండేది. ఉదాహరణకు 2009వ సంవత్సరం నుండి 2014వ సంవత్సరం వరకూ మనం తీసుకుంటే వారికి ఏ విధమైన బెనిఫిట్స్ ఉన్నాయి, ఆ తరువాత ఏ విధంగా ఉన్నాయనేది గమనిస్తే మనకు తెలుస్తుంది. తెలంగాణరాష్ట్రం ఏర్పడిన తరువాత గౌరవ ముఖ్యమంత్రిగారు సింగరేణి కార్మికులను చాలా గొప్పగా చూసుకోవాలి, ఉద్యమంలో కష్టపడి పనిచేశారు, ప్రతినిత్యం ప్రమాదాల అంచుకు వెళ్లి తిరిగి వస్తున్నారు అనే ఉద్దేశంతో గత ప్రభుత్వాలు చేయలేని పనులు చేశారు.

గత ప్రభుత్వాలు ఉన్నప్పుడు సింగరేణి కార్మికులకు ఇచ్చిన బెనిఫిట్స్‌ను ఆ తరువాత తెలంగాణా ప్రభుత్వం వచ్చిన తరువాత ఇచ్చిన బెనిఫిట్స్‌ను పోల్చి చూస్తే మనకు అవగతమవుతుంది. భూగర్భ గనులలో చాలా ఎక్కువ ఖర్చుపెట్టి ఒకటన్ను బొగ్గును ఉత్పత్తి చేస్తాము. రూ.4,018/-లు ఖర్చు చేస్తే రూ.2,360/-అమ్మకం వస్తుంది. దీంతో రూ.1700/-లు నష్టం వస్తుంది. అయినప్పటికీ కార్మికుల సంక్షేమం కొరకు ఈరోజు మన రాష్ట్రప్రభుత్వ ముఖ్యమంత్రి ఆలోచన చేస్తున్నారు. ఓపెన్ కాస్ట్‌లో 82 శాతం బొగ్గు ఉత్పత్తి అవుతుంది. 17 నుండి 18 శాతం భూగర్భ గనుల ద్వారా వస్తుంది. అయినా, కొన్ని సంవత్సరాలుగా ఈ కుటుంబాలు దీనిని ఆధారంగా బ్రతుకుతున్నాయి, భూగర్భ గనులలో పనిచేసే కార్మికుల సంఖ్యను తగ్గిస్తే ఆయా కుటుంబాలకు నష్టం చేసినవారమవుతామని వారి మీద ప్రేమతో మన ప్రభుత్వం ముందుకు వెళుతోంది.

2009 నుండి 2014 మధ్య గల 5 సంవత్సరాల వృద్ధిరేటు 3 శాతం మాత్రమే ఉంటే, 2015-16 ఒక్క సంవత్సరంలోనే 15 శాతం వృద్ధి రేటును తీసుకురావడం జరిగింది. అంటే గత ప్రభుత్వాలకు సింగరేణి సంస్థలను ఏ విధంగా దోచుకున్నారో తెలుస్తున్నది. మన ముఖ్యమంత్రిగారు ఆ విధంగా సంస్థను ముందుకు తీసుకువెళుతున్నారు. ఇందులో 5 సంవత్సరాలకు సుమారు రూ.400కోట్లు లాభం ఉంటే, 2015-16 ఒక్క సంవత్సరంలో

రూ.1,066 కోట్లు లాభం వచ్చింది. ఒకేసారి ఇంత మార్పు ఏ విధంగా వస్తుంది అని అంటే ఈ ప్రభుత్వం ఈ సంస్థను అంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంది అని నేను మనవిచేస్తున్నాను. గతంలో ఏ ప్రభుత్వం కార్మికుల సంక్షేమ కొరకు ఆలోచించలేదు. సుమారు రూ.245 కోట్లు సింగరేణి కార్మికుల కొరకు లాభాలలో వాటా ఇవ్వాలని మన కార్మికులకు 23 శాతం వాటా ఇవ్వడం జరిగింది. ఇదొక భాగం.

అధ్యక్షా, అదే విధంగా దీపావళి సందర్భంగా రూ.303 కోట్లను బోనస్‌గా ప్రకటించి ఒక్కొక్క సభ్యునికి రూ.50,000లకు తగ్గకుండా బోనస్‌ను అందివ్వడమైనది. బోనస్ అయితేనేమి లాభాలలో 23 శాతం వాటా అయితేనేమి ఒక్కొక్క కార్మికునికి ఒక లక్ష రూపాయల నుండి లక్షా ఇరవై అయిదు వేల వరకూ అందించిన ఘనత మన రాష్ట్ర ప్రభుత్వానికి, మన ముఖ్యమంత్రిగారికి దక్కిందని మనవిచేస్తున్నాను.

(సభ్యుల హర్షధ్వానాలు)

గతంలో లేనిది ఇప్పుడెందుకు ఉన్నదంటే, ముఖ్యమంత్రిగారు స్వయంగా చూశారు, ఆనాడు ఉద్యమంలో ప్రాణాలకు తెగించి పోరాడారు. ప్రాణాలకు తెగించి భూగర్భ గనులలో పనిచేస్తున్నారని, వారి సంక్షేమం కొరకు గౌరవ ముఖ్యమంత్రిగారు ఆలోచించారు. అదే పద్ధతిలో మనం ఈ సంస్థ యొక్క పరిస్థితులు చూస్తే, డిపెండెంట్ ఉద్యోగాలు ఉన్నాయి. వాటిని 1998లో ఆనాటి ప్రభుత్వం రద్దు చేసింది. ఆ తరువాత డిపెండెంట్ ఉద్యోగాలు లేవు. కానీ, మన ప్రభుత్వం వచ్చిన తరువాత ఆ ఉద్యోగాలను ఇవ్వాలని ఒక ప్రతిష్టాత్మకమైన నిర్ణయం తీసుకున్నారు. దాదాపు రెండు దశాబ్దాల తరువాత గౌరవ ముఖ్యమంత్రిగారు కార్మికులను దృష్టిలో పెట్టుకుని డిపెండెంట్ ఉద్యోగాల నిమిత్తం ప్రకటన చేశారు. ఇప్పుడు వారందరూ దరఖాస్తులను చేసుకుంటున్నారు. యూనిఫాం విషయంలో అధికారి అయినా కార్మికుడైనా సమానమనే ఉద్దేశంతో యూనిఫాం ఏర్పాటు చేయడం జరిగింది.

ఆనాడున్నటువంటి పరిస్థితులలో ఎవరైనా ఉద్యోగం చేయలేని పరిస్థితులలో ఉంటే వారి వారసులకు ఉద్యోగం ఇస్తే, అప్పుడు ఏడాదికి 200 నుండి 250 మంది కంటే ఎక్కువ ఉద్యోగాలు ఇవ్వలేని పరిస్థితి ఉన్నది. కానీ, ఈ రోజు మన తెలంగాణా ప్రభుత్వం వచ్చిన తరువాత కెసిఆర్ గారు గొప్ప నిర్ణయం తీసుకుని అన్‌ఫిట్ అయినటువంటి 3,200 మంది వారసులకు ఉద్యోగం ఇప్పించడమైనది. అంటే, ఒక సంస్థ అభివృద్ధి కొరకు గత ప్రభుత్వాలు ఏ విధంగా ఆలోచించాయి, మన ప్రభుత్వం ఏ విధంగా ఆలోచిస్తున్నదనే దాని ఇదొక చిన్న ఉదాహరణ.

ఎక్స్‌గ్రేషియా అనేది రెండు రకాలుగా ఉంటుంది. ప్రమాదంలో మరణించినప్పుడు లేదా, వాస్తవంగా సహజ మరణం సంభవించినప్పుడు ఇస్తారు. వి.ఆర్.ఎస్ తీసుకున్నప్పుడు గతంలో రూ.5 లక్షలు ఇచ్చేవారు. ఒక ఉద్యోగి నేను ఉద్యోగం నుండి తప్పుకుంటాను అని అంటే దానికి డబ్బులు పే చెయ్యాలి. ఆవిధంగా వి.ఆర్.ఎస్ తీసుకున్నప్పుడు గత ప్రభుత్వాలు రూ.5 లక్షలు ఇస్తే, ఈనాడు మన ప్రభుత్వం రూ.12.50 లక్షలు ప్రకటించింది. అంటే సుమారు 250 రెట్లు అధికం. గతంలో ప్రమాదంలో పనిచేస్తూ మరణిస్తే రూ. 7 లక్షలు ఇచ్చేవారు, దానికి ఈనాడు మూడు రకాల ప్యాకేజీలను ఇవ్వడమవుతున్నది. సింగరేణి సంస్థ నుండి రూ. 10 లక్షలు, కార్మికుల సంక్షేమ సంస్థ నుండి మరో రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా రూ.5 లక్షలు చెల్లిస్తున్నది. గతంలో రూ.7 లక్షలు చెల్లిస్తే ఈనాడు రూ.25 లక్షలు చెల్లించిన ఘనత మన ముఖ్యమంత్రిగారికి, తెలంగాణా ప్రభుత్వానికి అని చెప్పడానికి ఎంతో సంతోషిస్తున్నాను.

అధ్యక్షా, ఈనాడు తెలంగాణా రాష్ట్రానికి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చిన సంస్థ సింగరేణి సంస్థ. కష్టపడి పనిచేస్తున్న కార్మికుల కష్టాన్ని గుర్తించిన మన ముఖ్యమంత్రి శ్రీ కె. చంద్రశేఖర రావు గారికి, అలాగే గౌరవ మంత్రిగారికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియచేస్తున్నాను. ధన్యవాదాలు.

శ్రీ సబావత్ రాములు నాయక్ : అధ్యక్షా, సింగరేణి కాలరీస్ పై మాట్లాడటానికి నాకు అవకాశమిచ్చినందుకు మీకు ధన్యవాదాలు తెలియచేస్తున్నాను. సింగరేణి కాలరీస్ కంపెనీ 1889వ సంవత్సరంలో బొగ్గు త్రవ్వకాలను ప్రారంభించింది. మనం జాగ్రత్తగా పరిశీలిస్తే సింగరేణి చరిత్ర చాలా ఉన్నది. 1871వ సంవత్సరంలో జియలాజికల్ సర్వే ఆఫ్ ఇండియాకు సంబంధించిన డా. ఉలేకింగ్ మొదటిసారి ఇల్లెందు ప్రాంతంలో భద్రాద్రి, కొత్తగూడెం జిల్లాలో బొగ్గును కనుగొనడం జరిగింది. ఎక్కడైతే ట్రైబల్స్ ఎక్కువ ఉంటారో అక్కడ ఖనిజ సంపద ఎక్కువగా ఉంటుందనేది చరిత్ర చెబుతున్నది. కానీ, 1886వ సంవత్సరంలో ఇంగ్లాండ్‌కు చెందిన దక్కన్ మైనింగ్ కంపెనీ లిమిటెడ్ హక్కులను పొందింది. 1920వ సంవత్సరం డిసెంబరు, 23వ తేదీన పబ్లిక్ రంగ సంస్థగా సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ పేరుతో ఏర్పడింది.

1945లో సింగరేణిలో ఎక్కువ భాగాన్ని 49:51 గా కొనుగోలు చేసిన ఘనత అప్పటి నిజాం నవాబుకు దక్కింది. 1960వ సంవత్సరంలో భారత ప్రభుత్వం మరియు రాష్ట్రప్రభుత్వాలు భాగస్వామ్యంగా ప్రధానంగా సింగరేణి ఉత్పత్తి చేస్తున్న 70.71 శాతం బొగ్గును థర్మల్ విద్యుత్ రంగానికి విస్తరింపచేయడం జరిగింది.

2015-16లో ఉత్పత్తి అయిన 6 లక్షల మెట్రిక్ టన్నుల బొగ్గులో దాదాపు 495 లక్షల మెట్రిక్ టన్నుల బొగ్గును థర్మల్ విద్యుత్ కేంద్రాలకు అలాగే సిమెంట్ తదితర పరిశ్రమలకు 111 లక్షల మెట్రిక్ టన్నుల బొగ్గును అందించడం జరిగింది. మా నాయకుడు ఉద్యమ నాయకుడు అధ్యక్షా. ఆనాడు ఏవైతే మాటలు చెప్పారో వాటిని తు.చ. తప్పకుండా ఈనాడు మన ముఖ్యమంత్రి పాటించారు.

1998వ సంవత్సరంలో గోల్డెన్‌షేక్ హాండ్ అని చెప్పి గతంలో ఉన్న ప్రభుత్వాలు కార్మికులకు ఐరన్ షేక్‌హాండ్ ఇచ్చాయి. రెండు దశాబ్దాలుగా అంటే 1998వ సంవత్సరం నుండి ఉద్యోగులకు డిపెండెంట్ ఉద్యోగాలు ఆగిపోయాయి. తెలంగాణా రాష్ట్రం ఏర్పడిన తరువాత ఆ డిపెండెంట్ ఉద్యోగాలు ఇచ్చిన ఘనత మన గౌరవ ముఖ్యమంత్రి శ్రీ కె. చంద్రశేఖర రావు గారికి దక్కింది. ఈ సింగరేణి సంస్థలో మొత్తం 56 వేల మంది కార్మికులున్నారు. బొగ్గు గనుల శాఖామంత్రి మాట్లాడుతూ ఓపెన్ కాస్ట్ గనులు మరియు భూగర్భ గనులు కలిసి మొత్తం 46 గనులు ఉన్నాయని చెప్పారు. వాటిలో ఓపెన్ కాస్ట్ గనులు ఎక్కువగా గిరిజనులు నివసించే ప్రాంతాలలో ఉండి లాభాలు వస్తుంటాయి.

కానీ, 61 శాతం కార్మికులు పనిచేస్తున్న గనుల విషయమై నేను కొన్ని విషయాలను తమ దృష్టికి తీసుకువస్తాను. 20 ఓపెన్ కాస్ట్ గనులు మరియు 11 భూగర్భ గనులలో 11,600 మందికి ఉపాధి అవకాశాలు కల్పించడమనేది చాలా సంతోషకరమైన విషయం. విదేశాలకు కూడా కంపెనీ విస్తరించడానికి ప్రయత్నం చేస్తున్నారు. తెలంగాణా ప్రభుత్వం ఏర్పడిన తరువాత మన ముఖ్యమంత్రి శ్రీ కె. చంద్రశేఖర రావు గారి ఆధ్వర్యంలో కార్మికులకు, అధికారులలో కొత్త ఉత్సాహం నింపడానికి 600 లక్షల మెట్రిక్ టన్నులు బొగ్గు ఉత్పత్తి చేసి 15 శాతం వృద్ధిని సాధించడమనేది ఎంతో సంతోషించదగ్గ విషయం. దీని వెనక ఆనాడు ఉన్న సిఎండిలు శ్రీ నర్సింగ్ రావు కానీ, శ్రీ భట్టాచార్య గారి కృషికూడా ఎంతో ఉన్నదని ఈ సభా ముఖంగా తెలియచేస్తున్నాను.

సింగరేణి అంటే నల్ల బంగారం అని అనేకమంది చెప్పడం జరుగుతుంది. రాష్ట్ర విద్యుత్ అవసరాలకు మొన్ననే దేశ ప్రధాని జైపూర్‌లోని 1200మె.వా. విద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని ప్రారంభించడం జరిగింది. ఇదొక గొప్ప విషయం. సకల జనుల సమ్మెలో పాల్గొన్న సింగరేణి కార్మికులందరికీ వడ్డీతో సహా జీతం చెల్లించడం జరిగింది. తెలంగాణా రాష్ట్రం కొరకు పోరాడిన కార్మికులకు తెలంగాణా ఇంక్రిమెంట్ కూడా చెల్లించడం జరిగింది. తెలంగాణా రాష్ట్రం ఏర్పడిన తరువాత సింగరేణిలో భారీ ఎత్తున కొత్త నియామకాలు చేపట్టడం జరిగింది. ఈ రెండు సంవత్సరాలలో 5,500 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించిన ఘనత మన ప్రభుత్వానిది.

అధ్యక్షా, గౌరవ ముఖ్యమంత్రిగారి చొరవతో 1998వ సంవత్సరంలో సింగరేణిలో మా నాయకుడు ఉద్యోగాలు వస్తాయని ఆనాడు బహిరంగ సభలో మాట్లాడుతుంటే, వీళ్లు అధికారంలోకి వస్తారంట, ఉద్యోగాలు ఇస్తారంట అని మమ్మల్ని చూసి నవ్వారు. కానీ, ఈనాడు అధికారంలోకి వచ్చిన తరువాత ఆనాడు ఏ మాటైతే చెప్పామో దానికి కట్టుబడి ఉండి ఉద్యోగాలు ఇప్పించిన ఘనత ఈ ప్రభుత్వానిదేనని నేను మనవిచేస్తున్నాను అధ్యక్షా.

**1.00 మ.** సింగరేణి కాలరీస్ అత్యధికంగా బొగ్గు ఏజెన్సీ ప్రాంతాలైన ఆదిలాబాద్, వరంగల్, ఖమ్మం జిల్లాల్లో విస్తరించి ఉన్నది. ఈ ప్రాంతాలలో గిరిజనులు ఎక్కువ మంది ఉన్నారు కాబట్టి వారికి ఉద్యోగాలు కల్పించవలసిన అవసరముంది. ఇక్కడ అనేక జడ్జిమెంట్‌లు ఉన్నాయి. యస్సీ, యస్టీ నాయకులు చాలాసార్లు అధికారుల దృష్టికి తీసుకురావడం జరిగింది. వారికి కేంద్రప్రభుత్వం 7½ శాతం రిజర్వేషన్ ఇస్తే, రాష్ట్ర ప్రభుత్వం 6 శాతం రిజర్వేషన్ ఇవ్వడం జరిగింది. కానీ ఇప్పటికీ సింగరేణి కాలరీస్‌లో 4.9 శాతమే ఇస్తున్నారు. కాబట్టి గిరిజనుల ప్రతినిధిగా నేను తమరి ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకొస్తున్నాను.

ఈ సింగరేణి కాలరీస్‌లో 6 శాతం గనుక ప్రభుత్వం రిజర్వేషన్ ఇచ్చినట్లయితే 665 పోస్టులు గిరిజనులకు వచ్చే అవకాశముంటుంది. తక్షణమే ప్రభుత్వం దీని మీద దృష్టిపెట్టవలసి ఉంది. ఇవ్వాళ 5,500 ఉద్యోగాలు ఇచ్చిన ఏజెన్సీ ప్రాంతాలలో ఓపెన్ కాస్ట్ లేకపోతే ఈరోజు సింగరేణి మనుగడ ఉండేది కాదు. అటువంటిది గిరిజనులు ఎన్నో రోజుల నుంచి ఎదురుచూస్తున్నారు. ఇవ్వాళ బొగ్గు గనుల శాఖ మంత్రి గారు లేరు గానీ, ఏదైతే యస్టీ అసోసియేషన్ ఉందో, వారితో ఒక సమావేశాన్ని ఏర్పాటు చేయవలసిన బాధ్యత ప్రభుత్వంపై ఉన్నది.

అధ్యక్షా, అక్కడ ఏజెన్సీ ప్రాంతాలలో ఇండ్లు లేకుండా పోయాయి. అంతకుముందు నాదెండ్ల మనోహర్ కమిటీ, రాజన్న దొర కమిటీలు రెండూ పరిశీలించిన తరువాత ఆ రోజు భట్టాచార్య సియండిగా ఉన్నప్పుడు 555 ఉద్యోగాలు ఇవ్వాలని ప్రభుత్వానికి రికమెండ్ చేయడం జరిగింది. అది ఇంతవరకు ఆచరణలో లేదు. ఆ పోస్టులకోసం గిరిజనులు ఎదురు చూస్తున్నారు. అదేవిధంగా లాభాలలో అనేక జడ్జిమెంట్‌లు ఉన్నాయి. గిరిజన ప్రాంతాలలో సింగరేణిసంస్థ ద్వారా వచ్చే లాభాల్లో 20 శాతం గిరిజనుల కొరకు ఖర్చు పెట్టాలని జిఓయంయస్ నెం.41 ప్రకారం ఉన్నది. అది ఇప్పుడు ఆచరణలో లేదని తమరి ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకొస్తున్నాను.

అలాగే సొంత జడ్జిమెంట్‌లో అనేక విషయాలను పొందుపరచడమైనది. అలాగే ట్రాన్స్‌పోర్టేషన్, కోల్ వాషర్, బొగ్గు గనులను బీహార్, ఉత్తరప్రదేశ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుండి వచ్చిన ప్రైవేటు కాంట్రాక్టర్లకు ఇస్తున్నారు. ఎక్కడైతే ఓపెన్ కాస్ట్ ఉందో అక్కడ వేలాది టన్నుల బొగ్గు ట్రాన్స్‌పోర్ట్ జరుగుతుంది. కాబట్టి అక్కడ ఉన్నటువంటి గిరిజనులకు ట్రాన్స్‌పోర్ట్ పనులలో 12 శాతం ఉపాధి కల్పించినట్లయితే బాగుంటుంది.

ఎం.ఏ, ఎంబిఏ, ఎంఎస్‌సి, ఇంజనీర్ చదువుకున్నటువంటి విద్యార్థులు ఉద్యోగాలు లేక ఇవ్వాళ రోడ్లమీద తిరుగుతున్నారు. ఈ 60 సంవత్సరాలలో ఎప్పుడూ నిరుద్యోగులు ఉద్యోగాలు ఇవ్వాలని దరఖాస్తులు పెట్టుకుంటారని, తెలంగాణ రాష్ట్రం వచ్చిన తరువాత ఈ 5 సంవత్సరాలలో టాటా, బిర్లా లాగా ఉద్యోగాలు ఇచ్చే విధంగా వారిని తయారు చేయాలనే ఉద్దేశ్యంతో గౌరవ ముఖ్యమంత్రి గారు అనేక సందర్భాలలో అధికారుల దృష్టికి తీసుకుపోవడం జరిగింది. కొంతమంది అధికారులు టాటా, బిర్లా కాదు కదా, బికారి బిర్లా లాగా నిరుద్యోగులను చూస్తున్నారు.

బ్యాంకర్లు గానీ, సింగరేణి అధికారులు గానీ ముందుకు వచ్చి వీళ్లను కనీసం సూటు, బూటు వేసుకునే బిర్లాల్లాగా తయారు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నాను. ఆ రోజులలో ఉద్యమ నాయకుడైన మన ముఖ్యమంత్రి గారు సింగరేణి విషయంలోనే కాదు, యస్సీ, యస్టీ, బీసి, మైనారిటీలు బాగుపడాలనే ఉద్దేశ్యంతో గత 70 సంవత్సరాలలో ఏ ప్రభుత్వం చేయని విధంగా కృషి చేస్తున్నందుకు వారికి, తమరికి ధన్యవాదాలు తెలుపుతూ, సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి: (స్థానిక సంస్థలు – నల్గొండ) అధ్యక్షా, ఈ అంశం మీద మాట్లాడే అవకాశమిచ్చినందుకు ధన్యవాదాలు తెలుపుతున్నాను. ఈరోజు గౌరవ మంత్రి వర్యులు తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత సింగరేణిని కార్మికులకోసం గానీ, సింగరేణి కాలరీస్ ప్రొడక్షన్ పెంచే విషయంలో గానీ తీసుకుంటున్న చర్యల గురించి మాట్లాడారు. ఇవ్వాళ మన ముఖ్యమంత్రిగారు కార్మికుల కోసం తీసుకున్న నిర్ణయాన్ని అభినందిస్తూ, కొన్ని విషయాలు మీ ద్వారా ప్రభుత్వానికి తెలియజేయాలనుకుంటున్నాను.

ఒకప్పుడు సింగరేణి కాలరీస్‌లో 60 అండర్ గ్రౌండ్ గనులు, 10 ఓపెన్ కాస్ట్ గనులు ఉండేవి. ఈరోజు అండర్ గ్రౌండ్ గనుల సంఖ్య 60 నుంచి 30 కి తగ్గించడం జరిగింది. ఓపెన్ కాస్ట్ గనులు 10 నుంచి 15కి పెంచడం జరిగింది. అదేవిధంగా రాబోయే రోజులలో అండర్ గ్రౌండ్ గనులను ఇంకా 30 నుంచి 15 వరకే పరిమితం చేసి ఓపెన్ కాస్ట్ గనులను ఇంకా పెంచాలని సింగరేణి కాలరీస్ యాజమాన్యంతోపాటు ఈ ప్రభుత్వం కూడా ఆలోచన చేస్తుంది.

(అంతరాయం)

ఆరు దశాబ్దాలుగా మా ప్రభుత్వం ఏమి చేసిందో, వారు ఎన్నికల సందర్భంగా ఉద్యమ సమయంలో గౌరవ ముఖ్యమంత్రిగారు ఏమేమి హామీలు ఇచ్చారో.... ఒకప్పుడు అండర్ గ్రౌండ్ గనులు తక్కువగా ఉండేవి. గత ప్రభుత్వాలు అండర్ గ్రౌండ్ గనులను పెంచి, ఓపెన్ కాస్ట్ గనులను తగ్గించాయని, రేపు తెలంగాణ రాష్ట్రం వచ్చిన తరువాత ఓపెన్ కాస్ట్ గనులను చాలా వరకు పెంచి, అండర్ గ్రౌండ్ గనులను తగ్గించి యువకులకు ఉద్యోగాలు ఇస్తామని, ఎటువంటి కాలుష్యం లేకుండా చేస్తామని గౌరవ ముఖ్యమంత్రి గారు ఉద్యమ సమయంలో ఎన్నికల సందర్భంగా హామీ ఇచ్చారని తమరి ద్వారా గౌరవ సభ్యులకు నేను గుర్తు చేస్తున్నాను.

అధ్యక్షా, మన ముఖ్యమంత్రి గారు చేస్తున్న మంచి పనులను, కార్మికుల విషయంలో తీసుకున్న నిర్ణయాన్ని అభినందిస్తూనే, వారు ఉద్యమ సమయంలో చెప్పిన విషయాలను నేను తమరి ద్వారా ఈ ప్రభుత్వానికి గుర్తు చేస్తున్నాను. అలాగే ఇంకా ఎన్నో ఓపెన్ కాస్ట్ గనులు, అండర్ గ్రౌండ్ గనులను కూడా ఓపెన్ కాస్ట్ గనులుగా కన్వర్ట్ చేద్దామని ఆలోచన చేస్తుంది. కానీ అదే అండర్ గ్రౌండ్ గనులని వివిధ రకాలైన మోడర్న్ టెక్నాలజీతో జాగ్రత్తగా చేసే విధానాలు ఈనాడు ప్రపంచంలో చాలా ఉన్నాయి. ఇప్పటికే కొన్ని గనులలో సింగరేణి అధునాతన పద్ధతులను అవలంబిస్తుంది. ప్రభుత్వం మూసి వేసిన కొన్ని అండర్ గ్రౌండ్ గనులని తెరిచి ఈరోజు ఆ టెక్నాలజీని ఉపయోగించి సమానంగా అభివృద్ధి చేయవలసిన అవసరం ఈ ప్రభుత్వానికి ఉన్నది.

గతంలో 1.30 లక్షల ఉద్యోగాలు ఉండేవి. ఈరోజు 50,000 మంది ఉద్యోగులు సింగరేణికి పరిమితమయ్యారు. ఇవ్వాళ ఉద్యోగ శాతాన్ని పెంచడంతోపాటు, యువతకు ప్రాధాన్యం ఇవ్వవలసిన అవసరమున్నది. ఇంతకుముందు రజ్వీ గారు అండర్ గ్రౌండ్ గనుల విషయంలో సేఫ్టీ కన్సర్న్ చెప్పారు. అది మంచి పాయింట్ అధ్యక్షా. కానీ అండర్ గ్రౌండ్ గనులలో ఇప్పుడున్నటువంటి టెక్నాలజీలో మనం కొత్త టెక్నాలజీని వాడితే ప్రమాదాలను నివారించే అవకాశముంది. ప్రపంచ వ్యాప్తంగా చాలా వరకు ఓపెన్ కాస్ట్ గనులని తగ్గించి, అండర్ గ్రౌండ్ గనుల ద్వారానే ఒక క్వాలిటి ఆఫ్ కోల్ సేఫ్టీగా బయటికి తీస్తున్నారు.

ఇంతకుముందు మంత్రిగారు అండర్ గ్రౌండ్ గనులలో లాభం ఉంది, కాబట్టి వాటిని ప్రోత్సహించక తప్పదని మాట్లాడారు. కాని

అండర్ గ్రౌండ్ గనుల విషయంలో లాభం ఉందని, వ్యవసాయానికి పనికి వచ్చే ఎంతో భూమిని, ఊర్లు ఊర్లను తరలించి మనం వాళ్ల నిర్వాసితులను చేసి అండర్ గ్రౌండ్ మైనింగ్ చేసినట్లయితే కాలుష్యానికి కారణమవుతాం. అది తమరు గ్రహించాలని గౌరవ సభ్యులందరికీ కూడా తెలియజేస్తున్నాను.

ఈ ప్రభుత్వం risk gain sharing అనే మెథడ్ ద్వారా long wall టెక్నాలజీని ఉపయోగించి అండర్ గ్రౌండ్ గనులని సమానంగా నడిపినట్లయితే మనం యువతకు ఎన్నో ఉద్యోగాలను కల్పించిన వారమవుతాం. అదేవిధంగా ఈరోజు సింగరేణి కాలరీస్ సంస్థలో వేల కోట్ల రూపాయల మిషనరీ ఉన్నది. వేల కోట్ల రూపాయల మిషనరీ కొనుగోలు చేసి తీసుకొచ్చిన తరువాత వాటి యుటిలైజ్ పెంచి ఎఫిషియంట్‌గా పని చేస్తే వాటి per ton cost ఇంకా తక్కువకు పడే అవకాశముంది. ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్లు 2007 సంవత్సరం నుంచి 2016 సంవత్సరం వరకు PRP (Performance Related Pay) తీసుకొచ్చి ఇంప్లిమెంటు చేయలేదు. ఎవరైతే ఆఫీసర్లు, కార్మికులు పిఆర్‌పి అమలయ్యేటట్లు అందరూ కలిసికట్టుగా కృషి చేసి ఈ మిషనరీని ప్రాపర్‌గా యుటిలైజ్ చేసినప్పుడు ప్రొడక్షన్ వస్తే కాస్ట్ కూడా తక్కువవుతుంది. అది ఇప్పటికే కోల్ ఇండియా లిమిటెడ్‌లో పిఆర్‌పి అనే మెథడ్‌ని ఇంప్లిమెంటు చేస్తున్నారు. కాబట్టి ఇక్కడ కూడా సింగరేణి కాలరీస్‌లో చేసినట్లయితే లాభం జరుగుతుందని తమరి ద్వారా ప్రభుత్వానికి తెలియజేస్తున్నాను.

అదేవిధంగా సింగరేణికి అలాట్ అయిన కోల్ గనులను మైన్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ వాళ్లు టెండర్ పిలుస్తారు. మనం అక్కడ కూడా బొగ్గును ఉత్పత్తి చేయవచ్చు. ఆ ఎండిఓలు డిసైడ్ చేసేటప్పుడు కేవలం కొద్దిమందినే దృష్టిలో పెట్టుకొని చేస్తున్నారు. ఉదాహరణకు ఒడిశా రాష్ట్రంలోని నైనీ అనే కోల్ బ్లాక్‌ను కేంద్ర ప్రభుత్వం మనకు అలాట్ చేసింది. దాంట్లో 500 మిలియన టన్నుల కోల్ మైన్ ఉన్నది. దానిని ఇప్పుడు ఎండిఓ వాళ్లు టెండర్ పిలువాలని సింగరేణి ప్రయత్నం చేస్తుంది. ఆ టెండర్‌లో పాల్గొనే విధంగా చాలా మందికి అవకాశం కల్పించినట్లయితే బాగుంటుంది.

పెద్ద పెద్ద కంపెనీల నుండి టెండర్లను పిలిచి, అందులో ముగ్గురు లేక నలుగురినే క్వాలిఫై చేస్తే, 25 నుండి 30 సంవత్సరాలలో 500 మిలియన్ టన్నుల కోల్ ప్రొడక్షన్ చేయాల్సిన వారు ఎక్కువ ధరకు కోట్ చేయడం వలన సింగరేణికి వేల కోట్లలో నష్టం వస్తుంది. అటువంటి కోల్ బ్లాక్‌ను మనం ఎంతో ట్రాన్స్‌పరెంట్‌గా ఇంటర్నేషనల్ బిడ్డింగ్ ద్వారా పెద్ద పెద్ద కంపెనీలను ఆహ్వానించితే తప్ప మనకు లాభం చేకూరదు. ఈ ప్రభుత్వం పారదర్శకంగా ఉండాలని తమరి ద్వారా మంత్రిగారికి తెలియజేస్తున్నాను.

అదేవిధంగా ఈరోజు ఓపెన్ కాస్ట్ మైన్స్ కొరకు మనం భూసేకరణ చేపట్టడం జరిగింది. ఇంతకు ముందు పురాణం సతీష్ కుమార్ గారు గతంలో తెలంగాణ ప్రభుత్వం హామీ ఇచ్చి కూడా నెరవేర్చలేక పోయిందని చెప్పడం జరిగింది. గత ప్రభుత్వాల గురించి ఊరికే అరిగిపోయిన రికార్డు లాగా మాట్లాడే బదులు ఈరోజు భూసేకరణ కోసం ఎన్నో గ్రామాలలోని ప్రజలను తరలిస్తున్నప్పుడు వారికి ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీని ఇవ్వవలసిన అవసరముంది. నాకు తెలిసి ఇప్పటికీ భూసేకరణ ఆలస్యం కావడం వలనే ఎన్నో ప్రాజెక్టులు ప్రొడక్షన్ మొదలు పెట్టలేక పోతున్నాయి. ఈ మాట వాస్తవం.

**1.20 మ.** మరి ఈ విషయంలో ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకొని భూసేకరణలను వేగవంతం చేయాలి. నిర్వాసితులకు కూడా సరైన R&R(Relief and Rehabilation) ప్యాకేజీ ఇవ్వాలని కోరుతున్నాను. ఓపెన్ కాస్ట్ మైనింగ్‌కు నేను వ్యతిరేకిని కాదు. వీటిని పెంచుకుంటూ, అండర్ గ్రౌండ్ మైనింగ్‌ను పూర్తిగా మూసివేయకుండా రెండింటిని బ్యాలెన్స్ చేసుకోవాలి. అండర్ గ్రౌండ్ మైనింగ్‌ను కొత్త టెక్నాలజీతో, భద్రతను దృష్టిలో పెట్టుకొని వృద్ధి చేస్తే ఓపెన్ కాస్ట్ మైనింగ్‌కు లాభాలు వస్తాయి. అండర్ గ్రౌండ్ మైనింగ్‌కు నష్టం వచ్చినా సరే వీటికి కూడా RGS (Risk Gaining Sharing) పద్ధతిలో టెండర్లను పిలిస్తే హెవీ ఎక్విప్‌మెంట్‌తో తక్కువ రేటుకు ఉత్పత్తి చేయవచ్చని తెలియజేస్తున్నాను.

అదే విధంగా నోట్ల రద్దు వల్ల సింగరేణి కార్మికులు డబ్బుల కోసం బ్యాంకుల ముందు గంటల తరబడి నిలబడిన తరువాత డ్యూటీలకు వెళ్లాలంటే చాలా కష్టమవుతుంది. నోట్ల రద్దు జరిగినప్పటి నుండి వాళ్లకు వచ్చిన జీతాలను డ్రా చేయలేకపోతున్నారు. చిన్న జీతాలకు పనిచేసేవారు చాలా ఇబ్బందులు పడుతున్నారు. కాబట్టి వారి కోసం Mobile ATM కౌంటర్లను రామగుండం, కొత్తగూడెం, మణుగూరు సింగరేణి ప్రాంతాలలో ఏర్పాటు చేయాలని కోరుతున్నాను. గతంలో ముఖ్యమంత్రిగారు ఓపెన్ కాస్ట్ మైనింగ్‌కు వ్యతిరేకంగా మాట్లాడారు. మీరు ఇచ్చిన మాట ప్రకారం మూత పడిన అండర్ గ్రౌండ్ మైనింగ్‌ను తెరిపించండి. కొత్త అండర్ గ్రౌండ్ మైనింగ్‌ను ఏర్పాటు చేసి సింగరేణిని కాపాడాలని కోరుతున్నాను.

MR. DEPUTY CHAIRMAN: There is an announcement to be made.

"I am to announce to the House that Lunch has been arranged for all the Hon'ble Members

in the Dining Hall of Jubilee Hall. All the Members are invited for the Lunch. The Press is also invited for the lunch."

MR. DEPUTY CHAIRMAN: Now, the House adjourns for lunch-break.

(The House then adjourned at 1.22 p.m. to meet again after the lunch-break)

(భోజన విరామానంతరం తిరిగి సభ మధ్యాహ్నం 2 గం.కు ప్రారంభమైనది)

( గౌరవ చైర్మన్ అధ్యక్షస్థానం వహించారు)

## లఘు చర్చ (కొనసాగింపు)

మిస్టర్ చైర్మన్: సింగరేణి కాలరీస్‌పై జరుగుతున్న లఘు చర్చను ప్రారంభించవలసిందిగా శ్రీ బలసాని లక్ష్మీ నారాయణగారిని కోరుతున్నాను.

శ్రీ బలసాని లక్ష్మీనారాయణ: అధ్యక్షా, మొదటగా నాకు ఈ అవకాశం కల్పించినందుకు మీకు నా ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను. తెలంగాణ రాష్ట్రంలో నల్ల బంగారం అని చెప్పుకునే సింగరేణి బొగ్గు మనకున్న అపారమైన సంపదగా భావించవచ్చు. బొగ్గు నిల్వలు మన రాష్ట్రంలో విరివిగా ఉన్నాయి. మన తెలంగాణలో ఇంతకుముందైతే ఆదిలాబాద్, వరంగల్, ఖమ్మం జిల్లాలలో మాత్రమే సింగరేణి బొగ్గు గనులు ఉండేవి. ఇప్పుడైతే కొమురం భీమ్, అసిఫాబాద్, మంచిర్యాల, పెద్దపల్లి, జయశంకర్ జిల్లా, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లా సత్తుపల్లి ఈ ప్రాంతాలతో పాటు, గోదావరి పరీవాహక ప్రాంతాలలో విస్తరించి ఉన్నటువంటి ఈ బొగ్గు గనులు మనకు ఎంతో ఆదాయాన్ని తెచ్చిపెడుతున్నాయి. అంతే కాకుండా 50,000 మంది కార్మికులు ఈ సంస్థలో పనిచేస్తున్నారు. మొదట ఇది ఇల్లందు ప్రాంతంలో 1871లో ప్రారంభమైనది. సింగరేణి ప్రైవేట్ లిమిటెడ్ అనే పేరుతో 1923 డిసెంబర్‌లో ఈ సంస్థను స్థాపించి, ఇక్కడ పనులు కొనసాగిస్తున్నాము.

ఈ సింగరేణి సంస్థ ద్వారా ఓపెన్ కాస్ట్ ద్వారాగానీ, లేదా అండర్‌మైన్ ద్వారా గాని బొగ్గు తవ్వకాలు జరుగుతున్నాయి. ఓపెన్ కాస్ట్ ద్వారా పెద్ద ఎత్తున అంటే దాదాపు 78 శాతం మనకు బొగ్గు సమకూరుతున్నది. అయితే ప్రభుత్వానికి ఆదాయం వచ్చినప్పటికీ, ఓపెన్ కాస్ట్ విధానం కంటే, టెక్నాలజీని ఉపయోగించుకుని అండర్‌గ్రౌండ్ మైనింగ్ చేయవలసిన అవసరం ఉంది. ఎందుకంటే పెరుగుతున్న జనాభాకి అనుగుణంగా భూమిని మనం పెంచలేము. ఓపెన్ కాస్ట్ ద్వారా మనకు లాభంతో పాటు పొల్యూషన్ మరియు పర్యావరణం దెబ్బతినే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. దాన్ని మనం తగ్గించుకోవడానికి ఇతర ప్రత్యామ్నాయాలు వెదకాలి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడకముందు సింగరేణి సంస్థ కేవలం 3 శాతం అభివృద్ధిని మాత్రమే సాధించగా, నేడు కొత్తగా తెలంగాణ రాష్ట్రం వచ్చిన తరువాత 15 శాతం వృద్ధి రేటు నమోదు చేసిన ఘనత సింగరేణి కార్మికులకే చెందుతుంది.

గౌరవ ముఖ్యమంత్రిగారు ఇవన్నీ చూసి, కార్మికులు ఏ విధంగానైతే ఉద్యమంలో పాల్గొన్నారో, తరువాత వారు విధి నిర్వహణలో పడ్డ కష్టాన్ని కూడా గమనించి, ఎప్పుడూ లేని విధంగా, సంస్థకు వచ్చిన ఆదాయంలోంచి 23 శాతం బోనస్ ప్రకటించారు. డిపెండెంట్లకు ఉద్యోగాలు ఇవ్వడం చాలా అభినందనీయం. ఎప్పుడో 15,16 సంవత్సరాల క్రితం రద్దు చేసిన విధానాన్ని పునరుద్ధరిస్తూ, వారసత్వ ఉద్యోగాలకు అనుమతిచ్చారు. మొన్న దసరా పండుగకు కార్మికులకు లక్ష నుండి లక్షా పాతిక వేల రూపాయల వరకు బోనస్ రూపంలో చెల్లించడం వల్ల, సింగరేణి కార్మికులు ఈ ప్రభుత్వం పట్ల కృతజ్ఞతతో ఉన్నారు. అలాగే ఎక్స్‌గ్రేషియా మొత్తాన్ని ఏడు లక్షల నుండి పదిహేను లక్షల రూపాయలకు పెంచిన ఘనత మన ముఖ్యమంత్రిగారికే చెందుతుందని మనవి చేస్తున్నాను. వాలంటరీ రిటైర్‌మెంటు పెట్టుకున్న వారికి ఇంతకుముందు ఐదు లక్షల రూపాయలు వచ్చేది. కాని నేడు ఇరవై ఐదు లక్షల రూపాయలు వారు అందుకుంటున్నారు. ఈ రకంగా ప్రభుత్వం వారికి ప్రోత్సాహం ఇవ్వడం వల్లనే వాళ్లు కూడా కష్టపడి, ఎప్పుడూ లేని విధంగా ఐదు రెట్ల బొగ్గు ఉత్పత్తిని పెంచగలిగారు. కొత్తగా గనులను చేపడుతూనే పర్యావరణాన్ని కాపాడుతూ, వాతావరణ కాలుష్యాన్ని నివారించే చర్యలు కూడా తీసుకోవలసిన అవసరం ఉంది. జనాభా పెరుగుదలతో పాటు మనకు భూమి పెరిగే అవకాశం ఉండదు. కాబట్టి ఉన్న భూమి ఓపెన్ క్యాస్ట్‌కు పోతే, రేపు వ్యవసాయానికిగాని, నివాసానికి గాని ఇబ్బంది కలిగే అవకాశం ఉంటుంది. కాబట్టి ప్రత్యామ్నాయ మార్గాలతో ప్రభుత్వం ముందుకు పోవాలని కోరుకుంటూ, నాకు ఈ అవకాశమిచ్చినందుకు మరోసారి ధన్యవాదాలు తెలుపుకుంటూ, సెలవు తీసుకుంటున్నాను.

మిస్టర్ చైర్మన్: శుక్రవారం 6వ తేది, ఉదయం 10 గంటలకు తిరిగి సమావేశమయ్యేందుకు సభను వాయిదా వేయడమైనది.

(Then the House adjourned at 2.04 PM to meet again on Friday, 6th January, 2017 at 10.00 AM)

☺☺☺

**“Published under Rule 316 of the Rules of Procedure and Conduct of Business in the Telangana Legislative Council and Printed at the Assembly Press, Public Gardens, Hyderabad.”**